# మీరు చదివారా?

## పుస్తకపరిచయాలు

- కృష్ణవేణి




శ్రీ కౌముది

మీ మునివేళ్లలో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 214

కౌముది మాసపత్రికలో

జనవరి 2018 సంచిక నుంచి జూన్ 2019 సంచిక వరకూ వచ్చిన

పుస్తకపరిచయాలు

# (నెలనెలా ఓ పుస్తకం - సమగ్రపరిచయం)

1967 లో బంగ్లాదేశ్ లో పుట్టి, ఇంగ్లాండులో స్థిరపడిన రచయిత్రి మోనికా ఆలీ. ఆమె వ్రాసిన మొట్టమొదటి నవల బ్రిక్ లేన్. ఈ నవల ప్రచురణకి ముందే , 2003 లో , బ్రిటిష్ యువనవలా రచయిత్రిగా బహుమతి పొందారు. ఆ బ్రిక్ లేన్ నవలా పరిచయం ఈ నెల కౌముది పాఠకులకోసం..



మోనికా అలీ మొదటి పుస్తకం కేవలం, 'బ్రిక్ లేన్' అన్న ప్రాంతం గురించి మాత్రమే కాదు. అది French Huguenots నుంచీ వలస వారసత్వం వరకూ– కొత్తగా, 50– 60 లలో జీవనోపాధి వెతుక్కుంటూ వచ్చిన బంగ్లాదేశీయుల గురించి రాసింది.

అక్కడుండేవారు ప్రధానంగా, ఒకానొకప్పుడు పేద గ్రామీణ జిల్లా అయిన సోహెట్ (Sylhet)నుంచి వలస వచ్చినవారు. తమ కమ్యూనిటీతో తప్ప, ఇతర దేశస్థులతో కలిసిమెలిసి ఉండరు. ట్రేడ్ యూనియన్లు వారి జీవితాల్లో ముఖ్యభాగం. 2003లో పబ్లిష్ అయిన 'బ్రిక్ లేన్,'– ప్రధానపాత్ర అయిన నజ్‌నీన్ అనుభవాలమీదా, ethical dilemmas మీదా కేంద్రీకరిస్తుంది. చాలా మట్టుకు కథనం, World Trade Center విషాదానికి ముందరా, తరువాతా లండన్లో జరిగిన బెంగాలీ ముస్లిమ్ వలసదారుల సమాజానికి సంబంధించిన సంఘటనల గురించినది. బంగ్లాదేశ్ లో ఉన్న మేమెన్‌సింగ్ రాష్ట్రంలో, 1967 లో ప్రారంభం అయిన నజ్‌నీన్ కథలో, ఈ భాగం 1985 కీ 2002 కీ మధ్యన నడిచినది.

★★★

ఒక చిన్న గ్రామంలో, గుడెసెలో నజనీన్ పుట్టిన వెంటనే ఏడవకపోవడంతో, నిర్జీవ శిశువనుకుంటారు. హాస్పిటల్‌కి తీసుకెళ్ళడానికి బదులు, కేవలం 'విధి' , అదృష్టం' మీదనే ఆధారపడే తల్లి రూప్‌బాన్– శిశువుని తన గతికి తన్ని వదిలిపెడుతుంది. ఆ నమ్మకాలనే రక్తంలో ఇంకించుకుని, జీవితం తనకి అందించినవాటిని నిష్క్రియగా స్వీకరిస్తూ, నజ్‌నీన్ పెరిగి పెద్దవుతుంది. చెల్లెలు హసీనా స్వభావం పూర్తిగా వ్యతిరేకం. తన ఉద్వేగాలని అదుపులో పెట్టుకోకుండా బతికే స్వేచ్ఛాజీవి. పదమూడేళ్ళపాటు నజ్‌నీన్‌కీ, చెల్లెలు హసీనాకీ మధ్యన సాగిన ఉత్తరాల క్రమం ద్వారానే మనం కథని అర్థం చేసుకుంటాం.

నజ్‌నీన్ ఎక్కువ చదువుకోదు. కొన్నేళ్ళుగా లండన్ ఈస్ట్ ఎండ్‌లో ఉద్యోగం చేస్తూ, తనకన్నా 20 ఏళ్ళు పెద్దయిన ఛానూ అహ్మెద్‌తో చిన్నప్పుడే పెళ్ళయి, అతనితోపాటు లండన్‌లో, బ్రిక్ లేన్‌లో ఉన్న అతనింటికి వెళ్తుంది. ఇంగ్లీష్ రాదామెకి.




*'Nazneen could say two things in English: sorry and thank you.'*

ఛానూతో కలిపి జీవించడం నేర్చుకోవడమే కాక, ఒక పూర్తి కొత్త సంస్కృతికి కూడా అలవాటు పడ్డానికి ప్రయత్నిస్తుంది. రోజూ, తమ దేశంలో ఉన్న పచ్చటి పొలాల్నీ, తన చిన్నప్పటి ఆటలనీ గుర్తు చేసుకుంటూ ఉంటుంది.

పెళ్ళయిన కొత్తల్లో, నాజ్‌నీన్‌కి సాంత్వన కలిగించే కురానుని భర్త తెరవగా ఆమె ఎప్పుడూ చూడకపోయినా కానీ,– అతనికి ఉన్న సర్టిఫికెట్లూ, పుస్తకాలూ చూసి అతని గురించి గొప్పగా ఊహించుకుంటుంది. కాలం గడిచేగొద్దీ, ఛానూ తన ప్రస్తుత జీవితాన్నుండి సంతోషం వెతుక్కునే బదులు, భవిష్యత్తులో తనకి కలగబోయే అవకాశాల గురించి ఎక్కువ ఆలోచిస్తాడని గుర్తిస్తూ, అతని పట్ల చిరాకు పెంచుకుంటుంది. అతను మాటలు చెప్తాడు కానీ వాటిని కార్యాచరణలో పెట్టడు. ఎన్నో యోజనలు తలపెడతాడు తప్ప, గమ్యాన్ని చేరుకునే ప్రయత్నాలు చేయడు. అక్కడుండే అందరు బంగ్లాదేశీయులలాగే భార్యని తాముండే ప్రాంతానికి తప్ప, మరెక్కడికీ వెళ్ళనీయడు.

*"But if you mix with all these people, even if they are good people, you have to give up your culture to accept theirs. That's how it is."*

ఆమె పచారీ సామాన్లు కొనడానికి మాత్రమే బయటకి అడుగుపెడుతుంది. ఆమె ఇంగ్లీష్ నేర్చుకోవడం అతనికి ఇష్టం ఉండదు. ఆమె ఆలోచనలు అతనికి అనవసరం. ఆమె స్నేహితురాళ్ళని ఇష్టపడడు.

*"Why should you go out? 'If you go out, ten people will say, "I saw her walking on the street." And I will look a fool. Personally, I don't mind if you go out but these people are so ignorant. What can you do?"*

భర్త చెప్పేవన్నీ పాటిస్తూ, పరిస్థితులకి అనుగుణంగా తన్ని తాను మలచుకుంటూ, వంటలు వండుతూ, ఇల్లు సర్దుకుంటూ, సంతోషంగా గడపడానికి ప్రయత్నిస్తుంది నజ్‌నీన్. భర్త కాలివేళ్ళ కదర్లని కత్తిరిస్తూ, అతని గురకలని భరిస్తూ, రోజువారీ జీవితానికి అలవాటు పడుతుంది. తన రాక కోసం ఏర్పాట్లేమీ లేకపోయినందువల్ల, మధ్యాహ్నాలు నమాజ్‌లో గడుపుతుంది.

ఛానూ తన్ని ప్రేమిస్తున్నాడనుకుంటుంది. అయితే ఒకరోజు, "ఏ భార్యా లేకపోవడం కన్నా, ఏదో ఒక భార్యంటూ ఉంది చాలు." అని భర్త ఫోన్లో చెప్తుండగా వింటుంది..

'A blind uncle is better than no uncle. I waited too long to get a wife.'

చుట్టుపక్కలున్న కుటుంబాల్లో అధికభాగం సోహెట్ నుంచి వచ్చినవే. ఆడవాళ్ళు వ్యర్థప్రసంగం చేస్తూ, కాలం గడుపుతుంటారు.

*"They don't ever really leave home. Their bodies are here but their hearts are back there. And anyway, look how they live: just recreating the villages here."*

ప్రేమరహితమైన తన వివాహజీవితాన్ని నజ్‌నీన్, హసీనాతో పోల్చుకుంటుంది. భర్తతో జరిపే యాంత్రికమైన శృంగారం ఆమెకే సంతృప్తినీ కలుగజేయదు. కొడుకు పుడతాడు. రకీబ్ అని పేరు పెడతారు. పిల్లాడు మొదటి పుట్టినరోజుకి ముందే జబ్బు పడతాడు. అప్పుడు నజ్‌నీన్ తల్లి బోధించిన 'విధీ, అదృష్టం' గుర్తు తెచ్చుకోక,– కొడుకుకి వైద్యం చేయిస్తుంది. కానీ, పిల్లవాడు చనిపోతాడు. ఆ మరణం భార్యాభర్తలనిద్దరినీ

దగ్గిరకి తెస్తుంది. ఆమె ఛానూకి అలవాటు పడి, అతనంత చెడ్డవాడు కాడనీ తనని ప్రేమించగలిసేవాడనీ గుర్తిస్తుంది. గమ్యానికి చేరడానికి తమ దారులు వేరైనప్పటికీ, తామిద్దరూ వెతుకుతున్నది ఒకటేనని నజ్‌నీన్ అర్థం చేసుకోవడం ప్రారంభిస్తుంది. నజ్‌నీన్ పట్ల గౌరవం చూపాలనీ, తన మాటల్ని చేతల్లో పెట్టాలనీ ఛానూ నిర్ణయించుకుంటాడు.

*"All the while, when Nazneen turned to her prayers and tried to empty her mind and accept each new thing with grace or indifference, Chanu worked his own method. He was looking for the same essential thing. But he thought he could grab it from the outside and hold it against his chest like a shield.*

*Where Nazneen turned in, he turned out; where she strove to accept, he was determined to struggle; where she attempted to dull her mind and numb her thoughts, he argued loud; while she wanted to look neither to the past nor to the future, he lived exclusively in both. They took different paths but they had journeyed, so she realized, together."*

ఆ సంఘటన తరువాతే, పాఠకులకి బంగ్లాదేశీ స్త్రీల జీవితాలమీద అవగాహన కలగడం ప్రారంభిస్తుంది. హసీనా 'ప్రేమ వివాహం' చేసుకుని, ఢాకాకి పారిపోతుంది. తన మొదటి భర్తని వదిలి, కర్మాగారంలో పని చేయడం ప్రారంభించి ఆ ఉద్యోగం పోగొట్టుకుని, కొన్నాళ్ళు వంటమనిషిగా పని చేస్తుంది. ఎన్నో ఉద్యోగాల తరువాత, వేశావృత్తిలోకి దిగి ఆఖరికి, 'లవ్లీ బేగమ్' కాపాడేవరకూ నిరాశ్రయుల స్త్రీల హోమ్‌లో ఉంటుంది.

అక్కాచెల్లెళ్ళు వేల మైళ్ళ దూరంలో ఉన్నప్పటికీ, ఇద్దరు యువతుల జీవితాలూ పెనవేసుకుని ఉంటాయి.

ఇంటిపని చేసేటప్పుడు నజ్‌నీన్ అదే నజ్‌నీన్ కానీ, మొదటిసారి టివిలో ఐస్ స్కేటింగ్ చూసినప్పటినుండీ– ఆమె ఆ షో పట్ల ఆకర్షణ పెంచుకుంటుంది. ఐస్ స్కేటింగ్ స్వతంత్రానికి సాదృశ్యం ఆమెకి.

సంవత్సరాలు గడుస్తాయి.

పాత్రల/సంఘటనల, వర్ణనల వల్ల హసీనా ఉత్తరాలు– బంగ్లాదేశ్‌లో హెచ్చవుతున్న సామాజిక సమస్యలని వెలుగులోకి తెస్తాయి. నజ్‌నీన్ జీవితంలో చోటు చేసుకుంటున్న మార్పులు తెలుస్తాయి పాఠకులకి. ఆమెకి షహనా, బీబీ అన్న ఇద్దరు ఆడపిల్లలు పుడతారు. ఛానూ ఉద్యోగాలు మారుస్తూ, తన వైఫల్యాలని జాత్యహంకారం మీద మోపుతూ ఉంటాడు. అభివృద్ధి చెందుతున్న దేశాలపైన పడుతున్న పాశ్చాత్య దేశపు ప్రభావం గురించి అస్తమానం ఫిర్యాదు కూడా చేస్తూ ఉంటాడు.

*'Because our own culture is so strong. And what is their culture? Television, pub, throwing darts, kicking a ball. That is the white working-class culture.'*

రాత్రిపూట భోజనాల సమయంలో, పిల్లలతో టాగోర్ కవిత్వాన్ని కంఠస్థం చేయిస్తుంటాడతను. బ్రోంటే, ఛాసర్ గురించి ఏకబిగిన మాట్లాడతాడు. కూతుళ్ళు ఇంట్లో కేవలం బెంగాలీలోనే మాట్లాడాలన్న మొండిపట్టు పడతాడు. షహనా జీన్స్ తొడుక్కుంటే, 'చిన్న మేమ్ సాహెబ్' అని ఎగతాళి చేస్తాడు.

తాముండే ప్రాంతంలో మాదకద్రవ్యాల సమస్య ఎక్కువవుతుండటం, కిశోరావస్థలో ఉన్న తన కూతుళ్ళ మీద పడుతున్న పాశ్చాత్య ప్రభావం వల్లా, తన కుటుంబాన్ని తిరిగి బంగ్లాదేశ్‌కి తీసుకు వెళ్దామని నిశ్చయించుకుంటాడు ఛానూ. షహనాకి బంగ్లాదేశ్ వెళ్ళడం బొత్తిగా

అయిష్టం. ఆ అమ్మాయికి బంగ్లా సంగీతం అన్నా, బట్టలన్నా, భోజనం అన్నా చిరాకు. ఢాకా యూనివర్సిటీలో ఇంగ్లీష్, ఫిలాసఫీ బోధించే ఉద్యోగాలున్నాయని, మొదట అక్కడికి వెళ్తానంటాడు ఛానూ. ఆ తరువాత, వివిధ కంపెనీల సబ్బులు కొని, తన దేశంలో సబ్బు ఫాక్టరీ ఒకటి తెరవాలన్న కొత్త ఆలోచన వస్తుంది.

అతని నిర్ణయం ఖరారయిందని వినడంతోనే పెద్ద కూతురు షహనా ఎదురుతిరిగి ఇంటోంచి పారిపోతుంది. తల్లి వెనకాతల పరిగెట్టి, ఆఖరికి కూతుర్ని ఒప్పించి, ఇంటికి తీసుకు వస్తుంది.

యుకెలో 30 సంవత్సరాలున్న తరువాత, ఆఖరికి దేశం చూసే టైమ్ వచ్చిందని నిర్ణయించుకుని టూరిస్టులా తయారయి కుటుంబాన్ని బయటకి తీసుకు వెళ్తాడు ఛానూ. నజ్నీన్ సంతోషంగా ఉండి నవ్వుతూ ఉంటే, 'తనకేమైనా వడదెబ్బ కానీ తగలలేదు కదా! అని బెంగపడతాడు.

ఈలోగా, బతుకుతెరువుకోసం అక్రమ వడ్డీ వ్యాపారి అయిన మిసస్ ఇస్లామ్ వద్దనుంచి డబ్బు అప్పు తీసుకుని, భార్యని ఇంట్లోనే కుట్టుపని చేయడానికి అనుమతించి, ఛానూ కెంప్టన్ కార్స్ కంపనీలో టాక్సీ డ్రైవరుగా కుదురుకుంటాడు. దానికి విరుద్ధంగా, దుమ్ముపట్టి ఉన్న తన పెట్టెలాంటి ఉనికినుండి బయట పడి, టివి చూస్తూ, కూతుళ్ళతో మాట్లాడుతూ, ఇంగ్లీష్ నేర్చుకుని,– నజ్‌నీన్ తనకి తెలియకుండానే కుటుంబపెద్దగా మారుతుంది. ఈ మార్పులన్నీ కుటుంబ సభ్యులమీద ప్రభావం చూపి వారి జీవితాల దశని బలవత్తరంగా మారుస్తాయి.

నవల మధ్యలో తనకి రోజూ కుట్టుపని తెచ్చే యువకుడైన కరీమ్‌తో నజ్‌నీన్ సంబంధం పెట్టుకుంటుంది. ఒక బెంగాలీ భార్యగా, ఆమె ఈ లైంగిక సంబంధంలోకి తేలిగ్గా ప్రవేశించదు. స్థానిక సంఘాన్ని జాగురూకపరచాలన్న ఉత్సాహం ఉన్న కరీంకి కూడా స్వైరవర్తన అయిష్టం. భర్తలా తన్ని తీసిపారేయకుండా కరీం తన అభిప్రాయాలకి విలువనిస్తాడు. కరీమ్ పట్ల ఆమెకున్న ఆకర్షణని, అలీ చిన్నచిన్న వివరాలతో సహా వర్ణిస్తుంది.

*'He still smelled of limes. It made saliva come into her mouth. It made her feel that before she had been sleepy, and now she was awake.'*

*He was the first man to see her naked. It made her sick with shame. It made her sick with desire.'*

నజ్‌నీన్ జీవితంలోకి కరీం ప్రవేశించే సమయానికి, ఆ సమాజంలో ఉండే బెంగాలీ యువత ముఠాలుగా విడిపోతుంది. 'లయన్ హర్ట్స్' అన్న గుంపు ఇస్లాముకి వ్యతిరేకంగా కరపత్రాలు పంచుతున్నప్పుడు, వారి వాదాలని ఎదురుకోడానికీ, తమ మతాన్ని కాపాడుకోడానికీ కరీం, 'బెంగాల్ టైగర్స్' అన్న గుంపుని మొదలుపెడతాడు.

అతను ఏర్పరిచే మీటింగ్సుకి వెళ్తూ ఉన్నప్పుడు, మొదట్లో అతనంటే చాలా మెచ్చుకోలు ఉన్నప్పటికీ, అతని ఇస్లామిక్ పునరుద్ధరణం కూడా సమైక్యం గురించి ఛానూ కనే కలలలాగానే, దుర్బలమైనవేనని గ్రహిస్తుంది నజ్‌నీన్.

*'She had looked at him and seen only his possibilities. Now she looked again and saw that the disappointments of his life.'*

తన భర్త నిరర్థకుడు అవడం నజ్‌నీన్ని ఎక్కువ బలపరుస్తుంది. మానసికంగా స్వతంత్రురాలయే ప్రక్రియలో, మొదట ఆమె ఆర్థికంగా స్వతంత్రం పొందుతుంది–దానికి చాలా కాలం పట్టినప్పటికీ కూడా.

ఇద్దరి స్త్రీల వ్యక్తిత్వాలూ తూర్పూ పడమరా అయినప్పటికీ, పొరుగింట్లో ఉండే సరదా స్వభావంగల రజియాతో స్నేహం, నజ్‌నీన్ ఎదుగుదలకి తోడ్పడటం ప్రారంభిస్తుంది. రజియా బంగ్లా సాంప్రదాయాలని అంతగా పాటించక– సిగరెట్లు కాలుస్తూ, తన పిల్లల బ్రిటిష్ స్టైల్

వస్త్రధారణని ప్రోత్సహిస్తూ ఉంటుంది. నజ్‌నీన్‌తో పోల్చి చూస్తే రజియా జీవితం ఎక్కువ కష్టమైనదీ, కఠినమైనదీ. ఆమె భర్త పని చేస్తుండగా చనిపోతాడు. కొడుకు తల్లినుండి దొంగతనం చేసి డ్రగ్స్ కొనుక్కుంటుంటాడు. రజియా ఇంగ్లీష్ నేర్చుకోడానికి కాలేజీలో చేరుతుంది. రజియా పడే బాధని రచయిత్రి ఒక్కసారి కూడా వర్ణించదు.

బెంగాలీ వలస స్త్రీలగురించి తనకున్న అభిప్రాయాన్ని రజియా నిష్కర్షగా చెప్తుంది.

*'Listen, when I'm in Bangladesh, I put on a sari and cover my head and all that. But here I go out to work. I work with white girls and I'm just one of them. Some women spend ten, twenty years here and they sit in their kitchen grinding spices all day and learn only two words of English.'*

ఆమె నజ్‌నీన్ విధివాదం పట్ల తటస్థంగా ఉంటుంది. ఒకసారి తనకి కరీంతో ఉన్న సంబంధం గురించి నజ్‌నీన్ రజియాకి చెప్పబోయినప్పుడు, రజియా తన వెడల్పాటి భుజాలని తిప్పుతూ, " ప్రేమా! అది ఇంగ్లీష్ స్టైల్.' అని, కొట్టిపారేస్తుంది.

జీవితంలో ఎదురయిన మరెన్నో సంఘటలు, నజ్‌నీన్ ఆమె తన జీవితాన్ని పున:పరిశీలించుకుని, తన జీవితాన్ని అదుపులోకి తీసుకునేలా చేస్తాయి. తన జీవితాన్ని మెరుగుపరుచుకోవాలనే నజ్‌నీన్ ఆందోళనని, తన చెల్లెలి జీవితంలో ఉన్న ఎగుడుదిగుళ్ళ గురించి వస్తుండే ఉత్తరాలు నివృత్తి చేస్తాయి.

నజ్‌నీన్ తల్లి రూప్‌బాన్ ఆత్మహత్య తరువాత తండ్రి తిరిగి పెళ్ళి చేసుకుంటాడు. రెండో భార్య పారిపోతుంది. తల్లి చనిపోయిన శెలవు రోజున ఆమె తనకున్న అతి చక్కని ఎందుకు కట్టుకుని ఉందో, ఆ తరువాత తన అత్త ముంతాజ్ తన తండ్రితో మరెప్పుడూ ఎందుకు మాట్లాడలేదో, ఆ మర్మం ఏమిటో అన్న వివరాలని నజ్‌నీన్ ఎప్పుడూ ప్రశ్నించదు.

తన కుటుంబ అవసరాలు, తీర్చవలిసిన అప్పు, ఆసన్నమవుతున్న ప్రయాణం, తన కాపురాన్ని వదిలి తన్ని పెళ్ళి చేసుకోమంటున్న కరీమ్ పంతం,– ఈ ఒత్తుడులన్నిటివల్లా నజ్‌నీన్ nervous breakdownకి గురవుతుంది. తేరుకున్న తరువాత,– మిసస్ ఇస్లాంని ఎదిరించే ధైర్యం, ఇంటి సభ్యులమీద తన అధికారాన్ని కనపరచే సాహసం, కరీంతో సంబంధం తెంచుకునే శక్తి తనయందే ఉందని తెలుసుకోవడం చేస్తుంది.

ఆఖరికి, ప్రయాణానికి కొరతపడిన డబ్బు డాక్టర్ ఆజాద్ ఛానూకి ఇస్తాడు. కానీ ఆఖరి నిముషంలో తనూ, కూతుళ్ళూ అతనితో పాటు బంగ్లాదేశ్ వెళ్ళలేమని నజ్ నీన్ చెప్తుంది.

'*For Chanu, "the pull of the land is stronger than the pull of blood.'*

నజ్‌నీన్ రజియా సహాయంతో, లండన్లోనే ఉండిపోతుంది. ఇద్దరు స్త్రీలూ ఇతర కొద్దిమంది స్నేహితురాళ్ళతో కలిపి, బట్టలు కుట్టే వ్యాపారం మొదలెట్టి, బంగ్లాదేశీ/ఇండియన్ స్టైల్ బట్టలకోసం ఎక్కువ ధర చెల్లించే పాశ్చాత్య స్త్రీలకి అమ్ముతూ, ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు. రజియా, నజ్‌నీన్ కూతుళ్ళూ కలిపి మొదటిసారి ఆమెని ice-skating rink కి తీసుకెళ్తారు. ఆమె చీర కట్టుకుని కూడా స్కేట్ చేయవచ్చని రజియా చెప్పడంతో నజ్‌నీన్ కనే కల నిజమయి, కథ అంతమవుతుంది.

★★★

పుస్తకంలో హాస్యం పాళ్ళు తక్కువేమీ కాదు. Brick Lane కి ఒక నిర్దిష్టమైన కథంటూ ఏదీ లేదు. ఒక పరాయి దేశంలో, ఒక బెంగాలీ స్త్రీ– కట్టుబాట్లలో చిక్కుకుని, జీవిస్తూ ఉండి, ఆఖరికి ఒక్కతే తన మనుగడ ఎలా సాధించిందో అన్నదే కథాంశం. Council blocks

ల్లో నివసిస్తూ ఉండే అగోచరమైన స్త్రీల జీవితాలు కనిపిస్తాయిందులో. ఈ నవల ఉత్తమ సమకాలీన రచనల్లో ఒకటి. ఒంటరితనం వల్ల నజ్‌నీన్ చాలా సులభంగానే కుంగిపోయే అవకాశం ఉంది. ఆమె జీవితంలో అధిక భాగం స్తబ్ధతే ఆక్రమించుకున్నప్పటికీ, ఆమె అనుభవాలు ఆమె పాత్రకి పదును పెట్టి, తనని ఒక సాహసమైన వ్యక్తిగా మలుస్తాయి. పల్లెటూరునుంచి వచ్చిన ఒక సీదాసాదా గృహిణి, లండన్లో తన జీవితాన్ని తన చేతుల్లోకి తీసుకుని,– స్వతంత్రురాలిగా ఎలా అయిందో చదవడం ఆసక్తికరంగా అనిపిస్తుంది.

ఛానూ వధువుగా లండన్లో కాలు పెట్టిన నజ్‌నీన్, సంపూర్ణమయిన యువతికాదు. అప్పటివరకూ, అలీ శైలి సరళంగా ఉంటుంది. కానీ, నజ్‌నీన్ మానసికంగా ఎదుగుతూ ఉండగా, అలీ వచనం కూడా క్రమేపీ గంభీరతనీ, సంక్లిష్టతనీ సంతరించుకుంటుంది.

మొదట్లో ఛానూ పెద్ద పొట్టా, అతని నిరర్థకమైన సర్టిఫికెట్లూ, అతని నలిగిపోయిన పాంట్లూ, అతను షేక్స్పియర్ని కోట్ చేస్తూ మాట్లాడటం గురించి చదివినప్పుడు, అతని పాత్ర హాస్యాస్పదంగా అనిపిస్తుంది కానీ క్రమేణా తన బలహీనతలూ, తన ఆకారం గురించి ఏ భ్రమలూ లేని ఛానూ కనిపిస్తాడు మనకి. స్త్రీ తన సంస్కృతికి మించి ఎదిగేలా ప్రోత్సహింపబడినప్పుడు, ఆ వివాహానికి కష్టం ముప్పిల్లే పరిస్థితి వస్తుందన్న సంగతినీ, భార్యాభర్తలు దగ్గిరతనాన్నీ, దూరాన్నీ కూడా కలిగి ఉండే వింతైన సంబంధాన్నీ, ఒకరినొకరు నొప్పించుకుంటూ కూడా, ఒకరిమీద మరొకరు ఎలా ఆధారపడ్డారో అన్న విషయాలనీ నిఘూడంగా చిత్రిస్తుంది అలీ.

గంభీరమైన విషయం గురించి రాసినప్పటికీ మోనికా అలీ స్వరం తేలికగా వినిపిస్తుంది. ఆమె హాస్యపోషక స్పర్శ, కథని నాటకీయతనుంచి కాపాడుతుంది.

Tower Hamlets లో ఉన్న బంగ్లాదేశీ స్త్రీల మీదనే కేవలం కేంద్రీకరించిన మొట్టమొదటి నవల బ్రిక్ లేన్. వారి కిటికీలకి వేళ్ళాడే పసుపురంగుకి మళ్ళుతున్న తెలుపు కర్టెన్లు, వారి పడగ్గదుల బయటకి మనల్ని తీసుకు వెళ్ళే ప్రయత్నం చేస్తాయి.

2007 లో ఈ నవల సినిమాగా(ఇదే పేరుతో) తీయబడింది. ఇక్కడ చూడవచ్చు. పుస్తకమూ, సినిమా కూడా కొంతమట్టుకు సంచలనాన్ని సృష్టించినవే. అలీ తమని ఛాందసంగా, వెనుకబడినవారిగా, సాంప్రదాయవాదులుగా, నిరక్షరాస్యులుగా చూపించిందని ఆగ్రహపడిన సోహెట్ సమాజాపు విభాగాలున్నాయి.

మోనికా అలీ పుట్టుక బంగ్లాదేశ్‌లో(అక్టోబర్ 20 October 1967) అయినప్పటికీ, అక్కడామె తనకి నాలుగేళ్ళొచ్చేవరకూ మాత్రమే ఉంది. ఆమె తల్లి బ్రిటిష్ పౌరస్థురాలు, తండ్రి బంగ్లాదేశీయుడు. ఆమె పెంపకం Lancashire లోనూ, చదువు Oxbridge లోనూ సాగింది. ఈ నవల bestseller అయి, 2003లో Man Booker Prize కి shortlist అయింది.

ఇంకా ముద్రించబడని ఈ పుస్తకపు మాన్యుస్క్రిప్ట్ ఆధారంగా, *Granta* పత్రిక ఆమెని బ్రిటిష్ యువ రచయితల్లో అతి ఉత్తమమైన రచయితగా ఎంచుకుంది.

బ్రిక్ లేన్ ప్రాంతంతో ఆమెకి ఎటువంటి వ్యక్తిగత సంబంధమూ లేకపోవడం వల్లా, బెంగాలీ ధారాళంగా మాట్లాడలేకపోవడం వల్లా– రచయితా, ఏక్టివిస్ట్ అయిన Germaine Greer విమర్శలకి ఆమె గురయింది.

ఆ తరువాత ఆమె రాసిన మూడు పుస్తకాలు:

*Alentejo Blue* (2006) *In the Kitchen* (2009) *Untold Story* (2011)

# మై ఫ్యూడల్ లార్డ్– తెహ్మీనా దురానీ

# *My Feudal Lord– Tehmina Durrani*




తెహ్మీనా దురానీ స్త్రీ హక్కుల కార్యకర్త, రచయిత్రి. జన్మ 18 ఫెబ్రవరీ 1953 లో.

పాకిస్తాన్ మాజీ గవర్నర్, పాకిస్తాన్ ఇంటర్నేషనల్ ఎయిర్ లైన్సుకి మాజీ ఛైర్మన్, స్టేట్ బాంక్ ఆఫ్ పాకిస్తాన్‌కి గవర్నర్‌గా పని చేసిన షాకిరుల్లా దురానీ కూతురు తెహ్మీనా దురానీ. తెహ్మీనా ముత్తాత మొహమ్మద్ హయాత్ ఖాన్, బ్రిటిష్ ఇండియాకి పని చేశారు. ఆమె తాతగారు సిలియాకత్ హయాత్ ఖాన్– స్వాతంత్రానికి ముందు, పాటియాలా( భారతదేశపు పంజాబ్)లో మంత్రిగా పని చేసి, స్వాతంత్రం తరువాత ఫ్రాన్సుకి పాకిస్తాన్ రాయబారి అయారు.

ప్రస్తుతం, ఆమె పంజాబ్ (పాకిస్తాన్) మాజీ ముఖ్యమంత్రి నవాజ్ షరీఫ్‌కి తమ్ముడై, పంజాబ్‌కి ముఖ్యమంత్రిగా మూడు సార్లు ఎన్నికయిన మియా మొహమ్మద్ షహ్బాజ్ షరీఫ్‌కి భార్య. పెళ్ళి అయినది 1993 లో.

తెహ్మీనా దురానీ బెనజిర్ భుట్టో చదువుకున్న స్కూల్లోనే చదువుకుంది. జుల్ఫికర్ అలీ భుట్టో ప్రభుత్వంలో, పంజాబ్ రాష్ట్రంలో ఒకప్పటి ప్రధానమంత్రి, భూస్వామీ అయిన మాలిక్ గులామ్ ముస్తాఫా ఖర్‌ని తెహ్మీనా పెళ్ళి చేసుకుంది. అప్పుడది ఆమె రెండో వివాహం. తను ఖర్ భార్యగా గడిపిన 13 ఏళ్ళ కల్లోలకాలం గురించి వర్ణిస్తూ రాసిన ఈ స్వీయ చరిత్ర ముద్రించబడినది 1991లో.

ఆధునిక, సంపన్న కుటుంబంలో పుట్టిన రచయిత్రి గురించిన క్లుప్తమైన పరిచయంతోనూ, భుట్టో పాలనతోనూ కథ ప్రారంభం అయి– జెనరల్ జియా సైనిక పాలనా, బెనజిర్ భుట్టో ఉన్నతి వరకూ కొనసాగుతుంది. రచయిత్రి పుస్తకాన్ని మూడు భాగాల్లోకి విభజించింది: Lion of Punjab, Law of Jungle and Lioness. ఈ మూడు భాగాల్లో 18 అధ్యాయాలున్నాయి.

**Lion of Punjab**: తల్లి సమీనా దురానీ పెళ్ళి చేసుకున్న రెండవ భర్తకి పుట్టినది తెహ్మీనా దురానీ. తల్లి నిరంకుశురాలు. తండ్రి కూడా భార్య ఎదుట నోరు విప్పడానికి భయపడతాడు. పాకిస్తానీ యువతులతో పోల్చి చూస్తే తెహ్మీనా చర్మపు రంగు తక్కువ. తను స్కూల్లో దువుకుంటున్నప్పుడు తన 17వ ఏటే, సౌమ్యుడైన అనీస్‌ని కలుసుకుని అతన్ని పెళ్ళి చేసుకుంటానంటుంది. తల్లితండ్రులు వద్దని పదేపదే వారిస్తారు. 'తను నిజంగా అనీస్‌ని ప్రేమిస్తోందా లేక తన అతను తల్లి బారినుండి తప్పించుకునే మార్గం మాత్రమేనా తనకి!' అని తెహ్మీనా మీమాంసపడినప్పటికీ, చివరికి అతన్ని పెళ్ళాడేస్తుంది. పుట్టిన కూతురికి తాన్యా అని పేరుపెట్టి, తన ఆలనాపాలనాతో సమయం గడుపుతూ ఉంటుంది.

అనీస్ పెద్దమనిషి. భార్యని ప్రేమిస్తాడు కానీ ఆ ప్రేమని సరిగ్గా వ్యక్తపరచడం చాతకానివాడు. అతని నిస్తేజ స్వభావం తెహ్మీనాకి ఉద్రేకం కానీ మోహం కానీ కలిగించలేకపోతాయి. ఒకరోజు భర్తతోపాటు ఒక పార్టీకి వెళ్ళిన తెహ్మీనా– గులామ్ ముస్తాఫర్ ఖర్ దృష్టిని ఆకర్షిస్తుంది. అతను భుట్టో రాజ్యంలో పంజాబ్ రాష్ట్రానికి ప్రధానమంత్రి. అతని తండ్రికున్న ఆస్థీ, భూముల కారణంగా– చిన్న వయస్సులోనే రాజకీయాల్లోకి ప్రవేశించి, పెద్ద పదవిని చేబట్టినవాడు. షేర్– ఏ– పంజాబ్ (Lion of Punjab) అన్న పేరు తెచ్చుకున్నవాడు. స్త్రీలోలుడు. తెహ్మీనాని తన మాటచాతుర్యంతో, తనకున్న పదవితో, అధికారంతో ఆకర్షించి బుట్టలో పడేస్తాడు.

తెహ్మీనా అతనితో శారీరిక సంబంధం పెట్టుకుంటుంది. వీరిద్దరి వ్యవహారమూ ఎవరినుండీ దాగక తెహ్మీనా– ఖర్ స్నేహితుల భార్యలనుండి సూటీపోటీ మాటలని ఎదురుకోవడం ప్రారంభిస్తుంది. ఆ ఆడవారికి, ఖర్ అయిదవ భార్య అయిన షెర్రీ స్నేహితురాలే. ఈ సంగతి తెలిసిన

ఖర్ తన భార్యని బలవంతపెట్టి, తెహ్మీనా వద్దకి వెళ్ళి క్షమాపణ చెప్పమని ఒత్తిడి చేస్తాడు. షెర్రీ భర్త మాటలని తు:చ తప్పకుండా పాటిస్తుంది. కానీ, దానితోపాటు ఖర్ తనని చచ్చేలా కొడతాడనీ, సాక్ష్యంగా తన గతే చూడమనీ తెహ్మీనాని హెచ్చరించి, ఖర్‌తో తను గడుపుతున్న జీవితం ఒక మిధ్య తప్ప దానిలో ఏ సుఖసంతోషాలూ లేవని చెప్తుంది. అయినప్పటికీ కూడా, భవిష్యత్తులో తను ఎదురుకోబోయే వాటిని ఊహించను కూడా లేని తెహ్మీనా, షెర్రీమీద జాలయితే పడుతుంది కానీ తన ప్రేమతోనూ, ఆకర్షణతోనూ ఖర్‌ని తను మార్చుకోగలనని భ్రమ పడుతుంది.

ఆమె విడాకులు కావాలని భర్త అనీస్‌ని అడిగినప్పుడు అతనికి బాధ కలిగినప్పటికీ, అడ్డంకులేవీ పెట్టకుండానే ఒప్పుకుంటాడు. అయితే, తాన్యా మీద పడే ఖర్ ప్రభావంమీద నమ్మకం లేక, కూతుర్ని తెహ్మీనా చేతికి అప్పగించడానికి నిరాకరిస్తాడు.

తెహ్మీనాకీ ఖర్‌కీ పెళ్ళవుతుంది. అయితే, ఆమె కనే బంగారు కలలు కాస్తా పీడకలలుగా మారడానికి ఎంతో కాలం పట్టదు. ఖర్ ఆకర్షణ మాయం అయి, అతని పశుత్వం బయటపడ్డం మొదలవుతుంది. అతన్ని పెళ్ళి చేసుకోవడం వల్ల తన పుట్టింటి సహకారాన్ని కోల్పోయి, తెహ్మీనా ఖర్ కబంధ హస్తాల్లో చిక్కుకుంటుంది. షేర్- ఏ- పంజాబ్‌కి గాండ్రించడం తెలుసు. అమాయకురాళ్ళైన స్త్రీల జీవితాలని నాశనం చేయడానికి సందేహించడు. ఒకసారి తెహ్మీనా వంట చేస్తుండగా, అతనేవో కబుర్లు చెప్తూ ఆమె వాటిని నమ్మలేదనుకున్నప్పుడు- ఆమెని కొట్టబోతాడు కానీ ఆమె ప్రతిస్పందన చూసి, తెహ్మీనా మౌనంగా బాధననుభవించే స్త్రీ కాదన్న సంగతిని లీలగా గ్రహిస్తాడు. మొదటిసారి ఖర్ హింసాత్మక ప్రవర్తనని చూసిన తెహ్మీనా నిర్ఘాంతపోతుంది. తప్పు చేసిందనుకున్న బానిస వెజైనాలో కారప్పొడి కూరమని ఖర్ తన నౌకర్లకి పురమాయించినప్పుడు, తెహ్మీనాకి అతని స్వభావం పూర్తిగా అర్థం అయి, అతని ఆ చీకటి కోణం గురించి పరిచితురాలైన తరువాత అతని దౌర్జన్యానికి అలవాటు పడ్డం ప్రారంభించి, తన వివాహబంధంలో ఉన్న డొల్లతనం గుర్తిస్తుంది.

తన మాజీ భర్త అనీస్‌తో తెహ్మీనా ఇంకా ఫోన్లో మాట్లాడుతోందో ఏమిటో, అతన్ని కలుసుకుంటోందేమో అన్న అనుమానంతో, ఖర్ మళ్ళీ ఆమెని చావబాదుతాడు. ఆమె మీద నిఘాపెట్టి, ఇంటినుండి బయటకి కాలు పెట్టనీయడు. అకారణంగా ఆమె మీద అస్తమానం చెయ్యెత్తడమే కాక ఆమెని హింసిస్తూ ఉంటాడు. న్యూస్ పేపర్లు చదవనీయడు. స్నేహితురాళ్ళని కలుసుకోనీయడు. ఆమె తల్లితండ్రులతోనూ సంబంధం తెంచేస్తాడు. తెహ్మీనా రాస్తుంది:

"I had no power, no rights, and no will of my own".

తెహ్మీనా తన భర్త అభిరుచులకి అనుగుణంగా తన వస్త్రధారణనీ, తన మేక్- అప్‌నీ, తన పొడుగాటి జుత్తు అలంకరణనీ మలుచుకుంటుంది. వివాహిత స్త్రీలు పాటించవలిసిన నియమాలన్నిటినీ అనుకరిస్తూ, వాటిల్లోంచి సంతోషం పొందడం కూడా నేర్చుకుంటుంది.

'The women in our circle did not seem to look beyond their raised noses. They chattered endlessly about disobedient servants, clothes, jewellery and interior decorations.... Many a day in the lives of these women was completely devoted to the topic of what to wear that evening.'

ముస్తాఫాకి స్త్రీలు అణిగిమణిగి పడి ఉండటమే ప్రధానం. ఈ లక్షణం పాకిస్తాన్లో ఒక్క భూస్వాములకే కాదు, ఏ సగటు పాకిస్తానీ పురుషుడికయినా ఉంటుంది. తన పుట్టింటివారు ఆధునిక జీవితమే గడిపినప్పటికీ, అక్కడ దాగి ఉన్న సాంప్రదాయకమైన వాతావరణం, తెహ్మీనా భర్త తనమీద చేసే శారీరిక హింసనీ, లైంగిక దాడినీ తన విధికి భాగంగా అంగీకరించేలా చేస్తుంది. ఆమె తల్లి మాటలు వీటిని సముచితంగా దృష్టాంతపరుస్తాయి:

'If a husband behaves in a strange or unreasonable manner, you should treat him like a sick human being, like someone who needs medical care and treatment. Deal with him like a psychiatrist.

స్త్రీ కూడా పొలంలాగానే అధికారానికీ, పరపతికీ చిహ్నం అనీ ఉపయోగించుకోడానికి మాత్రమే పనికి వచ్చేదన్న అభిప్రాయం ఉంటుంది ఖర్‌కి. అలా అని చాలాసార్లు చెప్తాడు కూడా. తెహ్మీనా మనస్సులోకి 'విడాకులు' అన్న ఊహ వచ్చినప్పటికీ, అప్పటికే ఒకసారి తను అనీస్ నుంచి విడాకులు పొందినది కనుక, మళ్ళీ అలా అయితే పాకిస్తానీ సమాజంలో తన స్థితి ఇంకా దిగజారుతుందని ఆమెకి తెలుసు.

***Law Of Jungle:*** 1977 తిరుగుబాటు తరువాత, జనరల్ జియా ఉల్ హక్– సైనిక శాసనాన్ని విధించినప్పుడు, ఖర్ ఇతర కొద్దిమంది PPP (పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ) నాయకులతోపాటు జైలుకి వెళ్తాడు. విడుదల అయీ అవగానే, భార్య తెహ్మీనాతో పాటు మెక్కా మీదగా ఇంగ్లాండ్ పారిపోయి, స్వీయ ప్రవాసంలో 11 ఏళ్ళుంటాడు. ఆ కాలపరిధిలో, అతను పాకిస్తాన్ ప్రజాస్వామ్యాన్ని పూర్వస్థితికి తేవడానికి రహస్య కార్యకలాపాలు కొనసాగిస్తూ, జనరల్ జియాకి ప్రధాన ప్రత్యర్థి అవుతాడు.

రాజకీయ ప్రవాసంలో ముస్తాఫా పేరిట ఏ ఆస్థీ లేక, అతను కష్టాల్లో ఉన్నప్పుడు తెహ్మీనా అతనికి పూర్తి సహకారాన్నందిస్తుంది. అప్పుడక్కడున్న తన పుట్టింటివారు అతన్ని అంగీకరించేలా ప్రయత్నిస్తూ, తల్లితండ్రుల ప్రేమని తిరిగి పొందడానికి ప్రయత్నిస్తుంటుంది. ఆ సమయాన్న, తెహ్మీనా తల్లితండ్రులు ముస్తాఫాని– అతని విపరీతతత్వం, దురాగతాలూ వంటి అన్ని అవగుణాలతోనూ అంగీకరిస్తారు. కూతురూ అల్లుడూ కలిపి సుఖంగా బతకాలనే ఆశతో, తమ లండన్ అపార్టుమెంట్లో వాళ్ళని ఉండమని చెప్తారు. ముస్తాఫా, తెహ్మీనా కలిపి నాగరీకమైన జీవితం ప్రారంభిస్తారు. అప్పుడే తండ్రి తెహ్మీనాని హెచ్చరిస్తాడు :

'You can only leave his home in a coffin.'

మామగారి ఆమోదమూ, అత్తగారి ధోరణీ ముస్తఫా ధైర్యాన్ని ఎక్కువ చేస్తాయి. ఒకవైపు తెహ్మీనా మీద క్రమం తప్పకుండా శారీరిక దాడి సాగిస్తూనే, ఆమె ఆఖరి చెల్లెలయిన 13 ఏళ్ళ ఆదిలాతో రహస్య సంబంధం పెట్టుకుంటాడు. నిజానికి, ఈ వైవేహేతర సంబంధానికి నాంది పలికినది ఆదిలాయే. ఖర్ ఆ పిల్లని హోటెల్లో కలుసుకుంటూ ఉండి, ఆ అమ్మాయి గర్భం దాల్చినప్పుడు, ఆమెకి దగ్గిరుండి గర్భవిచ్ఛిత్తి చేయిస్తాడు. ఆ సంబంధం యుకెలో మూడేళ్లపాటు కొనసాగుతుంది.

వీళ్ళిద్దరి గురించీ తెలిసినప్పుడు, తెహ్మీనా గాభరాపడుతుంది. కోపం తెచ్చుకుంటుంది. భర్తతో పోట్లాడ్డానికి ప్రయత్నిస్తుంది. కానీ, తల్లితండ్రుల దృష్టిలో భర్త దిగజారతాడనే భయంతో, చెల్లెల్ని మాత్రం ఒక్కమాటా అనదు. ఒకసారి ఖర్ తన తుపాకీ కొనతో ఆమెని గుచ్చుతూ, నిర్దాక్షిణ్యంగా కొడతాడు. తెహ్మీనా బట్టలూడబీకి, వివస్త్రని చేయడంతో ఆమె ఆత్మగౌరవానికీ, భద్రతకీ మిగిలి ఉన్న అవశేషాల చిహ్నాలని కూడా విడవడతను. ఈ ఉదంతం తన ఆత్మపైన బలవత్తరమైన ప్రభావం చూపినప్పుడు, తెహ్మీనా వర్ణిస్తుంది:

'This episode would cripple my spirit perhaps beyond salvation. From this movement forward it would be nearly impossible for me to function as an individual. There was not one iota of self- esteem left. The shame had burned it down to ashes'

ఇన్ని సమస్యల మధ్యా తెహ్మీనా గర్భవతి అవుతుంది. ఊహించలేని పరిస్థితులు ఎదురయి, మగ డాక్టరు చేత పరీక్ష చేయించుకోవలిసి వచ్చినప్పుడు, అది ముస్తఫా పురుష అహంకారాన్ని దెబ్బ తీస్తుంది. ఆమె క్షమించరాని తప్పు చేసిందనుకున్న ముస్తఫా, గర్భవతి అయిన భార్యని ఆమె తల్లితండ్రుల ఇంట్లో, చేతికి ఏది దొరికితే దానితో కొడతాడు. తెహ్మీనా దీనికి అభ్యంతరం తెలిపినప్పుడు, ఆమె తల్లితండ్రుల ఎదుట కపట సానుభూతి కనబరుస్తూ ఖర్ చెప్తాడు:

'Tehmina isn't well at all. .. She's imagining things,'

ఇంక అన్యాయాన్ని భరించలేక, తెహ్మీనా నోరు విప్పుతుంది:

'This is my father's house and I do not think that you should dare to lift a hand on me here'"

ఈ మోసాలూ, అబద్ధాలూ, అక్రమాలూ నిండిన జీవితం గడుపుతూనే ఆమె– అలీ ఖర్, హమ్జా ఖర్ లని కంటుంది. భార్యని కొట్టిన చాలాసార్లు ఖర్ పశ్చాత్తాప్పపడుతూ, తనని క్షమించమని తెహ్మీనాని వేడుకుంటూ ఉంటాడు. ఒక్కోసారి, ఆమె వొళ్ళో తల పెట్టుకుని కన్నీళ్ళు కూడా కారుస్తాడు.

'A prisoner ultimately settles into a monotonous routine. Anger recedes, senses dull. The spirit is crushed.'

ఖర్ కఠినహృదయాన్నీ, అతని స్త్రీ లోలత్వాన్నీ సహిస్తూ– అలా కాలం గడుస్తూ ఉండగా, తెహ్మీనాకి నసీబా ఖర్, నిషా ఖర్ లు పుడతారు. తెహ్మీనా విడాకుల గురించి ఎన్నోసార్లు ఆలోచిస్తుంది. అయితే, భర్త మారతాడన్న స్త్రీకుండే విలక్షణమైన ఆశతో– దౌర్భాగ్యం, దౌర్జన్యం నిండిన వైవాహిక జీవితంలో తిరిగి కాలు పెడుతుంటుంది. పిల్లల్ని వదులుకోలేకే ఆమె ఖర్ నుండి వేరుపడనప్పటికీ, ఆ పిల్లల్నే ఆమెనుండి ఎత్తుకుపోయి, దాచేసి, ఆమె పుట్టింటివారి ఎదుట ఆమెని అవమానపస్తూ– ఆమెని భౌతికంగా, మానసికంగా కూడా ఉపాయంగా బలహీనురాలిని చేయడం తెలిసిన ఖర్ ఆమెని తనని వదిలి ఎక్కడికీ వెళ్ళనీయడు కూడా.

అప్పటికల్లా ఆదిలాతో అతని సంబంధం బయటపడుతుంది. మెల్లిమెల్లిగా ఖర్ అంటే ఉన్న అయిష్టతని పోగొట్టుకుంటున్న తెహ్మీనా తల్లి కాస్త్రా, తప్పంతా అతనిమీదే మోపి అదిలాని వెనకేసుకు వస్తుంది. తెహ్మీనా తన ఆత్మగౌరవం కోసమూ, హక్కులకోసమూ ఎంత పెనుగులాడినప్పటికీ కూడా తన పుట్టింటివారు తన్ని సమర్థించరనీ, తనకి సహాయం అందించేవారెవరూ లేరనీ గుర్తించినప్పుడు– ఆమె ప్రతిఘటన బలహీనమవుతుంది. భౌతిక మద్దత్తు కానీ మానసిక సహాయం కానీ లేక, నిరాశాజనకమైన భవిష్యత్తు కళ్ళముందు కదలాడుతున్నపుడు భర్తతో రాజీపడుతూ ఉంటూనే, 'తన కష్టాలని తగ్గించమనీ, భర్త తన లోపాలని గుర్తించేలా చేయమనీ' అల్లాకి ప్రార్థించడంలో ఓదార్పు పొందుతుంటుంది.

పితృస్వామ్య సమాజంలో స్త్రీలకి నేర్పబడే ప్రధానమైన బోధన– 'భర్తవల్ల ఏ వ్యక్తిగత సంక్షోభం, ఏ అన్యాయం ఎదురుకున్నాకానీ, అది బయటపెట్టకుండా జాగ్రత్తపడి తన భర్తకి హాని కలిగించవద్దు.' అన్నది. అయినప్పటికీ, సామాజిక నిర్బంధాలకి కూడా పరిమితులుంటాయి. ఒకరోజు, భర్త తనని యధాప్రకారంగానే కొట్టబోయే ప్రయత్నం చేసినప్పుడు ఆమె గట్టిగా హెచ్చరించి, కోపంతో తిప్పికొడుతుంది:

'The next time you raise your hand on me. I will pick- up a knife and kill you'

1979 లో జరిగిన భుట్టో ఉరితీతతో పాకిస్తాన్ రాజకీయాల్లో మార్పులు వస్తాయి. అమెరికా జియాకి ఆర్థిక సహాయాన్ని అందించడంతో అతని స్థానం పటిష్టం అవుతుంది. కానీ, దేశ బహిష్కారంలో ఉన్న పాకిస్తానీయులు మాత్రం, 'జియా ఎప్పుడు స్థానభ్రష్టం చెందుతాడా!' అని ఎదురు చూస్తూ ఉంటారు. జియా ప్రభుత్వాన్ని పడగొట్టే వారి ప్రయత్నపు నిరర్థకతని ఖర్ గుర్తించి, ఒక ప్రణాళికని పాటిస్తూ, సమస్త ఖండం ప్రయాణిస్తాడు. వలసలో ఉన్న పాకిస్తానీ ప్రజలందరినీ కూడదీసి, వారిని కలుసుకుంటూ, అలుపన్నది లేకుండా పబ్లిక్ మీటింగ్స్ పెట్టి పాకిస్తాన్ ప్రభుత్వంలో మంచి మార్పు రావాలంటూ లెక్చర్లిస్తూ ఉంటాడు.

అతని ఈ పక్షాన్ని చూసిన తెహ్మీనాకి తమ దేశం సైనిక శాసనంనుండి తప్పించుకోగలిగే అవకాశం ఉందేమోనన్న ఆశ కలిగి, ఖర్ మాటల వల్ల ప్రోత్సాహం పొందుతుంది.

ఈ సంఘటన తరువాత తెహ్మీనా భర్తతో విడివడక, అతనితోపాటు దౌత్యవర్గంలో భాగంగా భారతదేశానికి వస్తుంది. జియాని పదవీచ్యుతునిగా చేసే కుట్రలో భారతదేశపు RAW తో ఖర్ చేతులు కలపడం గురించిన కొన్న ఆశ్చర్యకరమైన సంగతులని వెల్లడిస్తుంది తెహ్మీనా. మీటింగ్ పూర్తయిన తరువాత ఆమె ఇద్దరు సెక్యూరిటీ స్త్రీలు తనతోపాటు ఉండగా, అజ్మేర్ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుంటుంది 'My two shadows were at my side as I entered the shrine. Their Hindu presence disturbed my Islamic prayers....I asked God to curb Mustafa's bouts of violence and insanity. I want a normal home with peace and harmony. I prayed that God would give Mustafa respect and end in exile.'

భారతదేశంనుండి తిరిగి వచ్చాక, పరస్పర సమ్మతితో విడిపోడానికి నిశ్చయించుకున్న ఖర్, తెహ్మీనాలు వేరువేరుగా ఇంగ్లాండ్ న్యాయస్థానం క్రింద అవసరం అయిన పత్రాలని దాఖలు చేస్తారు. అవి మంజూరు చేయబడి, చట్టపరంగా ఇద్దరూ విడిపోతారు. ఆమె తన కక్ష సాధించుకుంటుంది కానీ ఆమె తన్ని విడిచిపెట్టిందన్న విషయాన్ని ముస్తాఫా అహం అంగీకరించలేకపోయి, అవమానం భరించలేక తిరిగి ఆమెని మంచి చేసుకునే ప్రయత్నాలు చేస్తాడు కానీ, తెహ్మీనా లొంగదు. అతన్ని వదిలించుకోవాలన్న ఆలోచనతో, తన పొడుగాటి జుట్టుపైన ఖర్‌కి ఉన్న వ్యామోహాన్ని చంపేస్తున్నానని సూచిస్తూ, ఆమె తన జుత్తుని పొట్టిగా కత్తిరించేసుకుంటుంది:

'Mustafa soon heard and understood its significance. He knew that I had finally decided not to return to him ever again otherwise I would not have done away with what he loved most about me. Without my hair he was a weak Samson.'

అయినా, ఖర్‌కి ఆమెని విడిచిపెట్టే ఆలోచన ఉండదు. తమ దేశాన్ని సైనిక పాలన యొక్క కంబంధ హస్తాలనుండి రక్షించాలనే తనకున్న ఘనమైన లక్ష్యాన్ని ఆమెకి ఆశగా చూపినప్పుడు, అది ఆమెని ఉత్సాహపరుస్తుంది. తిరిగి ఆమెని పొందడంలో అతను మరొకసారి కృతకృత్యుడవుతాడు. ఒక విధమైన సైద్ధాంతిక సంబంధం వాళ్ళిద్దరినీ కలిపి, వారు తిరిగి పాకిస్తాన్ చేరుకునేలా చేస్తుంది.

1988 లో అతను తల వంచుతూ, తన అహంకారాన్ని పక్కకి పెట్టి– క్షమించమని దేశాన్ని అర్థిస్తూ పాకిస్తాన్లోకి –తెహ్మీనాతోనూ తన నలుగురు పిల్లలతో పాటూ అడుగుపెడతాడు. జెనరల్ జియా పట్ల తిరుగుబాటు గురించి అతను ఏర్పాటు చేసిన కుట్రా, మరి కొన్ని కేసులూ అతనిమీద ఉండటంవల్ల అతను కరాచీ ఎయిర్‌పోర్ట్‌లో దిగీ దిగగానే, అతన్ని అరెస్టు చేసి జైల్లో వేస్తారు.

అప్పుడు, తొలిసారిగా తెహ్మీనా అతని భార్యగా ప్రజా దృష్టిని ఆకర్షించి, నాయకురాలిగా అంగీకరించబడుతుంది. చట్టబద్ధంగా విడిపోయినప్పటికీ, ఒక బాధ్యతగల భార్యగా తెహ్మీనా జైల్లో ఉన్న ముస్తాఫాని తరచూ కలుసుకుంటూ, అతన్ని విడిపించడానికి ప్రజల మద్దతును కూడగట్టుకుంటూ ఉంటుంది. ఆమె తప్పితే అతనికి ఇంకే విధమైన సహకారమూ లేకపోవడంతో, అతను తన కోపాన్ని అదుపులో పెట్టుకోడానికి ప్రయత్నిస్తాడు. అయినప్పటికీ, అతని వక్రబుద్ధీ, విపరీతతత్వమూ అతని ప్రయత్నాన్ని అధిగమించి, తన పుట్టినరోజున తన్ని చూడాలని వచ్చిన తెహ్మీనా పట్ల కామం తిరిగి తలెత్తి జైల్లోనే ఆమెని రేప్ చేస్తాడు. అప్పుడామె తనకి కొత్తగా జరిగిన సర్జరీనుంచి సరిగ్గా కోలుకుని కూడా ఉండదు. ఆ సంఘటన తరువాత, తెహ్మీనా ఇస్లామిక్, 'ఖులా' లేక విడాకుల కోసం అర్జీ పెట్టుకుంటుంది. ఆమె మాత్రమే తన విడుదలకి ఏకైక మార్గం అని గ్రహించిన ముస్తాఫా తమ పెళ్ళి చెడకుండా ఉండటానికి అనేకమైన ప్రయత్నాలు చేస్తాడు. ఆమె ఆదర్శ సమాజం గురించి కలలు కనేలా ఆమె ఆలోచనలని తనకి అనుకూలంగా మలచడానికి, మళ్ళీ విజయవంతంగా ప్రయత్నిస్తూ ఆమెమీద వొత్తిడి తెస్తాడు. ఆమె తిరిగి అతని విడుదల కోసం ప్రచారం చేయడం మొదలెడుతుంది:

'I feel suddenly in love with a noble idea – the return of the exiled leader. My original love for Mustafa was replaced by faith in his mission.'

రెండున్నరేళ్ళ తరువాత ఖర్ విడుదలవుతాడు.

ముస్తాఫా జైలునుండి బయటకి వచ్చాక, అతని నిజస్వరూపం మళ్ళీ బయటపడుతుంది. అతను అణగదొక్కబడిన ప్రజల ప్రతినిధి కాదు. స్వార్థపరుడూ, అసూయకి బానిసా, అహంభావీ అయిన పాత ముస్తాఫాయే. తను జైల్లో ఉన్నప్పుడు, తెహ్మీనా తన చుట్టూ కూడగట్టుకున్న స్నేహితుల సహకారం పట్ల అతను ఈర్ష్యతో రగిలిపోతూ, తన విడుదలకి కారణం ఆమే అని గుర్తించడానికి కూడా నిరాకరిస్తాడు. అప్పుడే తెహ్మీనాకి ఉన్న ఒకే ఒక్క ఆశా కిరణం అయిన అమ్మమ్మ మరణిస్తుంది. అప్పటికి, పాకిస్తాన్‌కి తిరిగి వచ్చి ఉంటుంది తెహ్మీనా కుటుంబం. ముగిసిపోయిందనుకున్న ఆదిలా అధ్యాయం మళ్ళీ ప్రారంభం అవుతుంది. ఖర్ జైలు బయటకి వచ్చీ రావడంతోనే, నేరుగా ఆమెతో తనకున్న పాత సంబంధాన్ని కొనసాగిస్తాడు. అప్పటికే ఆదిలాకి పెళ్ళయిపోయినాకానీ ఆమె కూడా తన భర్తని పట్టించుకోదు. అప్పుడు, తన నలుగురి పిల్లల సంరక్షణా వదులుకోడానికి కూడా సిద్ధపడి తెహ్మీనా, ఖర్‌ని పూర్తిగా వదిలేయాలని నిశ్చయించుకుని తన విడాకుల ప్రక్రియని ముగిస్తుంది. తను లేకపోతే ఆమె ఉనికి పైసాకి కూడా చెల్లదన్న ముస్తఫా మాటలని పట్టించుకోకుండా తన ఈ స్వీయచరిత్రని రాయాలన్న నిర్ణయం తీసుకుంటుంది. ఆస్తిమీద తనకున్న హక్కులన్నిటినీ వదిలేసుకుని, తనింక విధేయురాలైన, వినయం ఉట్టి పడుతూ, రాజీపడుతూ ఉండే సహనశీలత ఉన్న స్త్రీని కాదంటూ, అందరిముందూ ఆమె బాహాటంగా ముస్తాఫాతో చెప్తుంది:

'Your marriage according to the Koran, was over years ago when you slept with my sister, I have been living with you in sin. The contract stood null and void long ago.'

అణిచివేతనుంచి విముక్తురాలయిన తెహ్మీనాకి కలిగిన నమ్మకం ఇది:

'Silence condones injustice, breeds subservience and fosters a malignant hypocrisy. Mustafa Khar and other feudal lords thrive and multiply on silence. Muslim women must learn to raise their voice against injustice.'

ఆఖరికి, ఆమె నిరంకుశమైన ఆ చట్రాన్ని తప్పించుకుని, ''విడాకులు పొందిన స్త్రీ', అన్న కళంకాన్ని భరిస్తుంది. ముస్తఫాతోపాటు ఉంటూ ఉన్నప్పుడు ఆమె అనుభవించిన అతి బాధాకరమైన ఆ కాలంలో, తనకి అత్యంతవరసరమైన తల్లితండ్రుల భావోద్వేగ మద్దతు తెహ్మీనాకి దొరకదు. 13 ఏళ్ళపాటు తన ఆత్మగౌరవాన్నీ, వైయుక్తికతనీ పణంగా పెట్టి, అసూయ పడనవసరం లేని వైవాహిక జీవితం గడిపిన తెహ్మీనా, తన అస్తిత్వాన్ని తిరిగి పొందేటందుకు లేచి ధృడంగా నిలబడుతుంది.

ఈ పుస్తకంలో ముస్తాఫావంటి భూస్వాములకి అసలైన శక్తిని అందించేవి ఇస్లాం గురించిన వక్రీకృత పాఠాంతరాలూ, దానికి స్త్రీలు మౌనంగా మద్దతు పలకడమేనని పుస్తకంలో తెహ్మీనా వాదిస్తుంది. ఫ్యూడల్ లార్డ్స్ గురించి రచయిత్రి చెప్పిన మాటలు పుస్తకం మొదట్లోనే ఉన్నాయి.

'There is a fantasy of a feudal lord as an exotic, tall, dark and handsome man, with flashing eyes and traces of quick-tempered gypsy blood. Images of him parrying thrusts with the fiercest of swordsmen and riding off into the sunset on his black steed set the pubescent heart aflutter. He is seen as a passionate ladies man and something of a rough diamond, the archetypal male chauvinist who forces a woman to love him despite his treatment of her.

But the fantasy is far from reality, and my country of Pakistan must face up to reality of it is ever to grow and prosper. '

ఈ అధ్యాయాలన్నిటిలో ఒక పురోగతి స్పష్టంగా కనబడుతుంది. ధనిక వర్గానికి చెందిన సాధారణ గృహిణిగా జీవితం ప్రారంభించిన తెహ్మీనా, స్త్రీల సమానహక్కులు, స్త్రీ సాధికారత కోసం పోట్లాడుతుంది/తోంది ఇప్పుడు.

ప్రారంభ దశలలో ఉన్న పాకిస్తాన్ చరిత్ర యొక్క ఈ గొప్ప రాజకీయ నాటకం మధ్య తెహ్మీనా కథ ఆ దేశంలో ఉన్న స్త్రీల దుర్బల స్థానాన్నీ, మతాన్నీ-కొరాన్నీ తమ ఇష్టాలకీ, లక్ష్యాలనీ అనుగుణంగా మలచుకుంటూ, స్త్రీలని అణిచివేతకి గురి చేసే పురుషుల గురించినది.

'ముస్లిం సమాజంలో మహిళల పాత్ర వినాశకరమైన నేరారోపణకి గురయేదే' అంటున్న Corgi edition కవర్ మీద వర్ణించబడిన పుస్తకపు సమగ్రమైన, నిర్మొహమాటపు వృత్తాంతం ఇది:

'Yet Mustafa is neither sick nor unreasonable. He is simply insanely and irrationally possessive in a manner reminiscent of the Duke of Ferrara in Robert Browning's My Last Duchess. For, according to Mustafa, a woman, like land, is " power, prestige and a property" – a commodity meant for utilization and consumption in whichever way the owner / master deems fit.

ప్రేమరహితమైన తన వైవాహిక జీవితం గురించి తెహ్మీనా చెప్పిన మాటలు:

'There was not a day that Mustafa did not hit me ... I just tried my best not to provoke him ...I was afraid that my slightest response to his advances would reinforce his image of me as a common slut. This was a feudal hang – up: his class believed that a woman was an instrument of a man's carnal pleasure. If the woman ever indicated that she felt pleasure, she was a potential adulteress, not to be trusted. Mustafa did not even realize that he had crushed my sensuality. I was on automatic pilot ...responding as much as was important for him but

never feeling anything myself. If he was satisfied there was a chance that he would be in better humor. It was at these times that I realized that prostitution must be a most difficult profession."

ఇన్నేళ్ళయినప్పటికీ కూడా, ఈ పుస్తకంలో ఉన్న సంగతులు ఈనాటి పాకిస్తాన్‌కి కూడా వర్తిస్తాయి. పెత్తందారీ పద్ధతి అలాగే నడుస్తోంది. స్త్రీల పరిస్థితిలోనూ ఎక్కువ మార్పేమీ లేదు. తెహ్మీనా తన కథని లోకానికి చెప్పాలనుకున్నప్పుడు, వివాదాస్పదంగా ఉన్న ఆమె రాతప్రతి చూసి పబ్లిషర్స్ ఇబ్బంది పడినప్పుడు, ఆమే తన పుస్తకాన్ని స్వంతంగానే పబ్లిష్ చేసుకుంది.

దానితో, పిడుగు పడినట్టనిపించి పాకిస్తానీ సమాజం పునాదులతో సహా కదిలింది. ఇప్పుడు పాశ్చాత్య పాఠకులకోసం అనుకూలంగా మార్చిన తెహ్మీనా కథ– ముస్లిమ్ సమాజపు సంక్లిష్టమైన జాలంలో చిక్కుకున్న స్త్రీల బలహీనమైన పరిస్థితి గురించిన పరిజ్ఞానం కలిగిస్తుంది. అప్పుడు తెహ్మీనా మాజీ భర్తతో, 'నువ్వున్నా లేకపోయినా, నా అస్థిత్వానికొచ్చిన నష్టం ఏదీ లేదు. చూశావుగా! అన్న సందేశం పంపుతుంది.

పుస్తకం చదువుతున్నప్పుడు ఒక్క సంగతి మాత్రం మరచిపోకూడదు. ఇది ప్రధానంగా ఖర్ గురించీ తన గురించీ తెహ్మీనా చెప్పిన కథ మాత్రమే. ఇది మనకి తెలిసిన నిజంలో కొద్దిభాగమే కూడా అయి ఉండవచ్చు. ఖర్, అసలు ఈ ప్రశక్తే ఎక్కడా ఎత్తలేదు.
కాకపోతే, తెహ్మీనా చెప్పిన సంగతులు కూడా హేతువు లోపించినవి అయి ఉండవు. ఒక పేరున్న రాజకీయవేత్తని వేలెత్తి చూపి, అతనిపైన అబద్ధపు నేరాలు మోపడం అంత సులువైన పని కాదు.

గులామ్ ముస్తాఫా ఖర్ PPP లో Z A Bhutto కి కుడిభుజంగా ఉన్నవాడు. కానీ, కాలం తనకి అనుకూలంగా లేనప్పుడు, లండను వెళ్ళడానికని జియా ప్రభుత్వంతో చేతులు కలిపి, PPP నీ, భుట్టోనీ కూడా ముంచడానికి తటపటాయించలేదు. యుకె ప్రవాసంలో ఉన్నప్పుడు అతను Indian Intelligence agency తో రహస్యంగా సంపర్కంలో ఉండి, భారతదేశానికి రెండుసార్లు వచ్చాడు కూడా.

భర్త చేతుల్లో దెబ్బలూ, తన్నులు తింటూ ఉన్న ఒక స్త్రీ స్వీయచరిత్ర అంత ఆసక్తికరంగా అనిపించకపోవచ్చు కానీ, కథనశైలి పుస్తకం చదివించేలా ఉన్నందువల్ల, విసుగు మాత్రం పుట్టదు. పూర్తి పుస్తకంలో– విషాదాన్నే ఎదురుకుంటూ, బాధపడుతూ గడిపిన కథకురాలి ఉదంతం అంత నమ్మదగ్గదిగా అనిపించదు. నిజానికి , 'తనమీద పాఠకులకి జాలి కలిగించడానికి కథకురాలు ప్రయత్నం చేస్తోందేమో', అన్న అనుమానం కూడా వేసి, పుస్తకంలో నిజాయితీ లోపించినట్టుగా కనపడుతుంది. పుస్తకమేమీ అంత గొప్పగా ఉండనప్పటికీ, స్త్రీల సమానహక్కుల కోసం, సాధికారతకోసం పోరాడే ఒక ధనికవర్గానికి చెందిన భార్యకి ఉండే స్వల్పభేదాలని నేర్పుగా మాత్రం విశ్లేషిస్తుంది.

తెహ్మీనా దురానీ పుస్తకాలు కానీ, బెట్టీ మెహ్మూదీ రాసిన Not Without My Daughter కానీ– అందరూ చదవాలనుకునేవి కావేమో కానీ చదువుకున్న ధనికవర్గపు మహిళల దురవస్థ గురించి స్పష్టంగా అర్థం అవడానికి వాటిని చదవడం మాత్రం చదవాలేమో!
తెహ్మీనా భూస్వామ్య వ్యవస్థా, రాజకీయాల గురించిన చీకటి రహస్యాలని వెల్లడించడం వల్ల ఈమె పుస్తకం అచ్చయిన తరువాత, అది దేశంలో గలభాని సృష్టించింది. మొదట్లో పుస్తకం ఎగతాళిపాలయినాకానీ కాలం గడిచినగొద్దీ పాఠకులకి నచ్చడం ప్రారంభించింది– ప్రత్యేకంగా స్త్రీలకి.

కొన్ని ప్రశ్నలు మాత్రం మనల్ని వీడావు. తన మొదటి భర్తని వదిలేసి, తన అవసరం పడిన తన స్వంత కూతుర్నే(తాన్యాని) తన దారికి తన్ని (3 సార్లు) వదిలిపెట్టేసిన స్త్రీ, ఖర్‌తో అయిన తన పెళ్ళిని నిలబెట్టుకోడానికి ఎందుకంతగా ప్రయత్నించింది? అతను పలుకుబడి కలిగినవాడయి ఉండి, తన మొదటి భర్త అయిన అనీస్ సామాన్యుడవడం వల్లా! అదేకాక, స్త్రీలు స్వతంత్రంగా బతకాలనీ, సామాజిక నిబంధనలకి కట్టుబడి ఉండనవసరం లేదన్న నమ్మికా, రాజకీయ కుతంత్రాలంటే జుగుప్సా ఆమెకి ఉన్నప్పుడు– తిరిగి మూడోసారి, పేరు పొందిన ఇంకొక రాజకీయవేత్తా, భూస్వామీ అయిన షెహ్బాజ్ షరీఫ్‌ని ఎందుకు పెళ్ళి చేసుకుంది?

చెల్లెలు ఆదిలా తన భర్త ఉచ్చులో చిక్కుకున్నప్పుడు, ఆ చిన్నపిల్లని అతని చేతుల్లోనుంచి తప్పించే ప్రయత్నాలేవీ చేయకుండా ఆ పిల్ల తనకేదో శత్రువో, సవితో అన్నట్టెందుకు ప్రవర్తించింది?
కథకురాలు భారతదేశంలోకి ఏ వీసా లేకుండానే ప్రవేశిస్తుంది( భర్త భారతదేశపు సహాయాన్ని అర్థించినప్పటికీ కూడా.) ఇద్దరు స్పెషల్ ఏజెంట్లతోపాటు

అజ్మెర్ షరీఫ్ దర్గాలోకి వెళ్ళే అనుమతి పొందుతుంది. కానీ, మళ్ళీ తనకేదో ఇండియా అంతా స్వేచ్ఛగా తిరిగే అనుమతి లేకుండా భారతదేశపు ప్రభుత్వం తనమీద నిఘా పెట్టిందన్న ఫిర్యాదులెందుకు? ఆమె పరాయి దేశంలో(శత్రుదేశంలో!), ఆ పుణ్యక్షేత్రంలో ప్రార్థిస్తున్నప్పుడు ఏజెంట్లు పక్కన ఉండగా :

"Their Hindu presence disturbed my Islamic prayers." అనుకునే అధికారం తనకి ఉందని ఎలా అనుకోగలిసింది! ఈ స్వీయచరిత్ర, ఇటాలియన్ మారిస్సా బెల్లాసారియో పురస్కారం గెలుచుకుని 39 భాషల్లోకి అనువదించబడి, best seller అయింది. అప్పటినుంచీ తెహ్మీనా పాకిస్తాన్లో మానవహక్కుల కార్యకర్తగా పైకొచ్చింది. 'తెహ్మీనా దురానీ ఫౌండేషన్' అన్న సంస్థ స్థాపించి, లాహోర్లో ఉన్న ప్రధాన కార్యాలయంలో వాలంటీర్ల బృందంతో కలిపి పని చేస్తోంది.

ఆమె రాసిన రెండవ పుస్తకం, A Mirror to the Blind, అబ్దుల్ సత్తార్ ఇధీ స్వీయచరిత్ర. అతను పాకిస్తాన్ సమాజసేవకుడు. ఈ పుస్తకాన్ని 1996 లో the National Bureau of Publications తో కలిపి ఇధీ ఫౌండేషన్ ముద్రించింది.

Blasphemy (1998). ఈ పుస్తకం కూడా పేరు తెచ్చుకున్నప్పటికీ, వివాదాస్పదమైనదే అయింది.

My Feudal Lord- మొదటి ముద్రణ 1991 లో. Corgi కొన్ని సవరింపులతో ముద్రించినది 1995 లో. పుటలు. 385.

# ది థర్డ్ డెడ్లీ సిన్ – లారెన్స్ సాండర్స్

# The Third Deadly Sin –Lawrence Sanders.

లారెన్స్ సాండర్స్ జన్మించినది న్యూ యోర్క్‌లో ఉన్న బ్రూక్లిన్‌లో. స్కూలు పూర్తయిన తరువాత, Wabash కాలేజీనుంచి బాచెలర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీ పొంది, న్యూయోర్క్‌కి తిరిగి వెళ్ళి- Macy's డిపార్ట్‌మెంటల్ స్టోర్లో పని చేశారు. 1943 నుంచీ 1946 వరకూ United States Marine Corps లో ఉండేవారు. ఆ తరువాత కొన్ని పత్రికలకి సంపాదకీయునిగా పని చేశాక, ఉద్యోగం వదిలేసి, తన పూర్తి సమయాన్ని రాయడానికే వెచ్చించారు. ఆయనకి 50 సంవత్సరాలున్నప్పుడు–1970 లో, ఆయన మొదటి నవల Anderson Tapes విడుదల అయింది. 1971లో ఈ నవలకి ఆయన The Mystery Writers of America నుంచి Edgar Award పొందారు. ఇది సినిమాగా కూడా వచ్చింది- షాన్ కానరీ నటుడిగా. 1968-69లో కథలు చాలానే రాసినప్పటికీ ఆయన పేరు పొందటం ప్రారంభించినది ఆయన రాసిన మొదటి పుస్తకం The First Deadly Sin తోనే. ఇది కూడా సినిమాగా- ఫ్రాంక్ సినాత్రా, ప్రధానపాత్రగా వచ్చింది. ఆ తరువాత, ఆయన డెటెక్టివ్ ఎక్స్ డులెనీని ముఖ్య పాత్రల్లో ఒకరిగా చిత్రించిన మరి మూడు 'పాపం(sin)' గురించిన పుస్తకాలు రాశారు. First deadly Sin, Second Deadly Sin, Fourth Deadly Sin. పాఠకుల ధ్యాసని ఆకట్టుకుంటూ, మంచి కథాంశాలతో ఆసక్తికరంగా రాయడంలో ప్రావీణ్యత సంపాదించి, ఆయన నలభై కన్నా ఎక్కువ ఉత్కంఠభరితమైన పుస్తకాలు రాశారు.



సాండర్స్ స్త్రీల మనస్తత్వాన్నీ, ప్రవర్తననీ ఎంత చక్కగా స్పష్టంగా రూపొందించారంటే, ఈ పుస్తకాలన్నీ మారుపేరుతో ఒక స్త్రీ రాసినవే అన్న భ్రమ- ఒకప్పుడు చాలామందికి ఉండేది.

ఇప్పటికి సాండర్స్ రాసిన పుస్తకాల కాపీలు అయిదు కోట్లు అమ్ముడుపోయాయి. ఆయన వారం మొత్తం, ప్రతీ రాత్రీ అయిదు పేజీలు రాసేవారు. '*నా జీవితంలో రాయడమే అతి ముఖ్యమైన సంగతి, పెళ్ళికన్నా కూడా ఎక్కువ.*' అని సాండర్స్ చెప్పారు. ఆయన మరణం February 7న, 1998 Pompano Beach, Florida లో- ఆయనకి 77 సంవత్సరాలున్నప్పుడు సంభవించింది.

సాండర్స్ మరణం తరువాత, ఆయన ముగించలేకపోయిన Archy McNally సిరీస్‌ని రచయిత Vincent Lardo కొనసాగించారు. బైబిల్లో 'సామెతలు గ్రంథంలో' పేర్కొనబడిన ఏడు ఘోరమైన పాపాలలో, 'మూడవ పాపం(Third deadly sin) 'అమాయకుల రక్తాన్ని కార్చిన చేతులు' గురించినది.

హింసాత్మక మరణాలపైన సాండర్స్‌కి ఉన్న ఏకాగ్రతతేకాక ఆయన ప్రమాణచిహ్నం అయిన అనివార్యమైన లైంగిక దృశ్యాలు మరొక కోణం. ప్రతీ పాత్రా తింటున్నప్పుడు కానీ తాగుతున్నప్పుడు కానీ ఆ తాగే, తినే విధానాలని నిష్పక్షపాతంగా పరిశీలించేవారాయన. 'వారు తింటున్నదీ, తాగుతున్నదీ వారి వస్త్రధారణ ఎలాంటిదో అన్నది చాలా మట్టుకు వాళ్ళ స్వభావాన్ని తెలియపరుస్తుంది.' అన్నారు. 'చదవడం, రాయడం తప్ప నాకే అభిరుచులూ లేవు.' ఆయన మాటలే. ఆయన వంట చేసేవారు. కారు ఉండేది కాదాయనకి.

★★★

పాత్రల పరిచయం:

'*Some days lasted forever; some were never born. She woke in a fury of expectation gone as soon as she felt; the world closed about. Once again life became a succession of swan pecks.*'

జోయీ కోలెరకి పొద్దున్నే మెలకువ రాగానే ఆమె రోజులు ఇలాంటి ఆలోచనలతోనే మొదలెడతాయి.

ఆమె 37 ఏళ్ళ స్త్రీ. మాజీ భర్త అయిన కెనెత్‌తో పెళ్ళయిన మూడు సంవత్సరాల తరువాత విడాకులౌతాయి. విస్కాసిన్ ప్రాంతంనుండి వచ్చి, న్యూయార్క్‌లో గ్రేంజర్ అన్న చిన్న హోటెల్లో సెక్యూరిటీ విభాగంలో పని చేస్తుంది. కాలేజీ స్నేహితురాలైన మ్యాడీ అనబడే మదలినా కురుజ్‌తో తప్ప, సామాజికంగా ఎవరితోనూ కలిసిమెలిసే స్వభావం లేని స్త్రీ.

మ్యాడీ నాలుగవ భర్త డబ్బున్నవాడు. పెళ్ళి తప్ప జీవితానికి పరమావధేదీ లేదని నమ్మే స్త్రీ మేడీ. ఊబశరీరాన్ని తగ్గించుకోవాలన్న కనీస కోరిక కూడా ఉండదామెకి. భర్త డబ్బు ఖర్చు పెట్టడంతోనూ, పార్టీలివ్వడంతోనూ ఆమె కాలం గడుస్తుంది.

ఎడ్వర్డ్ ఎక్స్ దులెనీ NYPD నుంచి రిటైర్ అయిన మాజీ చీఫ్ డెటెక్టివ్. ఉద్యోగ విరమణ తరువాత కూడా అతనికి తన పోలీసు డిపార్టుమెంటు పని పట్ల ఆసక్తి తగ్గదు. ఖాళీగా కూర్చోడం అతన్ని మనస్తాపానికి గురి చేస్తుంది. అతనూ, రెండో భార్య మోనికా అన్యోన్యంగా ఉంటారు. అతనికి ముఖ్య సలహాదారు ఆమే. స్త్రీవాది. సైకాలజిస్టుల లెక్చర్లని వింటుంది. సాంఘిక సమస్యల పట్ల అక్కర గలిగినది. భర్త మొదటి భార్య పిల్లలకీ, తన మొదటి భర్తవల్ల తనకి పుట్టిన పిల్లలకీ కూడా తనే ఉత్తరాలు రాసి, దులెనీని కూడా ఆఖర్న అతని శైలిలో ఒక ముక్క రాయమని చెప్తూ ఉంటుంది.

ఎర్నెస్ట్ మిటిల్– మ్యాడీ భర్త ఆఫీసులో పని చేస్తాడు. మెతక మనిషి. బ్రహ్మచారి. కంప్యూటర్ కోర్సు పూర్తి చేస్తుంటాడు.

సర్జెంట్ ఎబ్నెర్ బూనె– దులెనీ కింద NYPDలో పని చేసిన వ్యక్తి. ఇంకా ఉద్యోగంలో ఉంటాడు.

★★★

జోయీ 'సాహసకృత్యాల' తరువాత కొన్నిరోజులకి మొదలయే డిటెక్టివ్ దులెనీ పరిశోధనలతో పుస్తకం కొనసాగుతుంది.

జోయీ అందంగానూ ఉండదు, అందవికారీకాదు. సన్నంగానూ ఉండదు, అలా అని లావూ కాదు. మెరుపులేని ఆమె బ్రౌన్ రంగు జుత్తు ఆమె చెవుల కిందకి కత్తిరించి ఉండి, విగ్గులా అనిపిస్తుంది. ఎన్నేళ్ళగానో ఆమె ఆ స్టైల్ మార్చుకోలేదు. ఆమె జీవం లేని కళ్ళూ బ్రౌన్ రంగువే. త్రికోణాకారంలో ఉన్న ఆమె మొహం, చుబుకం వద్దకి వచ్చేటప్పటికి సూది మొనగా మారుతుంది. అంతెక్కువేమీ వ్యాయామం చేయనప్పటికీ, ఆమె శరీరం తీరుగానే ఉంటుంది.

జోయీ ఎత్తు జోళ్ళు వేసుకోదు. బ్రౌన్ లేక గ్రే రంగు బట్టలూ, నూలు లోదుస్తులూ వేసుకుంటుంది. ఆమె వాడే వైటమిన్లూ, మినరల్సూ, మత్తుపదార్థాలు, నొప్పి మందులూ, ఫుడ్ సప్లిమెంట్లకీ– బాత్రూమ్ కాబినెట్లో చోటు చాలక, అవి వంటింట్లో ఒక అరంతా నిండి ఉంటాయి. పెద్ద మోతాదుల్లో ఆ మందులని మూడు పూట్లా తీసుకుంటుంటుంది.

ఆమె భుజానికి తగిలించుకునే నలుపు లెదర్ బాగులో తాళాలు, డబ్బుపెట్టుకునే పర్సూ, న్యూయార్క్‌లో చట్టబద్ధం కాకపోయినా ఆమె పని చేసే హోటెల్ వాళ్ళు ఆమెకిచ్చిన మేజ్ (mace) క్యాన్, రెండు బ్లేళ్ళున్న మడవగల ఒక స్విస్ ఆర్మీ కత్తీ ఉంటాయి. ఇంటినుంచి కాలు బయటకి పెట్టేముందు ఆమె బయట ఎవరూ లేరని నిర్ధారించుకుంటే తప్ప తలుపు తీయదు కూడా.

రోడ్లమీద ఆమె ఎవరి చూపులనీ ఎదురుకోదు. వాళ్ళెవరూ కూడా తనవైపు ఒక్కసారీ తిరిగి చూడరన్న ఆమె నమ్మకం తప్పు కాదు.
జోయీ పని చేసే హోటెల్ చాలా పాతదీ, చిన్నదీ అయినప్పటికీ– సంవత్సరం పొడుగూ దాని 283 గదులూ నిండే ఉంటాయి. సహోద్యోగులని చూసినప్పుడు తన తల పంకించడమే ఆమె పలకరింపు. ఆమె నవ్వగా ఎవరూ చూడలేదు. తను అగోచరమైన స్త్రీ అనీ, తనకంటూ ఒక ఉనికి లేదన్న అభిప్రాయాలు ఆమెలో నాటుకుపోయుంటాయి.
ఒకరోజు మ్యాడీ ఫోన్ చేసి, సాయంత్రం తన ఇంట్లో పార్టీకి పిలుస్తుంది.
'వాంటెడ్ ' అన్న హోటెల్ మాగజైన్లో ఉన్న ఒక వార్తని జోయీ రెండు మూడు వారాలుగా చదువుతోంది. ఇప్పుడది ఆఖరి పేజీకి చేరింది.
*Homicide at the Grand Park on February 15th. Victim of stabbing: George T. Puller, 54, white male of Denver, Colo. anyone with information relating to this crime please contact Detective Sargent Abner Boone, KL-5-8604.*
'ఈ బూనె ఇంకా ఫోన్ పక్కనే కూర్చున్నాడో ఏమిటో!' అనుకుంటుంది జోయీ.

మ్యాడీ పార్టీకి తన ఆఫీసు బట్టలతోనే వెళ్తుంది. రద్దీగా ఉన్న ఆ పార్టీలో– మాట్లాడుకుంటూ, డాన్స్ చేస్తున్న వాళ్ళెవరితోనూ కలవలేకపోతుంది:
*She thought of their fuzzed thighs. The satiny buttocks. Coil of tendon, rope of muscle. Most of all, their strength. The power there.*

మాజీ భర్తని గుర్తు చేసుకుంటుంది.
*That was what had astonished her about Kenneth. He was not a stalwart man but when he gripped her on their wedding night, she cried out in shock and surprise. The force! It frightened her.*

*And that-that thing. That reddish purple, knobbed thing poking out, trembling in the air. A club. It was a club, nodding at her.*

జోయీ ఒక వైట్ వైన్ పూర్తి చేసి మరొకటి తెచ్చుకుంటుంది. భుజానికి ఎవరో కొట్టుకుంటారు. పరిచయాలౌతాయి. అతని పేరు ఎర్నెస్ట్ మిటిల్. ఇద్దరూ వచ్చినది పక్కపక్క ఊళ్ళనుండే అని తెలుసుకుని, బయటకి వెళ్ళి డిన్నర్ చేద్దామనుకుంటారు.
*He seemed inoffensive and washed-out to Zoe Kohler. Faded eyebrows, blond eye lashes, eyes of milky blue. His complexion was fair, his haircut an atrocity that left his pink ears naked, isolated by clipper and razor.*

*But still...His smile was warm and hopeful. He was as tall as she. He seemed to crouch inside himself, hiding.*

తొమ్మిదింటికి ముందే తను ఇంటికి చేరాలంటుంది జోయీ. ఇద్దరూ వైన్ తాగుతూ తమ చిన్నప్పటి కబుర్లు చెప్పుకుంటారు.

తన్ని దిగబెట్టి అతను వెళ్ళిన వెంటనే ఇంట్లోకి వచ్చి, గుప్పెడు మందులు తీసుకు తింటుంది. నెలసరి రాబోయే ముందు తనకి కలిగే తిమ్మిర్లు ఎక్కువవుతున్నప్పటికీ, తరువాత తను చేయబోయే పనిని దృష్టిలో పెట్టుకుని నొప్పి మాత్ర తీసుకోదు.

టబ్బులో భరించగలిగేటంత వేడి నీరు నింపి, రుద్ది రుద్ది కడుక్కుని, స్నానం చేస్తుంది.

గోళ్ళకి రంగు వేసుకుని, బీరువా రహస్యపు అరలో దాచిన నాజూకైన లోదుస్తులూ, రెచ్చగొట్టే నలుపు రంగు బిగుతు డ్రెస్సూ వేసుకుని, నల్లటి విగ్గు బయటకి తీస్తుంది. అక్కడే దాచిన ఒక ట్రెంచ్ కోటూ, ఒక పెద్ద హేండుబాగూ, ఒక మేక్- అప్ కిట్టూ బయటకి తీసి, ఎత్తు మడమల జోళ్ళు తొడుక్కుంటుంది. మణికట్టుకి 'Why Not?' అన్న అక్షరాలున్న బంగారపు గొలుసొకటి తొడుక్కుంటుంది.

పనికి తను తీసుకెళ్ళే బాగునుంచి సిగరెట్లు, రెండు బ్లేళ్ళున్న తన స్విస్ ఆర్మీ కత్తి, మేజ్ క్యాన్, కొంత డబ్బున్న చిన్న పర్సునీ పెద్ద బాగులోకి మార్చి, తన ఐడి కార్డులన్నిటినీ మాత్రం ఒక అల్మైరాలో పెట్టేసి టాక్సీకోసం బయటకి నడుస్తుంది.

ఈ పనులన్నిటికీ గంట పట్టినప్పటికీ, ఒక్కసారి కూడా అద్దం చూసుకోదు.

టాక్సీ ఎక్కి సెంట్రల్ పార్కు వద్ద దిగిన తరువాత, టాక్సీ కనుమెరుగయేంతవరకూ అక్కడినుండి కదలదు.

ఒక చిన్న రెస్టారెంట్లోకి వెళ్ళి వైన్ ఆర్డర్ చేస్తుంది.

ముందు చేసినట్టే, లేడీస్ రూమెక్కడుందో అడిగి, అది ఖాళీగానే ఉందని చూసిన తరువాత బాగులో ఉన్న విగ్గు పెట్టుకుని, మేక్-అప్ వేసుకుంటుంది. ట్రెంచ్ కోటు బొత్తాములు విప్పేసి, ఈ రూపవిక్రియతో హోటెల్ లాబీనుండి బయటకి వస్తున్నప్పుడు:

*Men in the lobby stared at her. Men passing on the sidewalks outside stared at her.*

మరొక టాక్సీ కోసం ఎదురు చూస్తూ, నాటకీయంగా సిగరెట్టు పీలుస్తూ టాక్సీలో హోటెల్ పియర్‌స్‌కి వెళ్తుంది. కాక్ టెయిల్ లౌంజులన్నీ కిక్కిరిసి ఉంటాయి. ఆ హోటెల్ని జోయీ ఎంచుకున్న కారణం- ప్రస్తుతం అక్కడ మూడు సమావేశాలు(conventions) జరుగుతున్నాయని ఆమెకి తెలియడం.

ఒక బార్ ప్రవేశద్వారం వద్ద నిలుచుని, ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్టున్న భంగిమతో, వెలుతురెక్కువ లేని బార్‌కి చేరుకుంటుంది. వైన్ తాగుతూ, ఒంటరి మగవాళ్ళకోసం పరకాయించి చూస్తుంది.

కాన్ఫరెన్స్ కోసం అని వచ్చిన 'ఫ్రెడ్'(అతను చెప్పిన పేరు)తో సంభాషణ సాగిస్తూ, తన పేరు 'ఐరీన్' అని చెప్తుంది. అతను తన గదికి రమ్మన్నప్పుడు నిరాకరించదు. ఆమె తన కోటు విప్పి, దేన్నీ ముట్టుకోకుండా అతని గదిలో ఒక కుర్చీలో కూర్చుంటుంది. '*నా వద్ద బ్రాందీ ఉంది, తాగుదాం.*' అని ఫ్రెడ్ చెప్పినప్పుడు ఒప్పుకుంటుంది తప్ప, అతను డ్రింక్ అందించినప్పుడు గ్లాసు ముట్టుకోకుండా, తన చేతద్దంలో తన మొహం చూసుకుంటూ కూర్చుంటుంది.

అతను తన జోళ్ళూ, జాకెట్ విప్పేసి, మంచంమీద దిళ్ళనానుకుని కూర్చుంటాడు. ఆమె చెప్తుంది:

*Why don't you take off all those clothes? I have to go and make wee wee and then I will come back to you. I will do anything you want. And I mean- anything.*

బాగ్ తీసుకుని బాత్రూములోకి వెళ్ళి అతివేగంగా జోళ్ళు, స్టాకింగ్స్, లోదుస్తులూ విప్పి- వేలిముద్రలు పడకుండా టిష్యూ పేపర్ ఉపయోగించి, టాయిలెట్ టాంక్ లివర్ నొక్కుతుంది. తన కత్తి విప్పి కుడి చేత్తో పట్టుకుని బయటకి వచ్చినప్పుడు, హోటెల్ తువ్వాలుని తన కుడి మోచేతి మీద పరుచుకుని, బాత్రూమ్ లైటు ఆర్పేస్తుంది. ఫ్రెడ్ పైనున్న బల్బ్ ఆర్పి, బట్టలిప్పి- నడుం వరకూ దుప్పటి కప్పుకునుంటాడు.

ఆమె అతనిమీదగా వంగి, చేతిలో ఉన్న స్విస్ కత్తిని బాకులాగా ఉపయోగిస్తూ, అతని మెడలోకి దింపి అడ్డంగా రెండోవైపుకి కోస్తుంది.

అతని భారీ శరీరం మంచంమీదనుంచి విలవిలా కొట్టుకుంటూ, కింద పడుతూ, అతని రక్తం చిందరవందరగా చుట్టుపక్కల ప్రదేశాన్ని ఎరుపుగా మారుస్తూ ఉండగా:

*With bloodied, slippery hand, she drove the knife blade again and again into his genitals. No triumph or exultation in her face. Not grinning, or yowling but intent and business-like. Saying aloud with each stab, "There. There. There."*

ఇది పాఠకులకి వివరంగా తెలిసిన తొలి హత్య ఉదంతం కానీ, నిజానికి హోటెల్ గ్రేంజర్ పేపర్లో ఆమె మధ్యాహ్నమే చదివిన వార్తలో ఆమె చేసిన 'సాహసకృత్యం' మొదటిది. వీటిని హత్యలు అనడం ఆమెకిష్టం ఉండదు.

★★★

దులేనీ పోలీస్ అనుభవం అతని జ్ఞాపకశక్తికి పదును పెడుతుందే తప్ప, అతని పదవీ విరమణవల్ల అది రవంత కూడా తగ్గదు.
అతను బయటకి కరకుగా కనిపించినప్పటికీ, మనస్సు మెత్తన. అన్యాయాన్ని సహించలేడు.
జోయీ చేసిన మొదటి హత్య గురించి పోలీసు విభాగం పరిశోధించడం ప్రారంభిస్తుంది.
ఎబ్నర్ బూనె హత్యల గురించి చర్చించడానికీ, సలహాలడగడానికీ వచ్చి, మొదటి ఖూనీని వర్ణిస్తాడు:

*First homicide: February 15th, this year. Victim: male. Caucasian, fifty four years old, found stabbed to death in room 914 of the Grand Park Hotel. Naked body discovered by chamber-maid approximately 9:45 A.M. Victim had throat cut open and multiple stab wounds in the genitals. Cause of death according to autopsy: exsanguination. That first slash didn't kill him. Weapon: a sharp instrument about three inches long. Maximum width of the blade was about three quarters of an inch, according to the ME who did the cut-'em- up.*
*బలవంతాన్న తలుపులు తెరిచిన గుర్తులేమీ లేవు. హతుడి రక్తం మరకలు తుడుచుకోడానికి హంతకుడు స్నానం చేసిన చిహ్నాలున్నాయి. హతుడి తల వెంట్రుకలు తప్ప ఇంకెవరివీ దొరకలేదు.'*
వివరాలు వింటున్నగొద్దీ, దులేనీ ఆసక్తి పెరుగుతుంది.
'తడి తువ్వాలేదైనా దొరికిందా?' అడుగుతాడు చీఫ్.
'లేదు కానీ హోటెల్ తువ్వాళ్ళలో ఒకటి పోయింది.'-బూనె.
చిన్న బ్లేడున్న కత్తి ఆడవాళ్ళు ఉపయోగించేదే కాబట్టి వేశ్యెవరో తను కుదుర్చుకున్న బేరం చెడితే హత్య చేసి ఉండొచ్చేమో అనుకుంటారు. హంతకుడు స్నానం చేయడం, తువ్వాలు తనతో పట్టుకుపోవడం, హతుని డబ్బూ బంగారపు గొలుసులూ ఏవీ పోవు కనుక వేశ్య అయి ఉండకనూ పోవచ్చుననుకుంటారు. పెనుగులాట జరిగిన చిహ్నాలిండవు.
ఫ్రెడ్ హత్య తరువాత బూనె మళ్ళీ వచ్చి కబురందిస్తాడు.
రెండో హత్యకీ మొదటిదానికీ మధ్య ఎన్ని రోజులని దులేనీ అడిగినప్పుడు 27 రోజులని బూన్ చెప్తాడు. ఈ హత్యా ఇంచుమించు అదే విధంగా జరిగింది. హతుడైన ఫ్రెడెరిక్ తెల్లవాడు. 56 ఏళ్ళ వయస్సు. హోటెల్ పియర్స్లో 3015 వ నంబర్ గదిలో నగ్నంగా కనుక్కోబడ్డాడు . గొంతు కోయబడి ఉండి, జననేంద్రియాలమీద అనేకమైన కత్తిపోట్లున్నాయి.
వేలి ముద్రలు హతుడివే తప్ప ఇంకెవరివీ దొరకవు. చనిపోబోయే ముందు మద్యం తాగుతూ ఉండి ఉండాలి. ఇంకొక గ్లాసుంది కానీ దానిమీద ఇతరులెవరి ముద్రలూ ఉండవు. ఇక్కడ కూడా హోటెల్ టవల్ మాయం.
కాకపోతే, ఈసారి మాత్రం కుర్చీ వెనుక రెండూ, దిండు గలీబు మీద ఒకటీ- నైలాన్ విగ్ వెంట్రుకలు కనిపిస్తాయి.
సాయంత్రం 7 నుండి అర్థరాత్రి వరకు మఫ్టీలో ఉన్న పోలీసులని పెద్ద హోటెళ్ళ కాక్ టెయిల్ లౌంజుల్లోనీ, బార్ల వద్దా నియమిద్దామని నిర్ణయిస్తారు.
బూనె వెళ్ళాక దులేనీ భార్యతో దీని గురించి చర్చిస్తాడు.
ఈ హత్యలు బయటపడితే పబ్లిక్లో కంగారు మొదలయి, పర్యాటక వ్యాపారం దెబ్బ తిని సభలూ, సమావేశాలూ రద్దవుతాయని పోలీసులు దీన్ని ప్రచారం చేయరు .

★★★

రెండవ 'సాహసకృత్యం' ముగిసిన మర్నాడు, జోయీ న్యూయార్క్ టైమ్స్ పత్రికకి మగగొంతుకతో:

*It is exactly like the one last month at the Grand Park hotel. The same person did both.*

అని చెప్పి, ఫోన్ పెట్టేస్తుంది.

ఎర్నెస్ట్ మిటిల్‌తో జోయీ ఫోన్లూ, డిన్నర్లూ మొదలవుతాయి. ఒకసారి ఎప్పట్లాగే వైట్ వైన్ తాగుతారు. ఇంకో రెండు సీసాలు కొనుక్కుని ఆమె అపార్టుమెంటుకి వెళ్తారు.

*They had exhausted remembrances of their youth in Minnesota and Wisconsin. They had no more recollections to exchange. Now, tentatively... almost fearfully, their conversation become more personal. They explored a new relationship, feinting, pulling back, and trying each other, ready to escape. Both stiff with shyness and embarrassment.*

అతనివల్ల ఆమెకి భయం కలగదు. ప్రతీ విషయంలో ఇద్దరి అభిప్రాయాలూ కలుస్తాయి.

They sat at their ease. Remarkably alike. Mirror images. With their watery colouring, pinched frames, then–soft, wistful vulnerability, they could have been brother and sister.

★★★

ఈ హోటెల్ హత్యల కేసులో దులేనీని అనధికారిక సలహాదారునిగా నియమిస్తారు. రెండవ హత్య విచారణలో కుర్చీమీద కనపడిన రెండు నైలాన్ వెంట్రుకలబట్టి, హంతకుడు అయిదడుగుల, అయిదించుల నుంచి ఏడించుల మధ్య ఎత్తున్న వ్యక్తని పోలీసులు నిర్ధారించినప్పటికీ– ఆడదో మగవాడో అన్నది తేలదు.

ఇద్దరు మనుషులు ప్రాణాలు పోగొట్టుకున్నారన్న సంగతిని దులేనీకున్న న్యాయం, అన్యాయం అన్న విచక్షణ అంగీకరించలేకపోతుంది. రాత్రీ, పగలూ కేసుని పరిష్కరించాలన్న ధ్యాసలోనే గడుపుతాడు.

నల్ల నైలాన్ విగ్గు గురించిన వివరాలూ, హంతకుని ఎత్తూ గురించి పేపర్లలో వస్తాయి.

జోయీ, వెంటనే తుప్పపండు బ్లాండ్ రంగులో ఉన్న విగ్గు కొనుక్కుంటుంది. మ్యాడీతో లంచ్‌కి వెళ్ళినప్పుడు, ఆమె పదేపదే విసిగిస్తూ అడగడంతో, 'నిజమే, తనకెప్పుడూ భావప్రాప్తి కలగలేదు.' అని ఒప్పుకుంటుంది. డాక్టర్ని సంప్రదించమన్న మ్యాడీ సలహాకి సమాధానంగా, తనలో ఏ లోపం లేదంటూ తోసిపుచ్చుతుంది.

★★★

డాక్టర్ స్టార్క్ తో ఆమెకి ప్రతీ నెలా నియామకం ఉంటుంది.

తనకున్న రోగానికి ఆమె అన్నిసార్లు రావడం అనవసరమని డాక్టర్ చెప్పినా కానీ, బరువు, బ్లడ్ ప్రెషర్ ఊపిరితిత్తులు రక్త/బ్రెస్ట్ పరీక్షలూ, పెల్విక్ పరీక్షా చేయించుకుంటూ ఉంటుంది.

సరైన తిండి తింటే జోయీ మింగే మందుల అవసరం లేదన్నా ఊరుకోదు. ఆమె నెలసరికి ముందు కలిగే తిమ్మిర్లకి డాక్టరుకి ఏ కారణమూ కనిపించక, కౌన్సెలర్ వద్దకి వెళ్ళమని సలహా ఇస్తే– చిరాకు పడుతుంది.

అక్కడినుంచి ఇంటికి వెళ్ళి, నెలసరికి ముందు దినపు తిమ్మిర్లు ఎక్కువవుతుండగా, ఆమె తన రెండో 'సాహసకృత్యాని'కి అయిష్టంగానే మళ్ళీ తయారవుతుంది. ఈసారి సమావేశం జరుగుతున్న హోటెల్లో– పెళ్ళయి, ప్రేమించే భార్యా, పెంపుడు కుక్కా ఉన్న జెరీ దొరుకుతాడు. కానీ, ఆఖరి నిముషంలో అతనికి అపరాధభావం కలిగి ఆమె బాత్రూమ్లోకి వెళ్ళగానే బట్టలిప్పకుండా మంచం చివర్న కూర్చుంటాడు.

ఆమె యధావిధిగా హత్య చేయడానికి తయారయి, బయటకి వచ్చి, 'ఏమయింది?' అనడిగితే:

*He groaned. "Irene, this is no good. I just can't do it. I am sorry. Listen, I will give you the money. I hate wasting*

*your time like this. I just can't."*

జోయా, తన కత్తిని అతని ఎడమ చెవినుంచి కుడి చెవు వరకూ సరక్కున లోతుగా లాగి, అతని మెడ నరుకుతుంది.

అతని శరీరం మంచం మీదనుంచి ఎగిరి, నేలమీద పడుతుంది. గోడలమీదకి చింది, కిందకి జారినంత రక్తం కారుతుంది.

అతను బట్టలు వేసుకునే ఉన్నప్పటికీ, అతని బట్టలగుండానే అతని జననాంగాలని 'there, there, there' అంటూ, పొడిచేస్తుంది.

★★★

దులేనీకి డిటెక్టివ్ పోలీస్ డిపార్టుమెంట్లో పని చేయడమే కాక విచారణల విధానాల గురించి లెక్చరిస్తూ ఉండే ముసలాయన బ్రౌన్ గుర్తొస్తాడు. 'బహుళ యాదృచ్ఛిక ఖూనీలు' అన్న లెక్చరున్న ఫయిల్ని, పక్షవాతంతో బాధపడుతున్న బ్రౌన్ నుండి తెచ్చుకుంటాడు. దాన్లో ఉన్న రెండు కారణాలు అతనికి ఆసక్తికరంగా అనిపిస్తాయి.

1. Rejection: Closely allied to revenge. But rejection not by individual or class but by society, the world, life itself. I didn't ask to be born', the killer whines and the only answer can be, 'Who did? Is Son of Sam this rejected brotherhood?"

2. The flip side of rejection, real or fancied, is the need to assert: 'I do exist. I am I. A person of consequence. You must pay attention. And to make certain you do, I shall kill a baker's dozen of those lumps who look through me on the street. Then you will recognize who I am.

I am I. World, take notice! First, rejection. Then need to prove existence. Murder becomes a mirror.

మూడో హత్య జరిగిన వెంటనే బూనె, దులేనీకి తెల్లవారునే ఫోన్ చేసి హోటెల్‌కి పిలుస్తాడు.

హతుడి వయస్సు 39 సంవత్సరాలే. మంచంమీద నగ్నంగా పడిఉండదు మృతదేహం. నేలమీద మడుగు కడుతున్న రక్తంలో ఎనిమిదిన్నర ఇంచులనుంచీ తొమ్మిదించుల పొడుగున్న, అస్పష్టమైన ఒక అడుగు ముద్ర కానవస్తుంది.

★★★

మాజీ భర్త కెనెథ్ మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నానంటూ, జోయీకి ఆహ్వానపత్రిక పంపుతాడు. తమిద్దరి మధ్యా తరచూ జరిగిన సంభాషణలు గుర్తుకొస్తాయి జోయీకి.

*Must you put empty the ashtray every time I put out a cigarette? Kenneth complained. I will be smoking all night. Jesus, Zoe, do you have to wear that dull sweater again? It's like a uniform. All the other women at the party will be wearing dresses. You are the youngest frump I've ever seen.*

*You are not falling asleep, are you? I'd hate to come and hear you snoring. Pardon me all to hell if I am keeping you awake.*

*ఎప్పుడూ విమర్శించడమే. ఎప్పుడూ ఫిర్యాదులే.*

*మగవాళ్ళ అలవాట్లు తనకి అసహ్యం. స్నానం చేసినప్పటికీ ఒక ధృడమైన మగవాసన వస్తుందెందుకో వాళ్ళనుంచి! అయ్యో, తనకి మగవాళ్ళంటే అయిష్టత ఎందుకుంటుంది? వాళ్ళ ఆత్మవిశ్వాసమే తనకి ఊపిరాడనివ్వదంతే.*

ఆలోచన పూర్తయ్యాక, తన కత్తికి పదునుపెట్టి ఆహ్వానపత్రాన్ని చీలికలు చేసి పెడుతుంది.

ఒక శనివారపు సాయంత్రం జోయె, మిటిల్ ఇంటికి భోజనానికి వెళ్ళినప్పుడు అతన్ని ముద్దు పెట్టుకుంటుంది, కౌగలించుకుంటుంది. దగ్గిరతనం, వెచ్చతనం తప్ప ఆ చర్యల్లో ఆవేశం కానీ ఉద్రిక్తత, లైంగిక వాంఛ కానీ ఉండవు. 'డార్లింగ్' అని ఇద్దరూ ఒకర్నొకరు పిలుచున్నప్పటికీ, ఒకరిమీద ఇంకొకరు చేతులు వేయడం అవీ చేయరు.

హోటెల్ గ్రేంజర్లో తన సెక్యూరిటీ విభాగంలో హోటెల్ హత్యల చర్చలు జరుగుతున్నప్పుడు, ఆమె పాల్గోదు.

*'తనే హోటెల్ హంతకురాలు. నిజానికి, తన ఈ సాహసకృత్యాలు తనకి గర్వమే కలిగిస్తున్నాయి. అవి తన విజయాలు. తను పొందుతున్న ఈ చెడ్డపేరు తనకి సంతోషాన్నే తెచ్చి పెడుతోంది.'*

డాక్టర్ స్టార్క్ వద్దకి మళ్ళీ పరీక్షలకి వెళ్తుంది. ఆయన ఆమె జఘన వెంట్రుకలని నెమ్మదిగా లాగినప్పుడు కొన్ని ఆయన చేతిలోకి వస్తాయి.

ఆమె బరువు తగ్గిందని డాక్టర్ చిరాకుపడతాడు. తన ఆరోగ్యం సరిగానే ఉందని చెప్తుంది జోయీ.

All right, here's is what you got. Your pulse is too rapid. Your heart sounds like you just ran a hundred-yard dash and your blood pressure is way up. These are all the signs of incipient hyper-tension-all the more puzzling because low blood pressure is characteristic of your disease. That's why I asked if you've been under nervous or emotional stress.

We have cortisol deficiency. I saw minor signs of skin discoloration which is usually a sure tip- off. A decrease in armpit and pubic hair is another indication. And there's that weight loss.

మందులు మార్చి, రాసిస్తాడు.

ఆమె వెళ్ళగానే, ఆలోచనలో పడతాడు: జోయీ అబద్ధం చెప్తోందన్న దాన్లో సందేహం లేదు. ఆమెకున్న జబ్బుతో బాధపడే స్త్రీలు, 'తమ లైంగిక వాంఛ బలహీనమవుతోందని' ఫిర్యాదు చేయడం సామాన్యమే కానీ జోయీ విషయంలో మాత్రం, ఆమె వ్యాధికి గురైన చాలాకాలం ముందటే ఆమె లైంగిక వాంఛ మరణించి ఉంటుందని అతనికి కచ్చితంగా తెలుసు..

కాబట్టి ఇవి లైంగిక నిష్ఫలతా, భావోద్వేగ సమస్యలూ మాత్రం కావు. ఆమెకున్న అరుదైన జబ్బు క్లిష్టదశకి చేరకముందే ఆమె మినోడా డాక్టర్, రోగాన్ని సూక్ష్మంగా నిర్ధారించాడు. జోయీ తెచ్చిచ్చిన ఆమె ఫైల్లో ఉన్న పత్రాలు తీసి స్టార్క్ చదవడం మొదలెడతాడు.

ముఖ్య శీర్షిక: Diseases of the Endocrine system కింద 'Hypo function of Adrenal Cortex.

జోయీ డాక్టర్ క్లినిక్ నుండి ఇంటికి వెళ్ళిన కొద్ది గంటల్లో మళ్ళీ యధావిధిగా, తన గుప్పెడు మందులూ నోట్లో వేసుకుంటుంది. వాటితోపాటు నొప్పి మందులూ, నిద్రమాత్రలూ కూడా.

'*హోటెల్ హత్యలవల్ల టూరిస్ట్ వ్యాపారం పెద్దగా దెబ్బ తిన్నట్టు లేదు.*' అంచనా వేస్తుంది.

ఈసారి ఆమెకి హోటెల్ 'కామెరిన్' సరైనదనిపిస్తుంది. తయారవాలని లేస్తున్నప్పుడు, ఒక్కసారిగా నీరసం వచ్చి మూర్ఛపోతుందేమో అన్నట్టనిపించి, నిముషం తరువాత తేరుకుంటుంది. అల్మారా వెనుకనున్న బట్టలూ, మేక్-అప్ వేసుకోడానికి గంటకన్నా ఎక్కువ పడుతుంది. ఆలోచనలు చెల్లాచెదురవుతూ, తన ప్రణాళిక మీద ధ్యాస సరిగ్గా నిలపలేకపోతుంది.

*An odd thought occurred to her is this drifting haze: She wondered if her adventures were habit forming. Perhaps she was venturing out this night simply because it was something she always did just prior to her period. It was not dictated by desire or need.*

ఈసారి తుప్పపండు రంగు విగ్గు. హోటెల్ బారుకెళ్ళి ఎప్పట్లాగే వైట్ వైన్ ఆర్డర్ చేసి, రెండోది తాగుతుండగా ఒక 45 ఏళ్ళ మనిషి పక్క బల్లమీద కూర్చుంటాడు. పేరు లెనార్డ్. పరిచయాలవతాయి. అతని గదికి వెళ్తుంది.

తనతో పాటు వచ్చినవారు త్వరగా గదికి రాగలిగే అవకాశం ఉందని అతను చెప్పినప్పుడు, తన ప్రణాళిక తల్లకిందులవుతుందేమో అని క్షణకాలం అనుకున్నప్పటికీ, అతను అప్పటికే తన బట్టలు విప్పడం మొదలెడతాడు. అతన్నాపడం తనవల్ల కాదని గ్రహించి, 'ఇప్పుడే వస్తానని' చెప్పి, బాత్రూమ్లోకి వెళ్తుంది. కత్తి మడత విప్పి, సింకు చివర్న పెడుతుంది. మేజ్ క్యాన్ కుడి చేత్తో పట్టుకుంటుంది. ఎడం చేత్తో తలుపు తెరవగానే అతను బయటే కనపడతాడు. క్యాన్లో ఉన్న గాస్ అతని మొహంమీద జల్లుతూ, క్యాన్ బటన్ని వేలితో నొక్కి పెడుతుంది. అతను వెనక్కి తూలి- దగ్గుతూ, తుమ్ముతూ మొహానికి చెయ్యి

అద్దం పెట్టుకుని కింద పడతాడు. అతని మీదకి వొంగి, క్యాన్ ఖాళీ చేస్తుంది. గదంతా ఆవరించిన గ్యాస్ ప్రభావం తన మీద కూడా పడుతుంటే, బాత్రూమ్లో ఉన్న మొహం తుడుచుకునే తువ్వాల్ని ముక్కుకి అద్దం పెట్టుకుంటూ కత్తి తీసుకుని గదిలోకొచ్చి, మిగిలిపోయిన తన కార్యక్రమాన్ని యధావిధిగా పూరి చేస్తుంది.

బాత్రూమ్లోకి వెళ్ళి– తనమీద రక్తం చిందిందేమోనని పరిశీలించుకుని కత్తిని వేడి నీటితో కడుగుతూ ఉన్నప్పుడు, దాని సగం ఇంచ్ మొన ఎక్కడో పోయిందని గుర్తిస్తుంది. *'అది అతని మెడలో ఉందో, చుట్టూ ఉన్న రక్తంలో ఉందో వెతకడం అనవసరం.'* అనుకుని, తువ్వాల్తో కత్తిని తుడిచి, ఖాళీ అయిన మ్యేజ్ క్యాన్ బ్యాగులో పడేసుకుంటుంది. అలాగే మంచం పక్కన పెట్టిన తన గ్లాసుని కూడా.

★★★

ఏప్రిల్ 18న జోయి కోలేర్, మ్యాడీ పార్టీలో వైన్ తాగుతుండగా– ఎడ్వర్డ్ ఎక్స్ దులేనీ– పత్రికా విలేఖరి హ్యాండ్రీతో కలిపి రెస్టారెంట్లో భోజనం చేస్తుంటాడు. విగ్గు రంగు మారిందన్నది బయటకి పొక్కకూడదని హ్యాండ్రీని హెచ్చరించి,

ఇంటికి వెళ్ళి వెళ్ళగానే హత్యల తేదీలని తిరిగి పరిశీలిస్తాడు దులేనీ. మొదటిది శుక్రవారంనాడు. రెండవ హత్య గురువారం. మూడోది బుధవారం. వెనక్కి మళ్ళుతున్న అనుపాతాన్ని అర్థం చేసుకోలేకపోతాడు. కానీ, నాలుగవ హత్య మంగళవారం కనుక అయితే అది అనుమానించతగ్గదే అనుకుంటాడు. నాలుగవ హత్య జరగదన్న సందేహమే ఉండదతనికి. దాన్ని ఆపలేకపోతున్నందుకు మాత్రం తనమీద తానే కోపం తెచ్చుకుంటాడు. దులేనీ తిరిగి ఆ తేదీలని గమనించి, తన భార్య కాలెండర్తో పోల్చి చూసినప్పుడు– అతని అనుమానానికి ఒక ఆకారం ఏర్పడుతుంది.

బూనె ఫోన్ చేసి, జొరొమ్ ఏష్లే రగ్గుమీద కన్పించిన రక్తపు పాదముద్రలని బట్టి హంతకుని ఎత్తు ఇంచుమించు అయిదడుగుల అయిదు ఇంచీలనుంచీ, ఏడించీల వరకూ ఉంటుందని చెప్తాడు.

హ్యాండ్రీ అతని చేతికి తను చేసిన పరిశోధన యొక్క అయిదు పౌన్లున్న సంచీతో పత్రాలందిస్తాడు.

ఆ రాత్రి దులేనీ భార్య మోనికాతో తన అభిప్రాయాలని బయట పెడతాడు:

మొదటి హతుడు జోర్జ్ ఫులర్ . కొట్లాడుకున్న గుర్తులు లేవు. ఏదీ దొంగలించబడలేదు. వేశ్యయితే కనీసం డబ్బయినా తీసుకుపోయుండాలి..

రెండవ హత్య ఫ్రెడెరిక్ది. గొంతు అలానే కోయబడింది. పెనుగులాట జరిగిన ఆనవాళ్ళు కానీ డబ్బూ, బంగారం పోయిన సూచనలు కానీ ఉండవు.

అవే నల్ల విగ్గు నైలాన్ వెంట్రుకలు.

సలహారూపంలో తను విన్న లెక్చర్ విషయం అయిన pre orgasmic స్త్రీల గురించి భార్య విశదీకరిస్తుంది:

*It is a woman who never had an orgasm.*

*It is not frigid. It is a pejorative word. Is loaded term. Actually 'frigid' means being averse to sex applying both to men and women. It is not an irreversible condition. Through therapy training, they can achieve orgasmic sexuality.*

*దెలనీ చెప్తాడు:*

*That is why we are all looking for a male hotel ripper. But I think they're wrong.*

*I looked at the intervals between the three murders. 26 days between 1st and 2nd and between the 2nd and 3rd.*

*Does that suggest anything to you?*

భార్య మాట్లాడదు.

*Sure it is." He said gently. 26 days is a fair average for a woman's menstrual period. I checked it in your guide to gynaecology.*

*నిజమే. ఇదంత పెద్ద సాక్ష్యమేమీ కాదు. కానీ అన్నీ కూడితే ఒక నిర్మాణక్రమం కనిపిస్తోంది. మానసిక రోగం ఉన్న స్త్రీ నేరాలని ఆమె నెలసరులు*

*ప్రేరేపిస్తున్నాయి.*

*మగవాళ్లకన్నా ఎక్కువగా ఆడవాళ్ళు నిద్రమాత్రలు, నొప్పి మందులూ తీసుకుంటారు. నిరాశకీ, ఆందోళనకీ మందులు కొంటారు.*

*ఆమె ఎత్తెంతో మనకి తెలుసు. విగ్గులు పెట్టుకుంటుందనీ తెలుసు. ఒక మగవాడి పీక కోసేటంత బలం ఉన్నదీ నెలసరులు వచ్చేటంత వయస్సున్నదీ కాబట్టి, వయస్సు 18 కీ 40 కీ మధ్యలో ఉండవచ్చనుకుందాం. కిరాతకమైన హత్యలు చేసి నిష్క్రమించే ముందు, తన శరీరం నుండి రక్తపు మరకలు కడుక్కుంటుంది. ఏ వేలి ముద్రలూ వదిలి పెట్టదు. ఇవన్నీ ఆమె సగటు మేధస్సుకి మించిన తెలివున్న స్త్రీ అని సూచిస్తాయి. Quite possibly she is addicted to prescription drugs, alcohol or nicotine-or a combination of 2 or all 3. The chances are good that she suffers from depression or mania or both.*

హత్య చేస్తున్నది స్త్రీ, అని స్త్రీవాది అయిన భార్యని నమ్మించలేకపోతాడు.

ఆ ఘాటు వాదన తరువాత ఇద్దరూ పందెం కడతారు. ఎవరు తప్పని తేలితే, వాళ్ళు మురికి పట్టిన కిటికీలన్నీ కడగాలి.

కొన్ని రోజుల తరువాత రేడియో వింటూ ఇద్దరూ కొయ్యబారిపోతారు.

*'కామెరాన్ హోటెల్లో ఒక మృతదేహం కనుక్కోబడింది. హతుని పేరు లెనర్డ్. ఒక సమావేశం కోసం న్యూయార్క్ వచ్చాడు. తలుపు తెరిచుండటంతో అతని స్నేహితులు అతని శరీరాన్ని కనుక్కున్నారు.'*

ఈ హత్య మిగతా వాటికన్నా కొంచం భిన్నంగా ఉన్నది. గదిలో తీపి వాసనేదో వచ్చిందని అతని స్నేహితులు చెప్పారు. మరొకటి- హతుని సగం మొహం కాలిపోయింది. అది మేజ్ వాసన అన్నది పోలీసులకి అర్థం అవుతుంది.

హత్య చేసినది స్త్రీ అనీ, దానికి తనకి తోచిన కారణాలేమిటో దులెనీ పోలీసులకి చెప్తాడు.

హోటెల్ హంతకుణ్ణి ఆపాలన్న దులెనీ ఆత్రం, హత్య తప్పన్న కారణం మాత్రమే. ఆ చర్యకున్న అనైతికతనీ, సంఘ వ్యతిరేకతనీ, అధార్మికతనీ పరిగణించడతను.

★★★

హత్యలు చేస్తున్నది ఆడదయే అవకాశం ఉందన్న న్యూస్ పబ్లిష్ అవుతుంది. జోయీకి షాక్ తగిలినప్పటికీ, తన గురించి ఎవరూ ఊహించలేరనుకుని నిశ్చింతగా ఉంటుంది.

పోలీసులందరూ పరుగులు పెడుతూ ఉండటం, పేపర్లన్నీ తన గురించి రాయడంతో ఉద్విగ్నతకి లోనయివుతుంది. ఉత్సాహకరంగా అనిపిస్తుంది.

కానీ, ఆ హోటెల్ హంతకురాలి కామపూరిత ప్రతిబింబాన్ని ఒక సౌమ్యమైన స్త్రీ పలికిన 'డార్లింగ్' అన్న జ్ఞాపకాలతో సమన్వయించుకోలేకపోతుంది.

మరుసటి నెల జోయీకి తన క్రమబద్ధమైన జీవితం చేతిలోనుంచి జారిపోతోందన్న అనుభూతి కలుగుతుంది. రోజులు, వారాలు ఎలా గడిచిపోతున్నాయో కూడా అర్థం కాదు.

గతం ప్రస్తుతంలోకి జొరబడుతుంది. తన బాల్యం, పెళ్ళీ, తల్లితండ్రులూ ఎక్కువగా గుర్తొస్తుంటారు. సోమవారానికీ శుక్రవారానికీ మధ్య జరిగినదేమిటో కూడా గుర్తు తెచ్చుకోలేకపోతుంది.

*It wasn't so much a weakness as a languor. Her will was blunted. Her body now seemed in command of all her actions. An indolence infected her. She slept long, dragged hours and awoke listless, aching with weariness.*

*It seemed to her that her body, that fleshy envelope containing her, was breaking up, flying apart, and forgetting its functions and programs-disintegrating into chaos. It occurred to her that she might be dying.*

విరిగిన కత్తిని ఎక్కడో విసిరేస్తుంది జోయీ. ఖాళీ మ్యేజ్ క్యాన్ని చెత్తతో చుట్టి, దూరంగా ఉన్న చెత్తబుట్టలో పడేస్తుంది.

తన మూడు స్నానాలూ చేస్తూ, పని చేస్తూ, మిటిల్‌తో మాట్లాడుతూ మేడీతో లంచ్ చేస్తూ, యాంత్రికంగా రోజులు గడిపేస్తుంది.
తనకేదో అవుతోందని ఆమెకి లీలగా తెలుస్తూ ఉండి కూడా, అన్నిటినీ విధికి అప్పగించి ఊరుకుంటుంది.
మే 10 న, ఒక శనివారం ఎర్నెస్ట్ మిటిల్‌ని సెంట్రల్ పార్కులో కలుసుకుంటుంది. ఆమె వొళ్ళో తల పెట్టుకుని అతను *'ఇలాగే ఎప్పటికీ ఉండిపోతే ఎంత బాగుందో!'* అన్నప్పుడు, ఆమె పూర్తి అంగీకారం తెలుపుతుంది. ఇద్దరూ వొంటరులు. ఏ ప్రత్యేకతా లేక, ఈ లోకంలో ఇమడలేనివారు. ఈ వింతలోకం వీళ్ళని నిర్లక్ష్యపెడుతోంది. ఇద్దరూ పెళ్ళి చేసుకుందామని నిశ్చయించుకుంటారు.
తన తల్లి పేరు 'ఐరీన్' అని చెప్తుందతనికి.
మే 13 మధ్యాహ్నం: డాక్టర్ స్టార్క్ ఆమెకి ఫోన్ చేసి, రెండిటి కోసం తను మందుచీటి రాశాననీ, చీటీ రెసెప్షనిస్టు నుండి తీసుకొమ్మనీ చెప్తాడు.
ఒకటి– జోయీ ఎల్లవేళలా ధరించవలిసిన గుర్తింపు కడియం. దానిమీద ఆమె పేరూ, ఆమె డాక్టర్ పేరూ, టెలిఫోన్ నంబరూ ఉంటాయి. జోయీ Adrenal deficiency తో బాధపడుతోందనీ, అత్యవసర పరిస్థితిలో Hydrocortisone ఇంజెక్షన్ ఇవ్వాలనీ రాసుంటుంది. ఆ ఇంజెక్షన్ జోయీ తన బ్యాగులో ఎప్పుడూ ఉంచుకోవాలి.
జోయీ రెండిటినీ కొనుక్కుని తన హోటెల్ టేబిల్ డ్రాయర్ వెనకాతలకి తోసేసి, తిరిగి వాటివంక చూడదు.
మే 16న జోయీ ఇల్లంతా ఏ మూలా వదలకుండా శుభ్రం చేస్తూ, మీమాంస పడుతూ ఉంటుంది:
*Why had she sought adventures and why did she continue? She could not frame a clear and lucid answer. She knew what she was doing was monstrous. But that was no rein. Mind may reason but the body will have its own. Who can master his appetites! The blood boils and all is lost.*
*She felt herself buffeted, pushed this way and that by powers as impersonal as the rush on city streets. The choice was hers but so limited as to be no choice at all.*

ఒక పెద్ద వోడ్కా పోసుకుని తనతోపాటు బాత్రూమ్లోకి తీసుకెళ్తుంది. ఎవర్ని సంబోధిస్తోందో కూడా తెలియకా, తెలుసుకునే అవసరం కూడా కనిపించకా, *'I love you'* అని గొణుగుతుంది.
మే 25 ఆదివారం: మిటిల్ , జోయీ కలిపి ఏదైనా ఊరు తిరిగి వద్దామని నిశ్చయించుకుంటారు.
హోటెల్ కిల్లర్ గురించిన వార్తలు రేడియోల్లో, టివిల్లో ఎక్కువవుతుంటాయి. ఇపుడు పోలీసులు బాహాటంగానే హత్య చేస్తున్నది స్త్రీ అని చర్చించుకుంటారు. సభలూ, సమావేశాలూ రద్దవుతుంటాయి.
తన మేజ్ క్యాన్ తనవద్ద లేదని జోయీ హోటెల్ గ్రేంజర్ సెక్యూరిటీ అధికారి పింక్నీకి చెప్పదు. అంతకన్నా ఇప్పుడు తనకి ఎక్కువ అవసరం అయినది మరొక కత్తి. కొనుక్కోడానికి దుకాణానికి వెళ్ళినప్పుడు, కత్తులు కొంటున్నవారందరి చిరునామాలూ, ఫోన్ నంబర్లూ రాసుకుంటున్నారని గమనిస్తుంది. అమ్మే అతను
*'I think it has to do with something to do with the hotel ripper.'* అని చెప్తాడు కానీ ఈమె వివరాలడగదు.
జోయీ ఉత్సాహం మరింత ఎక్కువవుతుంది.
జూన్ 4 సాయంత్రం:
జోయీ హోటెల్ ఎల్డర్ లోకి ఇంకా ప్రవేశించకుండానే, ఒక సన్నగా ఉన్న వ్యక్తి తను మాత్రికుడననీ(magician), పేరు 'నిక్' అనీ చెప్పుకుంటాడు. అతని గదిలోకి వెళ్తారు. తన బట్టలిప్పి ఆమెని ఆక్రమించుకుంటాడు. ఆమె కత్తి తీసి అతని పొట్టలో పొడుస్తుంది. అతను రక్తం కారుతూ కూడా, కోపంతో లేచి నిలబడతాడు. ఇద్దరి మధ్యా పోట్లాటయి, గదిలో ఉన్న టేబిల్, కుర్చీ అన్నీ అడ్డదిడ్డంగా పడతాయి. కానీ, ఆఖరికి జోయీ తన బాధ్యత నెరవేర్చగలుగుతుంది. అంతకు ముందు నిక్ తో కత్తి కోసం పెనుగులాడుతున్నప్పుడు, ఆమె తొడ చీరుకుంటుంది. దాని చుట్టూ టాయిలెట్ పేపర్ బిగించి చుట్టి, దానిమీద హేండ్ టవల్ ఒకటి కడుతుంది. నిక్ నెక్ టై కూడా పైన కట్టేస్తుంది. వేలి ముద్రలన్నిటినీ తుడిచేస్తుంది కానీ తన తొడమీదనుంచి కారిన రక్తాన్ని శుభ్రం చేయడం

అసాధ్యమనిపించి, తడి తువ్వాళ్ళని బాత్రూమ్లోనే వదిలేసి, బయటకి నడుస్తుంది.

ఇంటికి వెళ్ళాక:

*Already her adventure was fading, losing it's hard, sharp out-lines. She could not limn it in her memory. She had chaotic recollections of noise, violence and spray of hot blood. But it had all happened to someone else. In another time, another place.*

ప్రేమ దొరికితే, అది తన ఆత్మకి విముక్తి కలిగిస్తుందని తను ఏ క్షణాన్న కల గందో అని గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నిస్తుంది.

★★★

మే 10 న జోయీతోపాటు మిటిల్ పార్కులో ఉన్నప్పుడు, డులెనీ, బూనె- ఇతర ఆఫీసర్లతో లెనార్డ్ హత్య గురించి చర్చించుకుంటుంటారు. డులెనీ చెప్తాడు:

*అన్నీ పాత హత్యల్లోలాగే జరిగాయి. రెండు విషయాలు మనకి సహాయపడవచ్చు. దాదాపు అర ఇంచీ కత్తి మొన హతుని గొంతులో దిగబడి ఉంది. అంటే కత్తి మూడించిల కన్నా పెద్దదయి ఉండదు. కెమికల్ మేజ్ వాడిన ఫలితంగా, మొహంమీద-ప్రత్యేకంగా కళ్ళ, ముక్కుల చుట్టూ ఉన్న చర్మం కాలిపోయుంది.*

*ఇక్కడ మనం వెతకవలిసినది ఇరవై చివర్ల నుండీ మధ్య ముప్పైల వరకూ ఉన్న స్త్రీని. విగ్గు ధరించడంలో కష్టం ఉండదు కనుక పొట్టి జుత్తు. చదువుకున్న స్త్రీ. ఆమె మత్తుమందులు లేక మద్యం, లేక రెండూ కూడా కలిపి వాడే అలవాటున్న స్త్రీ. హోటెల్ కస్టమర్ల పీకలు కోయనప్పుడు సామాన్యమైన జీవితం గడుపుతుంది. చూడ్డానికి అతి సాధారణంగా ఉంటుంది.*

ఒకరోజు మోనికా హిల్టన్ హోటెల్లో ఏదో సమావేశానికి వెళ్తున్నప్పుడు అది ఏ హోటెలో తనకి ఎలా తెస్తుందని డులెనీ అడుగుతాడు. తనకి నోటీస్ వచ్చిందంటుందామె.

కొంత పరిశోధన తరువాత, ఈ సభల, సమావేశాల సమాచారం వచ్చే హోటెల్ ట్రేడ్ పత్రికలున్నాయని తెలుస్తుంది. మేజ్ క్యాన్లు తమ వద్ద ఉంచుకోడానికి అనుమతి ఉన్నవారి గురించీ, ఆ హోటెల్ పత్రికలు ఎవరెవరికి అందుబాటులో ఉండే అవకాశం ఉందో అన్నదాని గురించీ మరొక పరిశోధన ప్రారంభం అవుతుంది.

జూన్ 1 –3 కి మధ్య డులెనీ ఆందోళన ఎక్కువవుతుంది. జూన్ 4 రాత్రి ఎడ్లర్ హోటెల్లో గంట కిందటే, 'నిక్' అన్న వ్యక్తి హత్య జరిగిందని బూనె ఫోన్ చేస్తే అక్కడికి వెళ్తాడు.

కుర్చీలూ బల్లలూ చిందరవందరగా పడి ఉండి, గోడలు రక్తమయం అయి ఉంటాయి. భూకంపం వచ్చి హోటెల్ గదిని కుదిపేసినట్టనిపిస్తుంది. బాత్రూమ్ టైళ్ళ మీద హతుని రక్తం కాక మరెవరిదో దొరుకుతుంది. మర్నాడు తెల్లవారే, అది Caucasian స్త్రీ రక్తం అని లాబ్ పరీక్షల్లో తేలుతుంది.

★★★

రెండ్రోజుల తరువాతే హత్య చేస్తున్నది స్త్రీ అని వార్తాపత్రికలు ప్రకటిస్తాయి. ఆ తరువాత పార్శిక వర్ణన కూడా. 'ఎత్తు జోళ్ళు తొడుక్కునే సన్నటి స్త్రీ. భుజాలవరకూ వచ్చే విగ్గు తొడుక్కుంటుంది. 'వై నాట్ ?' అన్నబంగారపు గొలుసు చేతికి ఉంటుంది. ఎక్కువ మేక్ అప్, ఘాటైన సెంటు వాడుతుంది.'

*All these newspaper stories, all the television broadcasts and radio bulletins were about her. What she felt came very close to pride and with her new hair-do, despite her lump, walked taller, head up, glowing and felt herself queen of the city.*

ఇంక పంథా మార్చాలని నిశ్చయించుకుంటుంది. ఇప్పటినుంచీ, 'అమాయకత్వంగా, సామాన్యంగా' కనబడాలి. వెళ్ళి ఒక మెక్సికన్ పెళ్ళి డ్రెస్ వంటిది కొనుక్కుంటుంది.

జూన్ 29 న ఆమె నెలసరి తిమ్మిర్లు మొదలవుతాయి. తన మందులన్నీమింగేస్తుంది. కదలడానికి కూడా ఓపికుండదు. సన్నగా కాడల్లాగా తయారైన తన చేతులూ, కాళ్ళూ చూసుకుంటుంది. కళ్ళు బైర్లు కమ్ముతుంటాయి. మోచేతుల మీదా, మోకాళ్ళమీదా, వేళ్ళ మధ్యా ఎక్కువవుతున్న మచ్చలు. ఆకలి

క్షీణిస్తుంది. భగాస్థిని తాకితే వెంట్రుకలు ఊడతాయి. ఎముకలమీద చర్మం వదులుగా వేళ్ళాడుతుంటుంది. శరీరం కుంచించుకు పోయింది.

ఈసారి, తను రోజూ తొడుక్కునే సామాన్యమైన బట్టలతోనే తన సాహసకృత్యానికి పూనుకుంటుంది. దగ్గిరే ఉన్న వొక చిన్న హోటెల్లో, పాతికేళ్ళున్న ఛెస్టర్‌తో తాగడానికి కూర్చుంటుంది. ఏదో నెపంతో అతని గదికి వెళ్ళి, అతని గొంతు కోసేస్తుంది. తన వేలిముద్రలున్న గ్లాస్ పట్టికెళ్ళడం మరచిపోతుంది.

★★★

జూన్ 5 న:

రక్తపరీక్ష చేసి, చంపుతున్నది స్త్రీ అని ప్రకటించిన డాక్టర్ పాట్రిక్ హో- ఆ రక్తంలో ఎక్కువ ఉండకూడని పొటాషియమ్ ఉందనీ, అసహజతలెన్నో ఉన్నాయనీ, వీటన్నిటివల్లా శరీరంమీద మచ్చలు ఉండాలనీ తేలుస్తాడు.

ఈ లోపల ఛెస్టర్ హత్య వార్త పోలీసులకి అందుతుంది.

డాక్టర్ హో, దులెనీ ఇంటికి, 'ఆడిసన్స్ డిసీస్' అని కనుక్కున్నానని, కేకలు పెడుతూ వస్తాడు.

★★★

జోయీ పరిస్థితి ముదురుతుండటం చూసి డాక్టర్ స్టార్క్ ఆమెని ఆస్పత్రిలో చేరమన్నా ఆమె వినదు:

*And there was also this secret fear that somehow in a hospital, she might be restored to perfect health. But, in the process, be deprived of those private pains and pleasures that were so precious to her.*

*A hospital would end all that. It would rob her of her last remaining uniqueness. It might, in fact destroy the uncommon soul of Joe Kohler.*

రెండ్రోజుల తరువాత హంతకురాలిని పోలిన చిత్రం వార్తా పత్రికల్లో వస్తుంది.  ఆమె వైన్ తాగే అలవాటూ, జుత్తు రంగుతో సహా అన్ని వివరాలూ ఉంటాయి.

మిటిల్‌కి ఫోన్ చేసి, ఇంటికి పిలుస్తుంది.

జూలై 11-12:

దులెనీ భార్యతో '*హంతకురాలు అలిసిపోతోందనీ, లొంగిపోడానికి సంతోషంగానే వొప్పుకుంటుందనీ*' చెప్తాడు.

పట్టణంలో ఆడిసన్స్ వ్యాధితో బాధపడుతున్నవారి లిస్ట్ తయారవుతుంది. హోటెల్ సమావేశాల పత్రికలు అందుబాట్లో ఉండేవారి లిస్టింకొకటి ఉంటుంది. రెండిటినీ పక్కపక్క పెట్టుకుని పోల్చి చూస్తే, రెండిట్లోనూ కనిపించినది జోయీ పేరొక్కటే.

'ఆమె నేరం చేస్తూ పట్టుబడితే తప్ప, తెలివైన ఏ లాయరైనా ఈ ఆధారాలమీద వేసే కేసుని సులువుగా ఓడిస్తాడంటూ', జోయీ ఇంటి బయట కాపలా ఏర్పరుస్తారు. ఆమె ఫోన్ టాప్ చేస్తారు. ఆమె ఇంట్లోకి వెళ్ళి ఆమె బట్టలూ, ఇల్లూ క్షుణ్ణంగా పరిశీలించి- ఫోటోలు తీసుకుంటారు. ఒకరోజు రెస్టారెంట్లో ఆమె తాగి వదిలి వెళ్ళిన టీ గ్లాసుని దులెనీ ఒక డాలరిచ్చి కొని, వేలి ముద్రలు సరిపోల్చి చూస్తాడు.

జూలై 13, ఆదివారం.

మిటిల్, జోయీ ఇంట్లో ఉంటాడు. ఆమెకోసం ప్రధానపుటుంగరం తెస్తాడతను. 'మన ప్రేమని సార్ధకం చేసుకుందాం ఈ రాత్రికి.' అంటూ ఆమె '*పద బెడ్రూమ్లోకి వెళ్దాం. వైన్ పట్రా.*' అని చెప్పి తన బాగ్ తీసుకుని బాత్రూమ్లోకి  వెళ్తుంది. కత్తి తెరిచి, తువ్వాలు చేతిమీద వేసుకుని బయటకి చూస్తే- మిటిల్ వెల్లకిలా పడుక్కుని ఉండి నడుంవరకూ దుప్పటి కప్పుకుని కనిపిస్తాడు

*'Oh lover' she breathed.*

*The blade went into soft cheese.*

అతని మెడ నుండి రక్తం నేలమీదకి కారేలా, అతని తలని మంచం చివర్న కిందకి వేళ్ళాడేసి, తన కార్యక్రమం పూర్తి చేయడానికి, అతనిమీదున్న దుప్పటి ఎత్తుతుంది కానీ ఆమె చేయి తొట్రుపడి ఆగుతుంది. *ఊహూ*, అది *తన వల్ల కాదు.* అయినా, బాత్రూమ్లోకి వెళ్ళేముందు, మంద్రస్వరంతో *'There, there,*

*there.'* అనడం మాత్రం మానదు. స్నానం చేసి, తను కొన్న మెక్సికన్ పెళ్ళి గౌను తొడుక్కుంటే, అది అస్థిపంజరంలా తయారైన ఆమె శరీరంమీద నుంచి జారిపోతూ ఉంటుంది. బాండ్ ఎయిడ్ వేలి చుట్టూ చుట్టుకుని, అతనిచ్చిన ఉంగరం పట్టించి, నిద్రమాత్రల ఒక పూర్తి సీసా, ఇంకో సగం ఖాళీ సీసా తీసుకుని, మంచం పక్కన నేలమీద పెడుతుంది. లైట్లన్నీ ఆర్పేసి, వోడ్కాతో పాటుపాటు నిద్రమాత్రలు మింగుతూ, మిటిల్ పక్కనే అతన్ని పట్టుకుని పడుక్కుని, మరణంకోసం ఎదురు చూస్తుంది.

ఆమె ఎంతసేపటికీ బయటకి రాకపోవడం, లోపలికి వెళ్ళిన మిటిల్ ఇంకా అక్కడే ఉండటం– గమనిస్తున్న బయటి పోలీసులు లోపలికి ప్రవేశించినప్పుడు వాళ్ళకి కనిపించిన దృశ్యమే జరిగినదేదో చెప్తుంది.

★★★

పుస్తకం 2 ప్రాథమిక వనరులవల్ల ఊపందుకుంటుంది. జోయీ హత్యలు చేయడం కోసం సిద్ధం అవుతున్నప్పుడు పాఠకులకి ఆమె అసాధారణమైన మెదడు పని చేసే రీతి పరిచయం అవుతుంటుంది. రెండోది–ప్రహేళిక ముక్కలని కలుపుతూ, ఈ నిగర్వి అయిన స్త్రీయే హంతకురాలని గుర్తు పట్టడానికి దులెనీ ఒక్కడే చేసే ప్రయత్నాలు. జోయీ గురించి దులెనీ ఊహించే మానసిక చిత్రం నమ్మదగ్గదిగా, బలంగా అనిపిస్తుంది. అణిచివేయబడి– వక్రీకృతకోరికలూ, ఉద్వేగం కలిగిన జోయీకి పూర్తిగా వ్యతిరేకంగా ఉండే దులెనీని సాండర్స్ అంతే నిపుణతతో, ఒక సభ్యత గల, నిగ్రహవంతుడైన, సమర్థుడైన వ్యక్తిగా చిత్రీకరిస్తారు.

జోయీ ఉన్మాదపు అవరోహణ మొదట మనోరంజకంగా అనిపించినప్పటికీ, నవల ముందుకు సాగుతుంటే, భీతి కలుగుతుంది. పుస్తకంలో ఉన్న మర్మం ' ఎవరు చేశారు, ఎలా చేశారు?' అన్నది కాదు. అది మనకెలాగూ మొదటే తెలుస్తుంది. 'ఎందుకు!' అన్నదే ముఖ్యమైన అంశం. అదే పుస్తకాన్ని చదివిస్తుంది.

రచయిత పాఠకులని రెండు ప్రత్యామ్నాయ కథనాల ద్వారా తీసుకు వెళ్తాడు: ఒకటి హంతకురాలిది, మరొకటి ఎడ్వర్డ్ ఎక్స్ దులెనీ ప్రయత్నాలు. హత్యని అందుకునే డిటెక్టివ్ పని స్వభావం వల్ల, సంఘటలకి కొంత వెనకబడే ఉంటాయి పరిశోధన ప్రయత్నాలన్నీ.

నెలసరులూ, తిమ్మిర్లూ, హత్యలూ– మరీ ముఖ్యంగా, ఆ హత్యలు జరిగిన విధానాల వర్ణనలు– మోటుగా, కొంతమట్టుకు అశ్లీలంగా అనిపించే సంచలనశీల రచనా పద్ధతి తీవ్రతని– దానికి తాత్విక, నైతిక స్వభావాన్ని ఆపాదించడం వల్ల పుస్తకం చదవడానికి ఇబ్బంది కలగదు.

ఈ పుస్తకంలో జోయీ తన అపార్టుమెంటుని శుభ్రం చేస్తున్నప్పుడు ఆమె వాడిన పుట్టుపొడి, తలుపుల గడియలమీద చమురు పోయడం–వీటన్నిటినీ బ్రాండు పేర్లతో సహా వర్ణించడానికి 4 పేజీలు పట్టింది రచయితకి. ఈ సైకొలోజికల్ థ్రిల్లర్ నిడివి 420 పుటలు.

## పింజర్/ पिंजर/Skeleton
## అమ్రితా ప్రీతమ్




అమ్రితా ప్రీతమ్ ప్రముఖ పంజాబీ మహిళ నవలా రచయిత. ప్రీతమ్ పాకిస్తాన్లో ఉన్న గుజ్రన్‌వాలాలో 1919 లో అమ్రితా కౌర్‌గా జన్మించి, కొత్త ఢిల్లీలో 2005 లో పరమపదించారు. ప్రీతమ్ ఆమె మొదటి భర్త పేరు. ఆమె మొదటి పద్యాల సంకలనం 'అమ్రిత్ లెహెరేన్' (Immortal Waves) ఆమెకి 16 ఏళ్ళప్పుడు, ప్రీతమ్ సింగ్ భార్యగా ఉన్నప్పుడు ముద్రించబడినది. స్వాతంత్రం తరువాత, 1947 లో ఢిల్లీ వచ్చినప్పుడు

ప్రీతమ్ ఆరంభంలో, ఆధ్యాత్మిక దృష్టికోణంతో తన రచనలను ప్రారంభించారు. ఆ తరువాత ఆమె రాసిన చాలా రాతల్లో విభజన గురించిన ప్రస్తావన ఉంది.

ప్రీతమ్ నవలలు, వ్యాసాలు, చిన్న కథలు, స్వీయచరిత్రలు/కవితలేకాక, పంజాబ్ విభజనపై ఒక పద్యం కూడా రాశారు. సామాజిక కట్టుబాట్లని అనుసరించక- తనకి నచ్చిన విధానంలోనే, అత్యంత గాఢతతో తన జీవితాన్ని గడిపారు.

పంజాబీ భాష మీద ఆమెకు అద్భుతమైన పట్టుండేది. ఆమె స్వీయచరిత్ర-रसीदी टिकट( The Revenue Stamp) అనేకమైన భాషల్లోకి అనువదించబడింది.

ఆమె 'నాగ్మణి' అన్న పంజాబీ మాసపత్రికకి ఎడిటర్‌గా చాలాకాలం పని చేశారు. అమ్రితా ప్రీతమ్ మరి కొన్ని స్వీయచరిత్రలు కూడా రాశారు. 'Black Rose' (కాలా గులాబ్) 1968లో, Revenue Stamp (రసీదీ టికెట్) 1976లో, 'అక్షరోన్ కా సాయా' (అక్షరాల నీడ) 2004లో. ఆమె రాసిన 'సునేహ్రే' (Golden) 1955- ఆమె సర్వోత్కృష్ట రచనగా లెక్కించబడుతుంది. ఈ పుస్తకానికని 1956లో ఆమె సాహిత్య అకాడమీ అవార్డ్ పొందారు. ఈ అవార్డ్ పొందిన మొట్టమొదటి స్త్రీ ప్రీతమ్.



ఆమె రాసిన 'కాగజ్ తె కాన్వాస్' (Paper and Canvas-1981)కి 1982 లో భారతీయ జ్ఞాన్ పీఠ్ పురస్కారం పొందారు.

ఆమె పద్మశ్రీ, పద్మ విభూషణ్ గ్రహీత కూడా. 1986-92లో ప్రీతమ్ రాజ్యసభ సభ్యురాలిగా పని చేశారు. 2007లో, ఆమె గురించి గుల్జార్ కథనం చేసిన 'అమ్రితా' విడుదలయింది.

ప్రీతమ్ రాసిన పుస్తకాల్లో కొన్ని సినిమాలుగా వచ్చాయి. 'ధర్తీ సాగర్ తే సిప్పియాన్' (కాదంబర్)గా 1965 లో, ఉనాహ్ దీ కహానీ(డాకూ- Dacoit )గా, 1976లో- బాసూ భట్టాచార్యా దర్శకత్వంతో వచ్చింది.

ఆమె 1970 లో రాసిన నవల పింజర్‌ని, చంద్ర ప్రకాష్ ద్వివేదీ 2003 లో హిందీ సినిమాగా తీశారు. సినిమా షూటింగ్ రాజస్థాన్ పొలిమేరల్లోనూ, పంజాబ్‌లోనూ జరిగింది. ఈ నవలా పురస్కారం గెలుచుకున్నదే. దీన్ని ఖుష్వంత్ సింగ్ 2009 లో 'Skeleton' అన్న పేరుతో ఇంగ్లీష్లోకి అనువదించారు.

నవల- భారతదేశ విభజన సమయంలో భారతీయ సమాజపు పరిస్థితులనీ, స్వభావాన్నీ వర్ణిస్తుంది. అమ్రితా ప్రీతమ్ స్వంత అనుభవాలన్నిటితో నిండి ఉన్నదీ పుస్తకం. ఇది, ప్రధానపాత్ర అయిన పూరో దృష్టికోణంతో రాయబడినది.

★★★

మార్కెట్లో హమీదా బటాణీలమ్ముతుండటంతో, పుస్తకం ప్రారంభం అవుతుంది. చేటతో బటాణీలని బస్తా బయటకి తీస్తూ, ఎదురుగా ఉన్న ఖాళీ గోడని చూస్తున్నప్పుడు- గతజ్ఞాపకాలు ఆమెని కమ్ముకుంటాయి.

వడ్డీవ్యాపారి అయిన తండ్రి మోహన్ లాల్ , సాత్వికురాలైన తల్లి తారా, తనని ఎంతో అభిమానించే అన్న త్రిలోక్‌నీ, చెల్లెలు రజ్జోనీ తలచుకుంటుంది.

రత్తోవాల్ గ్రామానికి చెందిన రామ్‌చంద్ తల్లితండ్రులతో మాట్లాడి, తన పెళ్ళి అతనితో నిశ్చయించిన తండ్రే తప్ప పూరో రామ్‌చంద్‌ని చూడదు. ఛత్వానీ ఆమె గ్రామం. గాజుల సంబరం జరుగుతున్నప్పుడు వైవాహిక ఆనందానికి గుర్తుగా, మంగలతను పూరో చేతికి గాజులెక్కిస్తున్నప్పుడు, యాధృచ్ఛికంగా కొన్ని గాజులు చిట్లుతాయి. ఒక్కటి విరిగినా, వైధవ్యమో అలాంటి అవాఛనీయ సంఘటనేదో జరగబోయేదానికి సంకేతం అయినందువల్ల, పూరో భయపడి రామ్‌చంద్‌కి దీర్ఘాయుష్షుండాలని ప్రార్థిస్తుంది.

తల్లితండ్రులు ఆమె ప్రధానానికి ఏర్పాట్లు చేస్తుండగా, తల్లికి మగపిల్లాడు పుడతాడు.

పూరో స్నేహితురాళ్ళతో కలిపి తమ పొలాలకి వెళ్తున్నప్పుడు, ఒక ముస్లిం యువకుడు తన్ని పొంచిపొంచి చూడ్డం, వెంబడించడం గమనించి,

భయపడుతుంది.

స్నేహితురాళ్ళకి చెప్పినప్పుడు, వాళ్ళు హాస్యం పట్టిస్తారు:

*You are lucky it want a bear! A tiger devours its victims. A bear is said to take a woman to his cave and behave towards her as if she were its wife.*

ఆమెని చాటుగా చూసే రషీద్ అనే ముస్లిమ్ యువకుడు పూరోని చూసిన మొదటిసారే, ఆమెతో ప్రేమలో పడతాడు.

రెండ్రోజుల తరువాత మళ్ళీ పొలానికి వెళ్ళినప్పుడు రషీద్ ఒక చెట్టు వెనకాతల నిలుచునుంటాడు. పూరో భయంతో వణికినప్పుడు, ప్రీతమ్ రషీద్‌ని వర్ణిస్తారు:

*An enormous grizzly bear, he stretch out his arms, his big claws draw her into an embrace, caress her neck, sharp nails, ready to drag into his cave, hairy, powerful form, glowing eyes."*

పూరో పెళ్ళి దగ్గిరపడుతూ ఉంటుంది.

ఒక సాయంత్రం తారా తన కొడుక్కి పాలిస్తూ– పొలంనుండి బెండకాయలూ, చిక్కుడుకాయలూ తెమ్మని పూరోకి చెప్తుంది. పూరో భయపడుతూనే వెళ్ళి వాటిని కోసుకుని, వడివడిగా వెనక్కి వస్తున్నప్పుడు, గుర్రపు డెక్కల వేగపు శబ్దం వినిపిస్తుంది. రషీద్ తన చేతిని ఆమె నడుంచుట్టూ తిప్పి ఆమెని గుర్రం మీదకి లాగి తనతోపాటు తీసుకుపోతాడు.

*She had lost consciousness, and when she came to her senses, she found herself on a charpoy in a room with the door shut.*

*She dreamed, she was in a cave. A black bear was combing her hair with its claws. She shrank in size, while the bear grew bigger and bigger. The bear took her in its shaggy embrace.*

ఆమెకి స్పృహ వచ్చాక, తనే ఆమెని అపహరించానని రషీద్ చెప్తాడు. ఆమె చేతులు జోడించి అతన్ని ప్రార్థిస్తుంది:

"Rashida, have pity on me! Take me back to my people.' (పంజాబీలో 'రషీద్' ని పిలిచేది/సంబోధించేది 'రషీదా'గా)

పూరో విడిపించుకుని పారిపోడానికి ప్రయత్నించి, విఫలమయి–నిస్సహాయురాలవుతుంది

రషీద్ పూరోని తాకను కూడా తాకడు. వంట వండి, బలవంతంగా ఆమెకి తినిపించడానికి ప్రయత్నించినప్పటికీ ఆమె అన్నపానీయాలు ముట్టదు. తను ఆమెని ఎత్తుకురావడానికి కారణాలు వివరిస్తాడతను:

*"మన కుటుంబాలు– షేకులూ, షావుకార్లూ తరాలుగా శత్రువులు. మీ తాత 500 రూపాయల చక్రవడ్డీకి మా తాతకి అప్పిచ్చి, మా ఇంటిని తాకట్టు పెట్టి ఈనాటికీ దాన్ని విడిపించుకోలేకపోయాడు. మీ పెద్దనాన్న, మా మేనత్తని ఎత్తుకుపోయి, మూడ్రోజులు తన ఇంట్లో బలవంతంగా ఉంచుకున్నాడు. ఈ ఊళ్ళోనే నీ పెళ్ళి ఏర్పాట్లు జరుతున్నాయని తెలియడంతో, పాతపగలు సాధించుకోడానికి నీ పెళ్ళవకముందే నిన్ను ఎత్తుకొనివస్తానని నాచేత ఒట్టేయించుకున్నారు మావాళ్ళు. నా మేనమామ బలవంతం వల్ల తప్ప నేనిది ఇష్టపూర్వకంగా చేయలేదు."*

ఈ మాటలతో పాఠకులకి అతనిమీద సానుభూతి కలిగించడంలో రచయిత్రి సఫలమవుతుంది. ఒక్కసారి తన తల్లిని చూసి వస్తానంటుంది పూరో. వాళ్ళు ఆమెని స్వీకరించరని రషీద్ ఆమెకి వివరించడానికి ప్రయత్నిస్తాడు:

*Good woman, you have no place in that family anymore. If they let you in even once, not one of their Hindu friends or relatives will take a drop of water in their house. And you have been with me for fifteen days.*

*పూరో పరిస్థితిని రచయిత్రి వర్ణిస్తారు:*

*By her own reckoning she had spent a full fortnight in the prison.*

ఆ రాత్రి ఆమె రషీద్ జైలునుంచి తప్పించుకుని, పరిగెత్తి తల్లితండ్రుల ఇంటి గొళ్ళాన్ని కొట్టినప్పుడు వాళ్ళు డాబామీద నిలుచుండి కనిపిస్తారు. పొరుగువారు గమనించి, ' నీవు నీ కూతుర్ని స్వీకరించినా, సహాయం చేసినా మన పంజాబీ సమాజం నిన్ను వెలివేస్తుంది.' అంటూ తండ్రిని హెచ్చరిస్తారు

మోహన్ లాల్ కూతురితో చెప్తాడు: '*Daughter, this fate was ordained for you, we are helpless. The Shaikh's will descend on us and destroy everything we have.'*

*You have lost your religion and your birth right. If we dare to help you, we will be wiped out without a trace of blood left behind to tell of our fate."*

ఏడుస్తూ, 'అయితే తన్ని వాళ్ళ చేతులతోనే చంపేయమని', పూరో అడిగినప్పుడు తల్లి సమాధానం ఇస్తుంది:

*"Daughter, it would have been better if you had died at birth! If the Shaikh's find you here they will kill your father and your brothers. They will kill all of us."*

బయటకి వచ్చి చూసినప్పుడు, రషీద్ తనకోసం రొప్పుతూ, పరిగెత్తుతూ రావడం కనపడి, గత్యంతరం లేక అతనితోపాటు వెళ్తుంది.

ఒకరోజు సిల్కు బట్టలు తెచ్చి చెప్తాడు:

*"Tomorrow you have to wear this; a Maulvi will be coming to perform our Nikaah. Be ready in time.*

రామ్‌చంద్ ఇంట్లో కోడలిగా అడుగుపెట్టే కలలు కంటుండే పూరో కాళ్ళకిందనున్న నేల కదలడం ప్రారంభిస్తుంది. తనకి పట్టబోయే గతిని ఊహించిన పూరో రషీద్‌ని అడుగుతుంది:

*"If my uncle abducted your aunt, what fault was that of mine?"*

పూరో అతని పట్ల అసహ్యం పెంచుకున్నప్పటికీ పెళ్ళి మాత్రం అయిపోతుంది.

అన్న త్రిలోక్ ఆశ విడవకుండా పోలీస్ స్టేషన్లో రిపోర్ట్ చేసి, చెల్లెలి కోసం వెతికే ప్రయత్నాలు ఆపడు. తండ్రి మోహన్ లాల్ కాబోయే వియ్యంకుడింటికెళ్ళి, జరిగినది చెప్పిన తరువాత– పూరో చెల్లెలు రజ్జోని రామ్‌చంద్ పెద్దనాన్న కొడుక్కివ్వాలనీ, కుండమార్పుగా రామ్‌చంద్ చెల్లెలు లాజోని త్రిలోక్ పెళ్ళి చేసుకుంటాడనీ నిశ్చయం అయి– పెళ్ళి ఏర్పాట్లు ప్రారంభిస్తారు.

పూరోకీ రషీదుకీ పెళ్ళయితే అవుతుంది కానీ ఆమె తన జీవితానికి ఒక ఉద్దేశ్యం కానీ అర్థం కానీ కనుక్కోలేని అస్థిపంజరం( Pinjar/skeleton)లా తయారవుతుంది. రషీద్ అనాలోచితమైన తన తప్పుకి పశ్చాత్తాపపడుతూ కూడా– పూరోని ఎంతగానో ప్రేమిస్తాడు.

మేనమామలూ, వారి కొడుకులూ తప్ప రషీద్‌కి కుటుంబం అంటూ ఉండదు. అదే ఊర్లో ఉంటే అంతటా కబురు పాకి హిందువులకి కోపం వస్తే, కక్షలూ కార్పణ్యాలూ తలెత్తవచ్చంటూ– తన కొంత పొలాన్ని దూరపు బంధువొకతనితో మారకం చేసి ఛత్వానీ వదిలిపెట్టి, కొన్ని కోసుల దూరం ఉన్న బంధువున్న ఉన్న పల్లెటూరికి వెళ్దామనడంతో:

*Pooro followed him as the blind follows a guide.*

రషీద్– బంధువు ఒకావిడ సలహాతో, పూరో కొత్త ముస్లిమ్ పేరు 'హమీదా'ని ఆమె చేతిమీద పచ్చబొట్టు పొడిపిస్తాడు. ముస్లిమ్ సమాజం తమ భిన్నమైన ఉనికిని సూచించడానికి పచ్చబొట్టుకని ముదురు ఆకుపచ్చరంగు ఉపయోగిస్తుంది. ఆమె ఏడుస్తూ, దాన్ని రుద్దిరుద్ది తొలగించడానికి ప్రయత్నిస్తుంది.

ప్రీతమ్ వర్ణిస్తారు:

*In parent's home, everyone still called her Pooro. At other times she was Hamida. It was a double life. Hamida by day, Pooro by night.*

*In reality, she was neither one or nor the other she was just a skeleton, without a shape or a name.*

నవలలో మొదటి భాగం పూర్తి ద్వేషపూరిత విధానంతోనూ, హిందూ సమాజం మరియు ముస్లిం సమాజం మధ్య విభజన వివరాలతోనూ ఉంటుంది.
హమీదా గర్భం ధరించినప్పుడు రషీద్‌కి కలిగిన సంతోషం కాస్తా, ‘ నీ ఈ పాపాన్ని నాలుగు నెల్లగా మోస్తున్నాను.’ అన్న హమీదా మాటలతో ఆవిరవుతుంది.
హమీదాకి మగపిల్లాడు పుడతాడు. హమీదా ఆరోగ్యం గురించి రషీద్ అడిగినప్పుడు ఆమె అభావంగా జవాబిస్తుంది.
*What more do you want of me? I have given you my person and I have given you a son. I have nothing more to give.*
రషీదా సంతోషం ఎన్నాళ్ళో నిలవదు. పసివాడు చనిపోతాడు.
కమ్మో అన్న ఒక మధ్యవయస్కురాలిని భర్త వదిలిపెడతాడు. ఆమె పిచ్చిదయి, అదే ఊళ్ళో తిరుగుతూ ఉంటుంది. హమీదా ఆమెకి భోజనం పెడుతూ ఉంటుంది. ఎవరో కమ్మోని చెరుస్తారు. ఒకరోజు ఆమె ఒక చెట్టుకింద చనిపోయి ఉండి, హమీదా కంటపడుతుంది. చనిపోయే ముందు ఒక బిడ్డకి జన్మనిస్తుంది. రషీద్ వచ్చి బొడ్డు కోసి, నవజాత శిశువుని ఇంటికి తెచ్చాక– ఇద్దరూ కలిపి పసికందుని తమ స్వంత పిల్లవాడిలాగే పెంచడం ప్రారంభిస్తారు. కానీ, ఊరి పంచాయితీ పెద్దలు హిందూ పిల్లాడిని కూడా వీళ్ళిద్దరూ ముస్లిమ్‌ని చేస్తున్నారంటూ గొడవ పెట్టినప్పుడు– రషీద్, ’తన భార్య ఆరు నెల్లగా పిల్లాడిని స్వంతబిడ్డలా పెంచుతోందనీ, తన మనస్సు విరిగిపోతుందనీ,’ ఎంత బతిమాలుకున్నప్పటికీ ఊరి పెద్దలు వొప్పుకోకపోక, రషీద్ ఇంటినుంచి పిల్లాడిని లాక్కుపోతారు.
గర్భం ధరించిన భార్య లాజోని– త్రిలోక్ ఆమె పుట్టింట్లో దిగబెట్టడానికి వెళ్ళినప్పుడు, చెల్లెల్ని ఎత్తుకుపోయినది రషీదే అన్న ఆచూకీ దొరుకుతుందతనికి. ద్వేషంతో, ఒక రాత్రి కోతకి వచ్చిన రషీద్ పొలాన్ని తగలబెట్టేస్తాడు.
కబురు తెలిసి రషీద్ తన పొలాన్ని చూడ్డానికి వెళ్ళినప్పుడు అతని బంధువులు, ‘ఎవరు తగలబెట్టారో మనకి తెలిసీ పగ తీర్చుకోకుండా ఎలా ఉండగలం! అని అడిగినప్పుడు, ‘ఇంకా సాక్ష్యం ఏదీ లేదు కదా! అయినా, మీ చెల్లెల్నే ఎవరో లేపుకుపోతే, మీరు మాత్రం చేతులు కట్టుకుని కూర్చుంటారా?’ అని ప్రశ్నించినప్పుడు, ‘నిజమే, అది రషీద్ కుటుంబ వ్యవహారం. మనం తల దూర్చకూడదు.’ అని బంధువులు కూడా అంగీకరిస్తారు.
ఇంటికి వచ్చిన తరువాత భోజనం చేస్తూ, హమీదా అడినప్పుడు రషీద్ చెప్తాడు:
*"I am told that a young stranger came to village. He kept himself aloof. Some villagers suspect that he was your brother.*
‘తను చేసిన పాపానికి ఇన్నాళ్ళ తరువాత మొదటిసారి తన మనస్సు తేలికయింది.’ అని చెప్తాడు.
రషీద్ బంధువొకామె కళ్ళకి సమస్య ఉంటుంది. పక్క ఊళ్ళో ఉన్న హకీమ్‌తో ఆ వయస్సు మళ్ళినావిడకి పది– పదిహేను రోజులు చికిత్స చేయించాలంటూ, హమీదాని తోడుగా పంపుతారు. ఆ హకీమ్ ఉన్నది రామ్‌చంద్ గ్రామంలోనే. హమీదా అతని పొలాలకి వెళ్ళి, ఒకసారి అతని కంటపడుతుంది. ‘నువ్వెవరివి బీబీ! ఏమైనా సహాయం కావాలా? అని రామ్‌చంద్– ముస్లిమ్ వస్త్రధారణలో ఉన్న ఆమెని అడిగినప్పుడు, సమాధానం చెప్పక, పరిగెత్తి వెళ్ళిపోతుంది కానీ ఆమెవరో రామ్‌చంద్ ఊహించగలుగుతాడు. తనింకా అతన్ని మనస్సులోనుంచి తొలిగించలేకపోయిందని హమీదా గుర్తిస్తుంది.
రాష్ట్రంలో పరిస్థితి దిగజారి, హిందువులూ ముస్లిమ్లూ– ఒకరినొకరు ద్వేషించుకుని, చంపుకునే పరిస్థితి వచ్చినప్పుడు, రచయిత్రి వర్ణిస్తారు:
*"Just as a peeled orange falls apart into many segments, the Hindus, Muslims and Sikhs of Punjab broke away from each other. As clouds of dust float over the roads, rumours of "incidents" began to float over the countryside. It was said that men were being slaughtered in hundreds; rows of houses were being burnt down; neighbours were slitting each other's throats. No one's life or property was safe.*

వీధుల్లో రక్తం పారుతూ, మృతదేహాలని పూడ్చిపెట్టేవాళ్ళు కానీ సమాధి చేసేవాళ్ళు కానీ లేకపోతారు. ఒక జాతి ఆడపిల్లల్ని మరొక జాతివారు ఎత్తుకుపోయి– కొంతమందిని హత్య చేసీ, బలాత్కారం చేసీ, కొందర్ని వివస్త్రలని చేసీ– నడివీధుల్లో ప్రదర్శిస్తారు. కొంతమందికి మతమార్పిడి చేసి పెళ్ళి చేసుకుంటూ ఉంటారు. రచయిత్రి చెప్తారు:

*Thus passed August 15 of the year 1947.*

*It was a sin to be alive in a world so full of evil. It was a crime to be born a girl.* హమీదా అనుకుంటుంది.

ఛత్వానీ, రత్తోవాల్ –రెండు గ్రామాలూ పాకిస్తాన్లోకే వస్తాయి.

'హిందుస్తాన్ వెళ్ళేవారు ఇటువైపు రండి.' అన్న పోలీసుల ప్రకటనలు మైకులో వినిపిస్తుంటాయి.

హిందువులందరూ గుంపులుగా, తాము మోసుకెళ్ళగలిగే విలువైనవాటిని మాత్రం పట్టికెళ్తూ– అటువైపుగా ప్రయాణించడం మొదలుపెడతారు. వాళ్ళల్లో కొంతమందిని దార్లోనే చంపేస్తారు. ఒకవైపు ముస్లిమ్లు తమకోసం ఒక కొత్త దేశం ఏర్పడిందని పండుగ చేసుకుంటూ, స్వేచ్ఛగా తిరుగుతూ, ఖాళీగా పడున్న ధనిక హిందువుల ఇళ్ళనీ, పొలాలనీ ఆక్రమించుకుంటూ ఉంటే, హిందువులు అన్నిటినీ వదులుకుని తమ దేశం వదిలి వెళ్ళవలిసే అగత్యం పడుతుంది.

*The village looked deserted. The only non-Muslims left in it were the three charred corpses in the street. In two days, the crows and pie-dogs had torn away the flesh. Only the skeletons remained in front of the burnt-down house.*

*The following evening a convoy of refugees passed through Chatto. The men were on foot, the women and children on bullock-carts along with the baggage. A few police constables marched at the front and the rear. The refugees looked crestfallen; misfortune had settled on their faces like a layer of dust. It was getting dark, so the convoy halted outside Chatto for the night.*

శిబిరాలలో ఉన్న హిందు స్త్రీలని రోజు ఎవరో ఒకరు ఎత్తుకెళ్తూ, మర్నాడు తిరిగి వదిలిపెడుతుంటారు. పుట్టింటికెళ్ళి రామ్‌చంద్ కుటుంబంతో పాటున్న హమీదా వదినైన లాజోని కూడా ముస్లిమ్లు దార్లోనే అపహరిస్తారు.

రామచంద్ కుటుంబం శరణార్థుల శిబిరంలోకి ప్రవేశిస్తుంది. అది తెలిసిన హమీదా ఆఖరిసారి రామ్‌చందుని చూడాలనుకుంటుంది. ముస్లిమ్లనుంచి తప్పించుకోడానికి చెరుకుతోటలో దాక్కున్న ఒక యువతిని రక్షించి హమీదా తన ఇంట్లో దాచి పెట్టినప్పుడు, ఆ అమ్మాయిని ఊళ్ళో ఉన్న ముస్లిమ్లు వెతుకుతుండగా రషీద్ కూడా భార్యకి సహకారాన్నందించి 'తన ఇంట్లోకి ఎవరూ రాలేదని' చెప్తాడు. ఆ యువతిని శిబిరంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తూ హమీదా ఒక రాత్రి,– రామ్‌చందున్న శిబిరానికి చేరుకుంటుంది. 'నీవు పూరోవేనా? అని రామ్‌చంద్ అడినప్పుడు, 'ఇంకా అది అడిగే అవసరం కూడా ఉందా?" అని ప్రశ్నించి, ఆ యువతిని రామ్‌చంద్ చేతులకి అప్పగిస్తుంది. రామ్‌చంద్‌ని అందరి క్షేమసమాచారాలూ అడిగినప్పుడు, తన చెల్లెలికి ఎవరితో పెళ్ళయిందో, అన్న ఎవరిని పెళ్ళి చేసుకున్నాడో–అన్న వివరాలు తెలుస్తాయామెకి. లాజో కనపడకుండా పోయిందనీ, ఎవరెత్తుకుపోయారో కూడా తెలియదనీ చెప్తాడు రామ్‌చంద్.

శరణార్థుల ఆకలిని పరిశీలిస్తూ, వారి కంఠంగా మారుతుంది రచయిత్రి:

*"The refugees bartered their trinkets and jewellery to buy food and grain. Some people from Chatto went out to settle rates and then, under the very eyes of the constables, sold their maize and barley for their weight in gold and silver."*

ఆ రాత్రి రషీద్‌కి తన వదిన గురించి చెప్పి, ఎలాగో అలాగ లాజోని కాపాడ్డానికి తనకి సహాయం చేయమని అడుగుతుంది హమీదా.

రషీద్ లాజోని వెతకడంకోసం ఒక ప్రణాళిక వేస్తాడు. హమీదా ధాన్యం అమ్మేదానిలా రత్తోవాల్‌లో లాజోని పట్టికెళ్ళిన వారింటికి వెళ్ళి వెతకాలి. ఇద్దరూ, రత్తోవాల్‌లో ఊరిమూల మకాం పెడతారు.

లాజో ఉన్న ఇల్లు రామ్‌చంద్ ఇంటిని ఆక్రమించుకున్న ముస్లిములదే. కొన్నాళ్ళు ధాన్యం అమ్మడానికి ప్రయత్నిస్తూ వాళ్ళింటి చుట్టూ తిరుగుతూ, లాజోని ఎత్తుకుపోయిన యువకుడి తల్లితో కబుర్లాడుతూ ఉంటుంది హమీదా కానీ వొంటరిగా లాజోని కలుసుకునే అవకాశం దొరకదు. లాజో చేతిమీద తన అన్న త్రిలోక్ పేరు పచ్చబొట్టుతో పొడిపించడం వల్ల తనైతే లాజోని గుర్తు పడుతుంది కానీ లాజో ముందుందెప్పుడూ పూరోని చూడకపోవడం వల్ల హమీదాయే పూరో అని తెలుసుకోలేకపోతుంది.

వొకరోజు లాజో ఇంట్లో వొంటరిగా ఇంట్లో ఉండటం చూసినప్పుడు, తనెవరో చెప్పి తన భర్త వచ్చి రాత్రిపూట నూతివద్ద లాజోకి కలుసుకుని తన ఇంటికి తెస్తాడని హమీదా చెప్తుంది. దీన్లో రషీద్ పడిన శ్రమ ఇంతా అంతా కాదు. అప్పటికల్లా కోల్పోయిన తమ భార్యలని–వారు ఏ దశలో ఉన్నప్పటికీ కూడా, స్వీకరించడానికి హిందువులు సిద్ధంగా ఉంటారు.

మొదట లాజో, 'తను చెడిపోయాననీ, భర్తవద్దకి వెళ్ళే అర్హత ఇక తనకి లేదనీ, హమీదా ఇంట్లోనే ఒక ముద్ద పడేస్తే అక్కడే పడి ఉంటాననీ,' వేడుకుంటుంది కానీ రషీద్ ఆమెని మృదువైన మాటలతో, అభిమానంతో త్రిలోక్ వద్దకి వెళ్ళడానికి వొప్పిస్తాడు.

హమీదా, లాజోని తెచ్చి శిబిరంలో రామ్‌చంద్‌కి అప్పగిస్తుంది. అప్పుడు అన్నయ్య త్రిలోక్ కూడా అక్కడే ఉండి, ఆఖరికి చెల్లెలు పూరో తిరిగి వచ్చినందుకు సంతోషపడతాడు. రామ్‌చంద్ పూరోని స్వీకరించడానికి ఇప్పుడు కూడా సిద్ధంగానే ఉన్నాడని చెల్లెలికి చెప్తాడు. కానీ, తను రషీద్‌కే చెందుతానని గుర్తిస్తుంది హమీదా. అతని పట్ల తను అప్పటివరకూ వ్యక్తపరచలేకపోయిన ప్రేమనీ, అతనిపట్ల తను చూపించిన తిరస్కారమూ గుర్తొచ్చి పశ్చాత్తాపపడి, 'ఇప్పుడు రషీదే తన సత్యమనీ, అతనెక్కడుంటే అదే తన ఇల్లనీ' అన్నకి చెప్తుంది.

*'తనని వెళ్ళనీ. ఒకసారి తను తన ఇంటికి దూరం అయింది. మళ్ళీ ఆ పరిస్థితి తనకి రానివ్వకు.'* అంటూ రామ్ చంద్ కూడా త్రిలోక్‌కి సర్ది చెప్తాడు.

నమ్మశక్యం కాని, ఆశ్చర్యపరిచే అనుభవాలెన్నో పుస్తకంలో ఉన్నాయి.

లారీలో భారతదేశానికి చెందిన వాళ్లందరూ తమ దేశానికి వెళ్ళడానికి తయారుగా ఉండమని లారీ తలుపు మూసేముందు మిలిటలీవాళ్ళు చెప్పాక– పూరో కళ్ళ ఎదుటే లారీ, లాహోర్‌నుండి భారతదేశం వైపు కదులుతుంది.

★★★

పింజర్ ఒక్క దేశవిభజన గురించి మాత్రమే కాదు. అది ఆ కాలంలో స్త్రీల స్థితిగతుల గురించి కూడా. తమకంటూ ఒక గొంతు లేని యువతుల గురించినది. తన పూర్వీకులు చేసిన అత్యాచారాలకి పూరో రెండు కుటుంబాలకీ మధ్యా ఒక పావుగా వాడుకోబడింది. అయినప్పటికీ, పూరో బలహీనురాలు కాదు. దృఢనిశ్చయం, పట్టుదలా ఉన్న ధైర్యవంతురాలు. కుటుంబాల, సంఘాల, దేశాల మధ్య కఠోర విభేదాలు ఎలా కలిగేయో అన్న హృదయవికారకరమైన కథ పింజర్. నవల భారతదేశపు చరిత్రలో 70 ఏళ్ళ కిందటి మహిళల దురవస్థకి సంబంధించినది. ఆ రక్తపాత సమయానికి ముందూ తరువాతా జరిగిన సంఘటనల గురించినది.

1947 విభజన, భారతదేశ చరిత్ర యొక్క చీకటికాలాలలో వొకటి. అది మానవత్వం పూర్తిగా దిగజారి, కుటుంబాలు విచ్ఛిన్నమయి– మృత్యువూ, నాశనం మనుష్యులమీద తాండవం చేసిన కాలం.

పొరుగువారు శత్రువులయారు. స్నేహితులు ఒకరినొకరు చంపుకున్నారు. ద్వేషపు, దుర్మార్గపు గందరగోళంలో మానవాళి తన అర్థాన్ని కోల్పోయిన కాలం అది. విభజన గురించిన అనేకమైన పుస్తకాలూ, సినిమాలూ వచ్చాయి. A Train to Pakistan, Garam Hawa, Tamas, Earth– అలాంటివి. ప్రీతమ్ భారతదేశంనుండి పాకిస్తానుకి కాక, పాకిస్తాన్ నుండి భారతదేశం వచ్చినప్పటికీ విభజన విషయం యొక్క సున్నితత్వం బాగానే తెలిసి ఉండటం వల్ల ఆమె పుస్తకాన్ని సహేతుకంగానే రాయడానికి అది దోహదపడింది. ఈ నవల ఏ మతాన్నీ, ఏ దేశాన్నీ నిందించలేదు. కథ– విభజన నేపధ్యంలో, భావోద్వేగాల మలుపులతో సాగుతుంది. విభజన యొక్క అఘాతాల ఫలితంగా స్త్రీలమీదన పడిన గాయపు మచ్చలని నవల పూర్తిగా ఉపేక్షించింది. 40ల 50 ల పంజాబీ సంస్కృతిని అద్భుతంగా చూపిస్తుంది పుస్తకం.

*రచయిత్రి ప్రతీ పాత్రనీ జీవమున్న ఆత్మతో నింపారు. లాజో, పూరో దానికి మంచి ఉదాహరణలు. పూరో పాత్ర ద్వారా రచయిత్రి ఒక సంపూర్ణమైన స్త్రీని చూపించారు.*

పూరో, లాజోలు తమని తామే తప్పుపట్టుకోవడం, అపరాధభావంతో కూడిన రషీద్ ప్రేమా, పిచ్చామె విషాదకర అమాయకత్వం–ఇవన్నీ కూడా మానవత్వంతో నిండి ఉండి, పింజర్ పుస్తకపు భావోద్వేగ చిత్రాన్ని చక్కగా కనపరుస్తాయి.

పూర్తి పుస్తకం చిన్నచిన్నగా విడగొట్టబడిన మాటలతో– పాత్రలు తమ జీవితాలతో రాజీ పడే విధానాన్ని వర్ణిస్తుంది. ఖుష్వంత్ సింగ్ చేసిన అనువాదం హిందీ పాఠాంతరానికి అంతెక్కువ న్యాయం చేయలేదేమో అని మాత్రం అనిపిస్తుంది. అనువదించిన తరువాత కూడా, ఆయన రచయిత్రి గురించి తన దురభిప్రాయాలని ఇంతగా ఎందుకు ఆమె సంస్మరణలో వ్యక్తపరిచారో అర్థం అవదు. ఆయన ఆ మాటలని ఇక్కడ చదవొచ్చు. Hyperlink 1.

చాలా జనాదరణ పొందిన అమ్రితా ప్రీతమ్ పద్యం 'అజ్ ఆఖన్ వారిస్ షాహ్ నూ' గుల్జార్ కంఠంతో ఇక్కడ వినే వీలుంది. Hyperlink 2

దీని అనువాదం ఇక్కడ. Hyperlink 3

*Flowers in The Attic*

*V. C. Andrews*




*క్లియో వర్జీనియా ఏండ్రూస్ (వి సి ఏండ్రూస్) – పుస్తక లోకంలో ప్రసిద్ధికెక్కిన పేరు. ఆమె రచనల శైలి కారణంగా అభిమానుల కొరత ఆమెకి ఇప్పటికీ లేదు. ఆమె టీనేజీలో ఉన్నప్పుడు, స్కూల్లో మెట్లమీద నుండి పడి, వెన్నుముకకి తీవ్రమైన గాయాలయాయి. వాటిని సరి చేయడానికి చేసిన సర్జరీ వల్ల ఆమె ఇంక నడవలేకపోయి, చక్రాల కుర్చీ/ఊత కర్ర ఆధారంగానే అధిక జీవితం గడిపారు. అయినప్పటికీ, ధైర్యం కోల్పోక, నాలుగేళ్ళ కరెస్పాండెన్స్ కోర్సు చేసి డిగ్రీ సంపాదించుకుని త్వరలోనే చిత్రకారిణిగా పేరు తెచ్చుకున్నారు. 1957లో ఆమె తండ్రి మరణించాక, తనకొచ్చిన కళని ఉపయోగించి కుటుంబాన్ని పోషించారు. ఆ తరువాత రచనలు మొదలుపెట్టారు. ఆమె సైన్స్ ఫిక్షన్ రాయడానికి ప్రయత్నిస్తూ రాసిన, 'Gods of Green Mountain' ఆమె జీవించి ఉండగా అచ్చవలేదు కానీ 2004లో ఇ బుక్‌గా విడుదలయింది. 1975లో ఆమె Flowers In The Attic రాతప్రతి పూర్తి చేశారు. 1979లో అచ్చయిన ఈ నవల తక్షణ ప్రజాదరణ పొంది, ఒక్క రెండు వారాల్లో 'న్యూయార్క్ బెస్ట్ సెల్లర్' జాబితా అగ్రస్థానానికి చేరుకుంది డాలింగాంగర్ కుటుంబం మీద రాసిన క్రమంలో మొదటిదిది.*

*ఆ తరువాత వచ్చినవి Petals on the Wind, If There Be Thorns', Seeds of Yesterday.'*

★★★

*Flowers in the Attic* Gothic నవల. ఈ శైలిలో వచ్చిన పుస్తకాలకి పునాది వేసినది 18వ శతాబ్దం. ఈ తరహా పుస్తకాల్లో సామాన్యంగా, అయిష్టాపూర్వకంగా పెద్ద భవంతుల్లో చిక్కుకున్న అందమైన యువతులూ, వారిని చెరపట్టే వికృత స్వభావం ఉన్న పురుషులూ ఉంటారు. Incest అనే ఇతివృత్తం కూడా సాధారణమే. ఇది ఏండ్రూస్ రాసిన పుస్తకాలకి ప్రత్యేకంగా వర్తిస్తుంది. ఆమె పుస్తకాలు వివాదాస్పదం అయి, వాటిల్లో ఉన్న వర్ణనలవల్ల అమెరికాలో ఎన్నో రాష్ట్రాల్లో నిషేధించబడ్డాయి కూడా. Flowers in the Attic పబ్లిష్ అయేవరకూ ఏండ్రూస్ పేరు సాహిత్యలోకంలో ఎవరూ వినను కూడా వినలేదు. అయితే, ఆమె ఆ తరువాత రాసిన పుస్తకాలన్నీ ఆమెకి పేరు తెచ్చి పెట్టినవే. ఆమె మరణం తరువాత ఘోస్ట్ రైటర్ అయిన ఏండ్రూ నీదర్మన్ సగం రాసిన ఆమె రాతప్రతులని పూర్తి చేశారు. విసి ఏండ్రూస్ పేరుతో వచ్చిన పుస్తకాలన్నిటిలో 1986లో ఆమె మరణానికి ముందు మిగతా రెండు పుస్తకాలు మాత్రమే రచయిత్రి స్వయంగా రాసినవి. నీదర్మన్ ఆమె పేరుతో ఇరవైకి పైగా రాశారు.

ఈ పుస్తకపు ముందుమాటలో, కథ యదార్థమైనదనీ, పేర్లూ చోట్లూ మాత్రమే మార్చబడ్డాయనీ రచయిత్రి చెప్పిన మాటలూ వివాదానికి గురి అయినవే.

★★★



నవల ఎనిమిదేళ్ళ కేథీ స్వరంతో వినిపించడం ప్రారంభిస్తుంది. ఆ పిల్ల డాలింగాంగర్ దంపతుల నాలుగు పిల్లల్లో రెండవది. అన్న క్రిస్ పదేళ్ళవాడు. కవలలైన క్యారీ, కోరీ చిన్నవాళ్ళు. తల్లి కొరీన్, తండ్రి క్రిస్టఫర్. సంతోషంతో, ప్రేమగా ఉంటూ ఆకర్షణీయంగా కనిపించే కుటుంబ సభ్యులతో పుస్తకం ప్రారంభం అవుతుంది. వాళ్ళుండే పెన్సిల్వేనియా వాసులు పిల్లల్ని 'డ్రెస్డన్ డాల్స్ ' అని పిలుస్తారు.

కేథీకి 12 ఏళ్ళుండగా తండ్రి తన 36వ పుట్టినరోజున, కారు ప్రమాదంలో చనిపోతాడు. కొరీన్ ఎక్కువ చదువుకున్నది కాదు. భర్త అప్పుల్లో మునిగున్నాడని కూడా ఆమెకి తెలియదు. ఇప్పుడు పిల్లల్ని సాకడమే కాక, ఆ అప్పు కూడా చెల్లించవలిసిన బాధ్యత ఆమె మీద పడుతుంది.

కేథీ అనుకుంటుంది: 'నాన్న మరణం తరువాత, మా జీవితాలలో ఒక పీడకల మొదలయింది.' అని.

క్రిస్టఫర్ మరణం తరువాత అనేకమైన ప్రత్యుత్తరాల అనంతరం, వర్జీనియలో ఉన్న తన పుట్టింటికి పిల్లల్ని తీసుకు వెళ్ళామని నిశ్చయించుకుంటుంది కొరీన్. తనకి పద్దెనిమిది ఏళ్ళుండగా ధనికులైన తల్లితండ్రులనుండి తను దూరం అయిందని, పిల్లలకి చెప్తుంది. తన పుట్టింటికి వెళ్ళాలంటే, రెండు సూట్ కేసులు తప్ప తాముండే ఇంటినీ, సామానంతటినీ విడిచి పెట్టవలిసి ఉంటుందని వాళ్ళకి వివరిస్తుంది: *'మా నాన్న అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇక ఎంతోకాలం జీవించే అవకాశం లేదు. నా అన్నదమ్ములిద్దరూ చనిపోయారు. నేనే తాతకున్న సంపదకి ఏకైక వారసురాలిని.'*

తండ్రి ప్రేమని తిరిగి పొంది, ఆయన వీలునామాలో తన పేరు రాయించుకోవాలనుకుంటుంది. పిల్లలని తీసుకుని, రైలెక్కి అర్థరాత్రి దిగి, నిశ్శబ్దంగా ఉన్న పొలాల మీదగా వాళ్ళని నడిపిస్తూ ఒక పెద్ద భవంతికి తీసుకెళ్తుంది. దాని పేరు ఫాక్స్‌వర్త్ హాల్. భవనాన్ని చూసిన కేథీ

ఆశ్చర్యపోతుంది.

*రాజభవనం అంత ఈ ఇంట్లో, ఇంత ఆస్తీ, పనివాళ్ళూ, ఇన్ని కార్లూ ఉన్న ఈ ధనిక కుటుంబంలో అమ్మ పుట్టిందని ఎవరు ఊహించగలరు!*
భవంతిలోకి అడుగు పెట్టీ పెట్టగానే పిల్లలకి ఇల్లు చూసే అవకాశం కూడా ఇవ్వకుండా వాళ్ళని త్వరత్వరగా– నిర్జనంగా, వేరేగా ఉన్న రెండవ అంతస్థు గదికి తీసుకు వెళ్తుంది. అమ్మమ్మ ఒలీవియా కఠిన స్వభావం కలది. మొదటే, పిల్లలకి ఏవేవి నిషిద్ధమో అన్న జాబితా ఇస్తుంది: *"మీరు ఎవరికీ కనిపించకూడదు. తాత మరణించేవరకూ గదిలోనే దాక్కునుండాలి. ఆడపిల్లలూ, మగపిల్లలూ వేరే వేరే మంచాల మీద పడుకోవాలి. ఈ ఇంట్లో పిల్లలు అరవడం కానీ పెద్దగా మాట్లాడ్డం కానీ తిరగబడ్డం కానీ చేయకూడదు. జాగ్రత్తగా వినండి."* కవలిద్దరికీ ఒకే మంచం మీద పడుక్కునే అలవాటుంటుంది. కాబట్టి ఇది విన్న క్యారీ ఏడ్చినప్పుడు, ఒలీవియా పిల్లని గాల్లోకి ఎత్తి జాడించి, కింద కూలేసి మరీ భయపెడుతుంది.

తనకి పిల్లలున్నారని తండ్రి మాల్కమ్‌కి తెలిస్తే ఆస్థికి తనని వారసురాలిని చేయదని తెలిసిన కొరీన్ పిల్లలకి చెప్తుంది:

*"మీ తాత ఎక్కువ రోజులు బతకడు. ఈలోగా, నేనాయన ప్రేమని తిరిగి గెలుచుకుంటాను. .. డార్లింగ్స్, ఆ తరువాత మీరూహించలేనంత ఆస్థికి నేను వారసురాలినవతాను. నాద్వారా మీ కలలన్నీ నిజం అవుతాయి. "*
గదిపైన పెద్ద మిద్దె ఉందనీ పిల్లలు అక్కడ ఆడుకోవచ్చనీ కొరీన్ పిల్లలకి సలహా ఇస్తుంది. అక్కడ పాత పుస్తకాలూ, శిల్పాలూ, బీరువాలూ అన్నీ ఉంటాయి. కాకపోతే వెలుగు వచ్చేది మాత్రం ఒకే ఒక ఇరుకు కిటికీనుంచి. కవలలకి పొద్దుపోడానికి– కేథీ, క్రిస్ మిద్దెమీదున్న సామానుతో– నకిలీ పువ్వులూ, ఆడుకునేటందుకు తోటా ఏర్పాటు చేస్తారు. కొద్దికాలం తరువాత తాము వెళ్ళగలిగే తోట కాగితాలతో చేసినది మాత్రమే అన్న భావానికి అలవాటు పడతారు కవలలు. పెద్దపిల్లలిద్దరూ కథలు చెప్తూ వాళ్ళకి విసుగు పుట్టకుండా చూస్తారు. బీరువాల్లో కుప్పలుగా పేరుకున్న పుస్తకాలు చదువుకుంటూ, టివి చూస్తూ, కాలం గడుపుతారు.

కొరీన్ రోజూ పిల్లలకి బహుమతులు తెస్తూ '*ఇంకొన్ని రోజులే. అయిపోవస్తోంది*'. అన్న భరోసా ఇస్తూ ఉంటుంది. ఆ రోజులు కాస్తా వారాలుగా, నెల్లగా, సంవత్సరాలుగా మారుతాయి. కొరీన్ పిల్లల్ని చూడడానికి రావడం తగ్గిపోతుంది.
పిల్లల తండ్రి క్రిస్టఫర్ కొరీన్‌కి పినతండ్రి వరస అయినవాడనీ అది incest అనీ, అమ్మమ్మ పిల్లలకి చెప్తుంది. కొరీన్‌ని కొరడాదెబ్బలు కొడుతుంది. ఆ తరువాత పిల్లలకి చెప్తుంది:
*"కొరీన్ ,నీ చొక్కా విప్పి, ఈ ఇంట్లో శిక్ష ఎలా పడుతుందో వీళ్ళకి చూపించు. సరిగ్గా చూడండి పిల్లలూ. 17 కొరడాదెబ్బలు. మీ తండ్రితో పాపం చేస్తూ గడిపిన ప్రతీ సంవత్సరానికీ ఒక దెబ్బ. కాబట్టి నా మాట ఇప్పుడే గుర్తు పెట్టుకోండి. మీకు తిండీ, పైచూరూ ఇస్తాను తప్ప మీమీద కనికరం కానీ ప్రేమ కానీ చూపను. అసంపూర్ణంగా ఉన్న దేన్నైనా అంగీకరించడం నాకు అసంభవం. "*
ఒకరోజు కేథీ తల్లిని ఎదిరించి, ప్రశ్నించినప్పుడు కొరీన్ కోపం తెచ్చుకుంటుంది: *"ఆపింక. నాతో ఈ విధంగా మాట్లాడే హక్కు లేదు నీకు. నా పిల్లలు బాధపడుతూ ఉంటే నేనేదో వినోదంగా గడుపున్నాననుకుంటున్నావా? క్రూరమైన పిల్లవి నువ్వు. నన్ను ప్రేమగా చూడ్డానికి మీరు సిద్ధపడ్డాక తిరిగొస్తాను."*
కొన్ని నెల్ల తరువాత, క్రిస్, కేథీ తమ ఉనికి తెలియపరచకుండా ఇంట్లో జరుగుతున్న క్రిస్మస్ పార్టీ రహస్యంగా చూడవచ్చని కొరీన్ చెప్పి, కిందకి రావడానికి అనుమతిస్తుంది. మాల్కొమ్ విల్లు తయారు చేస్తున్న లాయరైన బార్ట్ వినాతో తల్లి అన్యోన్యంగా మసులుకోవడం చూస్తారిద్దరూ.

ఆ పార్టీ జరుగుతుండగా క్రిస్ ఇల్లంతా తిరిగాడని కొరీన్‌కి తెలిసి, క్రిస్ని చెంపదెబ్బ కొట్టి– మళ్ళీ అలా జరిగితే కొరడాతో కొడ్తానని బెదిరిస్తుంది. తల్లి కూడా అమ్మమ్మలాగే అవుతోందని కేథీ గుర్తిస్తుంది.

కాలం గడుస్తుంటుంది. పోషణా, తాజా గాలీ, సూర్యరశ్మీ లేక కవలల శారీరిక ఎదుగుబాటు ఆగిపోతుంది. *పిల్లలు మొక్కలవంటివారు. ఎదగాలంటే వారికి సూర్యరశ్మి అవసరం:* కేథీ అనుకుని తల్లికి చెప్తుంది: "*తాజా గాలి కాప్సూల్స్‌లో వస్తుందనుకుంటున్నావా? మేమందరం రోజూ ఒక కాప్స్యూల్ వేసుకుంటే మేము సామాన్యమైన జీవితం గడిపినప్పటి రోజుల్లో బయట తిరుగుతున్నప్పటి ఆరోగ్యం, మాకు తిరిగి కలుగుతుందా!* "

క్రిస్ కూడా తల్లితో అంటాడు*: "అమ్మా, నువ్వంటే నాకు ప్రేమ. నీవేం చేసినా నిన్ను ప్రేమిస్తాను. మేమందరం నిన్ను ప్రేమిస్తాం. ప్రేమించాలి కూడా. నీవేది చేసినా మా బాగోగుల కోసమేనని మేము నమ్మాలి. కానీ అమ్మా, మమ్మల్ని చూడు. సరిగ్గా, నిజంగా చూడు. ఏ స్థితిలో ఉన్నామో గమనించు."*

తల్లి పట్టించుకోదు.

కొరీన్ రావడం తగ్గిపోవడంతో ఆమెని గుర్తించక– క్రిస్ కేథీలే తమ తల్లితండ్రులని కవలలు భావిస్తారు. పెద్దపిల్లలిద్దరూ యౌవనదశలోకి అడుగుపెడతారు. శారీరిక మార్పులు చోటు చేసుకుంటుంటాయి. మిద్దెమీద ఉన్న పుస్తకాలన్నిటినీ అప్పటికే చదివేసి ఉంటారు. అది తెలిసి, యుక్తవయస్సు వచ్చిన పిల్లలకి సరిపడే పుస్తకాలో, కావో అని కూడా చూడకుండా కొరీన్ చేతికి దొరికిన పుస్తకాలన్నిటినీ పిల్లలకి అందించడం ప్రారంభిస్తుంది. వాటిల్లో ప్రసూతి, నగ్నంగా ఉంటూ రాజ్యాలేలుతున్న రాజులూ, రాణీల గురించీ, ఇటువంటి మరొ కొన్ని పుస్తకాలూ చదివి, హావచపలమైన మాటలతో ఒకరితో మరొకరు ఎకసక్కాలాడుకోవడం ప్రారంభిస్తారు కేథీ, క్రిస్.

ఒకసారి కేథీ అద్దంలో తన్ని తాను చూసుకుంటూ మురిసిపోతుండగా, క్రిస్ కూడా ఆమెన ప్రశంసగా చూడ్డం గమనిస్తుంది ఒలీవియా. ప్రాయశ్చిత్తంగా కేథీ జుత్తు కత్తిరించమని క్రిస్‌ని ఆజ్ఞాపిస్తుంది. అతను పాటించకపోవడంతో కేథీ జుత్తుమీద తారు పోస్తుంది. గత్యంతరం లేక క్రిస్ సహాయంతో కేథీ జుత్తు కాస్తా పొట్టిగా కత్తిరించుకోవలిసి వస్తుంది. ఆ ధిక్కారానికి శిక్షగా రెండు వారాలు పిల్లలకి భోజనం పంపించదు. ఆ సంఘటన తరువాత, భోజనంతో పాటు పంచదార జల్లిన డోనట్స్ రావడం మొదలవుతుంది.

తల్లి తనకోసం తెచ్చిన అందమైన బట్టలతో కేథీ మిద్దెమీద తన బాలే డాన్స్ ప్రాక్టీస్ చేస్తూ ఉంటుంది. కాకపోతే, కూతురు ఎదిగిందన్న సంగతి గుర్తించని కొరీన్ తెచ్చిన ఆ బట్టలు, కేథీకి ఇరుకవుతాయి.

ఎలుకల బోనులో ఒక ఎలుక చిక్కుకుంటుంది. కోరీ ఎలుకని తను పెంచుకుంటానని దానికి మికీ అన్న పేరు పెడతాడు.

వొక వర్షపు మధ్యాహ్నం క్రిస్ కిటికీలోంచి బయటకి చూస్తూ విచారంగా కూర్చునుంటాడు (కిటికీలు తెరిచే అనుమతి ఉండదు పిల్లలకి.) అమ్మమ్మ హటాత్తుగా తాళం తెరిచి లోపలికి వచ్చి, 'కిటికీకి దూరం జరుగు' అని చెప్పినప్పుడు, ఆమెని పాటించక ఎదురు తిరుగుతాడు క్రిస్. ఆవిడకి కోపం వచ్చి పిల్లల్ని కొరడాతో బాదుతుంది.

రెండు నెల్ల తరువాత కొరీన్ పిల్లల వద్దకి వస్తుంది. తల్లిని కౌగలించుకునే బదులు క్రిస్, కేథీ ఆమెకి లెక్చర్ ఇస్తారు. కోపంతో వెళ్ళిపోయి, మళ్ళీ పది రోజుల తరువాత వచ్చి, తను బార్ట్‌ని పెళ్ళి చేసుకున్నాననీ, అతను పిల్లల్ని ప్రేమిస్తాడని తనకి గట్టి నమ్మకం అనీ చెప్తుంది.

కోరీ జబ్బు పడతాడు. అమ్మమ్మా, తల్లీ హాస్పిటల్కి తీసుకెళ్తారు కానీ కోరీ అక్కడే న్యుమోనియాతో చనిపోయాడని తల్లి చెప్తుంది.

కేథీ చెప్తుంది:"*క్రిస్, కోరీ, క్యారీ, నేనూ మిద్దెన అటకమీద జీవించాం. ఇప్పుడు ముగ్గురమే మిగిలాం.* "

కోరీ మరణం సహజమైనది కాదన్న అనుమానం వచ్చి, ఎలుకకి ఒక డోనట్ తినిపించగానే అది చనిపోతుంది. పిల్లల ఉనికి బయటపడితే తనకే ఆస్థి సంక్రమించదనుకున్న తల్లి ఒలీవియాతో కలిపి, తమకిచ్చే డోనట్స్ మీద చల్లిన పంచదారలో ఆర్సినిక్ కలిపి slow poison చేస్తోందని గ్రహిస్తారు పెద్ద పిల్లలిద్దరూ. ఆ విషప్రయోగం తొమ్మిది నెల్లగా–తల్లి రెండవ పెళ్ళి తరువాత నుండీ– జరుగుతోందని అర్థం చేసుకుంటారు.

కేథీ, క్రిస్‌తో చెప్తుంది: "*అమ్మ అబద్ధాలకోరూ మోసగత్తే. మన బాల్యాలని నాశనం చేసిన వ్యక్తి. తన చేతికందే ఆస్థిని ఇంక తనకి అనవసరం అయిన మనతో పంచుకోవడం ఇష్టం లేక, ఆ ప్రక్రియలో కోరీ మరణానికి బాధ్యురాలయింది.* "

క్రిస్, కేథీ ఆ ఇంటినుండి పారిపోయే దారులు వెతకడం మొదలెడతారు. క్రిస్ తముండే గది తాళానికి మారు తాళం తయారు చేసి, తల్లి గదిలోనుంచి కొద్ది కొద్దిగా డబ్బూ, నగలూ దొంగిలించడం మొదలెడతాడు. మొదట్లో కొరీన్ గమనించదు.

క్రిస్‌కీ, కేథీకి మధ్య ఆకర్షణ ఎక్కువవుతూ ఉంటుంది.

ఒక రాత్రి కేథీ కిందకెళ్ళినప్పుడు, నిద్రపోతున్న బార్ట్‌ని ముద్దు పెట్టుకుంటుంది. ఇది తెలిసిన క్రిస్‌కి కోపం వచ్చి, కేథీని రేప్ చేస్తాడు. మరొక రాత్రి తల్లి గదిలోకి దొంగతనం చేయడానికి వెళ్ళిన క్రిస్‌కి గది ఖాళీగా కనబడుతుంది. సవితి  తండ్రితోపాటు తల్లి కూడా వెళ్ళిపోయిందని అర్థం అవుతుంది. అమ్మమ్మ గదినుంచి దొంగతనం చేద్దామనుకుంటే ఒలీవియా ఇంకా మేలుకుని ఉంటుంది. వేరే గదిలో పడుకునే తాత గదిలోంచి డబ్బు తెద్దాం అనుకున్న క్రిస్‌కి ముసలాయన గది ఖాళీగా కనబడుతుంది. సంవత్సరం కిందటే తాత చనిపోయినా కానీ అది తల్లి తమనుంచి దాచిందని పిల్లలకి తరువాత తెలుస్తుంది.

కేథీ చెప్తుంది:" *క్రిస్ నేనూ అన్ని పుస్తకాలు చదివి మా అంతట మేమే చదువు నేర్చుకున్నాం. టివి మాకు హింసా, అత్యాశా గురించి ఎంతో నేర్పింది. అయితే, జీవితంలో యదార్థాన్ని ఎదురుకోగలిగే ఏ ఉపయోగకరమైన లేక ఆచరణీయ అంశాన్నీ నేర్పలేకపోయింది.*"

మూడేళ్ళ అయిదు నెల్ల తరువాత, పిల్లలు ఆ ఇంటినుంచి తప్పించుకుంటారు. క్యారీని పాటు తీసుకుని ఫ్లోరిడా పారిపోతారు కానీ పోలీసులకి ఫిర్యాదు చేయరు. కొత్త జీవితం ప్రారంభించి క్రిస్, కేథీ ఒకరి పట్ల ఇంకొకరికి ఉన్న ప్రేమ వ్యక్తం చేసుకుంటారు.

కేథీ అంటుంది: "*ఫాక్స్‌వర్త్ హాల్ నుండి తప్పించుకున్నాక ఏదో విధంగా జీవితం గడపడం నేర్చుకున్నాం. మా జీవితాలెలాగో అల్లకల్లోలానికి గురయినవే. కానీ, క్యారీ సంగతి వేరు. కోరీ లేకుండా జీవించడం తనకి నేర్పవలిసి వచ్చింది.* "

★★★

ఏండ్రూస్ రాసిన ఈ నవల కాపీలు 4 కోట్లు అమ్ముడుపోయాయి. 22 భాషల్లోకి అనువదించబడిన ఈ నవల నాలుగు ఉత్తరకథలని పుట్టించింది. అన్నీ కూడా 'న్యూయార్క్ టైమ్స్ బెస్ట్ సెల్లర్ లిస్టు' లో 15 వారాలకన్నా ఎక్కువ కాలం ఉన్నవే.

నిర్లక్ష్యం, తిట్లూ, దెబ్బలూ, ఆకలితో మాడటం– ఆఖరికి విషప్రయోగం కూడా చవి చూసిన పిల్లల అతి వ్యాకులకరమైన కథ ఇది. పుస్తకంలో ఉన్న పెద్దపిల్లల లైంగిక అతిక్రమణ, కలిసి స్నానం చేయడాలు, ముద్దులు పెట్టుకోవడం – అప్పటి యువతని ఆకర్షించాయి.

ఈ నవల ఆధారంగా వచ్చిన సినిమాగా కూడా ఉంది.  ఇక్కడ చూడొచ్చు. సినిమాలో incest చూపించలేదు.

*నువ్వు నన్ను రేప్  చేయలేదు. కావాలనుకుంటే కనుక నేను నిన్ను ఆపి ఉండేదాన్ని. నువ్వు నాకు ఎప్పుడో నేర్పినట్టు, నేను చేయవలిసినదల్లా నా మోకాలెత్తి నువ్వు చెప్పిన చోట కొట్టడమే.* అని కేథీ క్రిస్‌తో చెప్పినప్పుడు, 'అన్నాచెల్లెళ్ళ సంబంధం అంటే ఇదా!' అన్న విరక్తి పుడుతుంది కానీ ఆలోచిస్తే, పిల్లలు తక్కిన ప్రపంచంతో సంబంధం లేకుండా, ఒకే గదిలో మూడు సంవత్సరాలపైగా, ఆ ఘోరమైన పరిస్థితుల్లో ఖైదులో ఉండి

గడపడం, తమ బాల్యాలని కోల్పోయి– బలవంతంగా ఎదగడం అన్న సంగతులు ఈ అసహజ సంబంధాన్ని క్షమించేలా చేస్తాయి. నవల్లో ఉన్న సంఘటనలు నిజజీవితాలకి దూరంగా అనిపించినప్పటికీ, వర్ణనలు వివరంగా, వాస్తవికంగా ఉండటం వల్ల ఆ పరిస్థితులని పాఠకులు అర్థం చేసుకోగలరు. కథ నొప్పి పుట్టిస్తుంది. కదిలిస్తుంది.

# Rudali/రుడాలి

## మహాశ్వేతా దేవీ



మహాశ్వేతా దేవీ (1926 –2016) బెంగాలీ రచయిత్రి. తండ్రి మనీష్ ఘటక్, పేరు పొందిన కవీ, రచయితా. తల్లి ధరితీ దేవీ కూడా రచయిత్రీ, సామాజిక సేవకురాలూ. పినతండ్రి అయిన రిత్విక్ ఘటక్ మనందరికీ తెలిసిన సినీ నిర్మాత. దేవీ మొదట ఢాకాలో, ఆ తరువాత శాంతినికేతన్ లో చదువుకున్నారు. కలకత్తా యూనివర్సిటీలో ఇంగ్లీష్లో ఎమ్. యే చేశారు. 100 కన్నా ఎక్కువ నవల్లూ, 20 కథా సంకలనాలూ రాశారు. ప్రాధమికంగా, అన్నీ బెంగాలీలో రాసినవే. వాటిల్లో చాలా మట్టుకు అనేకమైన ఇతర భాషల్లోకి




అనువదించబడ్డాయి. ఆమె మొదటి నవల 'ఝూన్సీర్ రాణీ'– రాణీ ఝూన్సీ బాయి మీద రాసినది. అచ్చయినది 1956లో. ఆమె రాసిన 'హజార్ చౌరాశిర్ మా, రుడాలి, అరణ్యేర్ అధికార్' సినిమాలుగా వచ్చాయి.

1964లో దేవీ కలకత్తాలో బోధించడం ప్రారంభించారు. అదే సమయంలో జర్నలిస్టుగా, సృజనాత్మక రచయిత్రిగా పని చేస్తూ, వెస్ట్ బెంగాల్‌కి చెందిన దళిత ఆదివాసీ సమాజాలైన 'లోధాలనూ, షబార్' లనూ అధ్యయనం చేశారు.

గిరిజనుల అణిచివేతా, అంటరాని వారిమీద ఉన్నత కులాల దాష్టీకమూ గురించి గొంతు విప్పారు. బెంగాలీ సాహిత్యంలో సాహిత్య ఎకాడమీ, జ్ఞాన్ పీఠ్, రామన్ మగ్సేసే అవార్డులు పొందారు. ఆమె పద్మశ్రీ, పద్మ భూషణ్ గ్రహీత కూడా.

వలసవాదోత్తర స్కాలర్ అయిన గాయత్రీ చక్రవొర్తి స్పైవాక్– దేవీ కథలని ఇంగ్లీష్లోకి అనువదించి మూడు సంకలనాలుగా, పబ్లిష్

చేశారు: 'ఇమాజినరీ ట్రాప్స్, ఓల్డ్ వుమన్, ద బ్రెస్ట్ స్టోరీస్.'
దేవీ మాటల్లో: *నిజమైన చరిత్రని సృష్టించేది సామాన్యమైన మనుష్యులే అని నేను నమ్ముతాను... నా రాతలకి కారణమూ, ప్రేరణా అయినది దోచుకోబడి కూడా ఓటమిని అంగీకరించని వీరే.*

★★★

ప్రధాన పాత్ర అయిన శనీచరి, రాజస్తాన్లో థహద్ అన్న కుగ్రామంలో, అంటరాని కులానికి చెందిన స్త్రీ. తన పరివారపు మగవాళ్ళందరినీ మింగేసిన 'మంత్రగత్తె' అన్న పేరు తెచ్చుకున్నది.
భారతదేశంలో ఉన్న గ్రామాలాన్నిటిలాగే, థహద్లో కూడా కుల వ్యవస్థా, పెత్తందారీ పద్ధతీ రాజ్యం చేస్తుంటాయి. కథ ప్రారంభంలోనే– అమె సామాజిక, ఆర్థిక పర్యావరణం పాఠకులకు పరిచయం చేయబడతాయి: *థహద్ గ్రామంలో గంజూలు, దుషాద్లు అధికశాతం. శనీచరి గంజూ కులానికి చెందినది. ఆమె కూడా ఆ కులాలవారివలె కటిక పేదరికంతోనే జీవితం గడుపుతుంది'*
శనీచరి పుట్టగానే తండ్రి మరణిస్తాడు. తల్లి– అత్తమామల వద్ద కూతుర్ని వదిలి, పారిపోతుంది. గంజూతో శనీచరికి చిన్నప్పుడే పెళ్ళవుతుంది. ఆమె **శనివారం నాడు పుట్టినందువల్ల, అశుభమైనదని అత్త దెప్పి పొడుస్తూ ఉంటుంది. అయితే, ఈ కర్మవాదాన్ని నమ్మని శనీచరి తిప్పి కొడుతుంది: *అవునా! నువ్వైతే సోమవారం నాడు పుట్టావుగా! నీ జీవితం ఎంత సుఖంగా ఉంది?***
శనీచరి చెప్తుంది: *ఈ గ్రామంలో ఎవరూ సంతోషకరమైన జీవితాలు గడపడం లేదు. బాధ అనుభవించడం వారికి కొత్త కాదు కనుక పుల్ల పెరుగూ, చక్కెరా, ముతకబియ్యంతో సంతృప్తి పడతారు.*
ఒక పండుగ రోజున కల్తీ పాలు తాగి, గంజూ చనిపోయినప్పుడు, భర్త క్రియాకాండలకి డబ్బు సమకూర్చవలిసి వచ్చి, ఏడవడానికి కూడా సమయం దొరకదు శనీచరికి. తన్ని తాను భూస్వామి అయిన రామవ్తార్కు తాకట్టు పెట్టుకుని, 20 రూపాయల అప్పుకి మారుగా ఐదేళ్ళ లోపు యాభై రూపాయలు తీరుస్తానన్న బాండ్ రాస్తుంది. ఒక సంవత్సరం తరువాత రామవ్తార్ సంతోషంగా ఉన్న సమయంలో ఆమెని ఆ దాస్యం నుండి తప్పిస్తాడు.
వీధి నాటకాల్లో పని చేసే కొడుకు బుధువా, వేశ్య అయిన ముంగ్రీని పెళ్ళి చేసుకుని ఇంటికి తెస్తాడు. అతను కూడా టీబీతో మరణిస్తాడు. చికిత్స చేయించుకోలేని ఈ వర్గానికి జబ్బు పడ్డం అంటేనే మరణంతో సమానం. **కటిక పేదరికాన్ని అనుభవించలేక, కోడలు ముంగ్రీ తిరిగి వేశ్యావృత్తిలోకి దిగుతుంది.** ఇంత దురదృష్టాన్నీ అనుభవించిన శనీచరికి కంటనీరు పెట్టడం చేతకాక, 'తన కన్నీళ్ళు ఇంకిపోయాయి.' అనుకుంటుంది. అత్త చనిపోయినప్పుడు, దహన సంస్కారాలు చేసే మగవాళ్ళెవరూ ఇంట్లో ఉండరు.
ఆరోగ్యం క్షీణిస్తూ ఉన్న ఠాకుర్ రామావతార్ మరణించడానికి సిద్ధంగా ఉన్నాడని తెలిసి, భగల్పూర్ నుంచి శనీచరి చిన్ననాటి స్నేహితురాలైన భిక్నీ, థహద్ గ్రామానికి వస్తుంది. ఉండేందుకు చోటు వెతుకుతున్న భిక్నీని శనీచరి, '*రెండు గదులున్న నా గుడిసె ఖాళీగానే ఉంది. ఏ మూలనైనా పడుకో.*' అంటూ ఆహ్వానిస్తుంది.
శనీచరి భిక్నీని కలుసుకున్నప్పుడు, రచయిత్రి వర్ణిస్తారు: *శనీచరిలాగానే బిఖ్నీకి కూడా నీలం రంగు పచ్చబొట్లు తప్ప– చేతులకీ,*

*మెడకీ, నుదుటికీ ఆభరణాలేమీ ఉండవు. ఇద్దరి చెవి రంధ్రాలకీ దుద్దుల చోట, సన్నపాటి బిరడాలుంటాయి. వారు జుత్తు దువ్వుకుని ఎన్నాళ్ళయి ఉంటుందో!*

భిక్నీ వృత్తిరీత్యా ఒక 'రుడాలి.' ధనికులు చనిపోయినప్పుడు, వారి బంధువులు తమ సామాజిక హోదా చూపించుకోడానికి, 'ఏడ్చి శోకాలు పెట్టే' రుడాలీలను నియమిస్తారు. కటిక దారిద్ర్యం, కుల వ్యవస్థా, భారతదేశంలో పాటించే అంత్యక్రియల ఆచరణలూ, పితృసామ్య సమాజంలో స్త్రీల పాత్రా గురించి రచయిత్రి విశదంగా వివరిస్తారు. కొడుకులు పట్టించుకోక, మలమూత్రాల మధ్య చనిపోయే ధనికుల మరణాన్ని, అతి ఘనంగా సంస్కరించడం గురించి వర్ణిస్తారు. అత్యాశ ఉన్న కొడుకులు ఆస్థికోసం తండ్రులని హత్య చేయడానికి కూడా తటపటాయించరు. మరి కొందరు, తమ తల్లుల మరణం కోసం ఓపికగా ఎదురు చూస్తుంటారు. నథునీ సింగ్ అన్న భూస్వామి– తల్లి జబ్బు పడ్డప్పుడు చికిత్స చేయించకుండా, దాంబికమైన దహన సంస్కారాలకోసం మాత్రం గంధపు చెక్కలని పోగు చేసి, బందువులకి పెట్టడానికి బట్టలూ, బ్రాహ్మణులకి భోజనం పెట్టడానికి గంగాళాల్లో నెయ్యీ, చక్కెరా, పప్పూ, గోధుమ పిండీ కొంటాడు. మరణ సంతాప ఆచరణ– ఉన్నత వర్గాల్లో ఒక మతపరమైన బాధ్యత.

సామాన్యంగా భూస్వాములు రుడాలీలకు బాగానే ముట్టచెప్తారు.

అదే నిమ్నజాతికి చెందిన దులన్ అన్న వ్యక్తి దృష్టినుంచి పల్లెలో జరిగేదేదీ తప్పించుకోదు. అతను శనీచరికి తన కడుపేదరికాన్ని తప్పించుకునే సలహా ఇస్తాడు: *బధువాకి అమ్మా, మనకి సంపాదించడానికి అట్టే పెట్టున్న దారులేవీ లేవు. అవకాశాలని మనమే కలిపించుకోవాలి. రుడాలిగా పని చేయి. బతికే మార్గం చూపించాను. అందుకోవడం నీ చేతుల్లో ఉంది.'*

గ్రామంలో ధనికుడైన భైరబ్ సింగ్ చనిపోయినప్పుడు, శనీచరికి దులన్ కబురందిస్తాడు: *శవంమీద పడి ఏడవడానికి వారికి దొరికినది ఇద్దరు వేశ్యలు మాత్రమే. వారికి రుడాలీల అవసరం ఉంది.'* శనీచరి భిక్నీతో కలిపి, భైరబ్ సింగ్ అంత్యక్రియలకి వెళ్తుంది.

రచయిత్రి, రుడాలీగా శనీచరి చేసిన మొదటి ప్రదర్శని వర్ణిస్తారు: *ఆమె రోదన, కొనఊపిరితో ఉన్న వివర్ణమైన ఎడారుల్లో ఆర్తనాదంలా వినిపించింది. దశాబ్దాల నిస్సబ్దాన్ని ఛేదిస్తూ, ఆమె ఏడ్చింది. ఎంతోకాలంగా దాచిపెట్టున్న ఆమె శోకం, ఆఖరికి వెలువడింది.*

శనీచరీ భిక్నీ కలిపి భైరబ్‌సింగ్‌ను మంచి పాటలతో పొగుడుతూ బిగ్గరగా ఏడవడం వల్ల, 'రండీ' వీధినుంచి వచ్చిన వేశ్యలు కూడా ఆ ప్రదర్శనలో వెనకబడినప్పుడు– శనీచరి, భిక్నీ ఆ వృత్తిలో నిపుణులనిపించుకుంటారు. ధనికుల మరణాల పట్ల శోకం వ్యక్తపరిచే పనికి గిరాకీ ఎక్కువవుతుందిద్దరికీ. ఈ వృత్తి శనీచరికి కొత్త దారులు తెరుస్తుంది. జీవితం మెరుగయే ఆశ కానవచ్చినప్పుడు అనుకుంటుంది*: బహుసా నా కన్నీళ్ళు కేవలం నా కడుపు నింపడానికి పనికి వచ్చేటందుకేనేమో– ఇన్నేళ్ళూ బయట పడలేకపోయాయి.*

కొంతకాలం తరువాత, శనీచరి రండీ వీధినుంచి వేశ్యలని (కోడలు ముంగ్రీతో సహా) కూడగట్టుకుని, పెద్ద గుంపు తయారు చేసుకుని, వారికి వృత్తి మెలకువలు నేర్పుతుంది: *మీకు దగ్గిర చుట్టాలెవరో పోయినట్టే ఏడవడం ప్రారంభించాలి. రక్తం చల్లబడి, కొయ్యకట్టినంత అనుభూతిని కొని తెచ్చుకుని, గుండెలు గట్టిగా బాదుకుంటూ, అవిసిపోయేలా ఏడవండి.'*

సాధికారత బాట మీద అడుగుపెట్టిన శనీచరీ, భిక్నీ– తమని దోచుకునే అదే సామాజిక వ్యవస్థనుండి స్ఫూర్తి పొంది, ఆర్థికంగా బాగుపడ్డం ప్రారంభించి, ప్రతికూలమైన సామాజిక వ్యవస్థని తమకి అనుగుణంగా ఎలా మలచుకున్నారో తెలుస్తుంది.

శనీచరి బేరం చేయడం నేర్చుకుంటుంది: *హుజూర్– మేము ఏడ్చి, శోకాలు పెట్టే విధానం– రామనామ జపాన్ని కూడా చెవికి చేరనీయదు. బియ్యానికి కేవలం అయిదు రూపాయలే ఇవ్వండి. అంత్యక్రియనాడు మేము డబ్బూ, బట్టలూ తీసుకుంటాం. అంతకన్నా ఎక్కువా వద్దు, తక్కువా వద్దు. మీకు మరిందరు రుడాలీలు కావాలంటే కనుక మేమే వారిని తీసుకు వస్తాం.*

భూస్వాములకి తమ ఆడంబరాన్ని ప్రదర్శించడానికి రుడాలీల అవసరం ఉన్నంతవరకూ తమకి పనికి కొదవ ఉండదని తెలిసిన శనీచరి, తమ ధరలని తామే నిర్ణయించే స్థితికి ఎదుగుతుంది: *ఏడుస్తూ, నేలమీద పొర్లడానికి అయిదు రూపాయలతో పాటు ఒక కాసు. శోకాలు పెడుతూ నేలమీద పొర్లుతూ, తల బాదుకోడానికి అయిదు రూపాయలతోపాటు రెండు కాసులు.*

ఉన్నతవర్గం గడిపే వ్యక్తిగత జీవితాలని పుస్తకం అసహ్యకరమైన రీతిలో కనపరుస్తుంది. శనీచరి వీరి గురించి స్వగతం చెప్పుకుంటుంది: *స్వంత అన్నదమ్ముల, తల్లితండ్రుల మరణం పట్ల ఒక్క కన్నీటి బొట్టూ కార్చలేని వీరికి, ఈ క్రియాకాండల ఖర్చు మట్టుకు లెక్కలేదేం?...అంత ధనవంతుడైన గంగాధర్ సింగ్ తన పెద్దనాన్న చితిమీద శుద్ధ నేతికి బదులు, డాల్డా ఉపయోగించిన పిసినారి అని తెలుసా!*

ఒకసారి, ఈ వృత్తిని వదిలిపెట్టేస్తానని ఆమె అన్నప్పుడు దులన్ చెప్తాడు: *తిండి పెట్టే మన పొలాన్ని వదులుకోవడం తప్పు. నీ వృత్తి కూడా పొలంవంటిదే. వదులుకోకూడదు.*

ఆస్థమా వల్ల బిఖ్నీ చనిపోయినప్పుడు, శనీచరి ఒంటరి**దయినా,** కోలుకుని ధైర్యం తెచ్చుకుని, బతకాలనే నిశ్చయాన్ని గట్టిపరచుకుంటుంది: *వచ్చిన కష్టం ఎలానూ వచ్చింది. అలా అని– స్నానం చేయడం, తిండి తినడం,* *పెరట్లో మిరపకాయలని నమిలే మేకలని తరిమి కొట్టడం కూడా ఆపేయడం లేదే! మనుష్యులు ఏదైనా చేయగలరు కానీ తిండి దొరకనప్పుడు మాత్రం చనిపోతారు.*

కథాంతంలో గంభీర్ సింగ్ మృతదేహాన్ని బిగ్గరగా ఏడుస్తున్న వేశ్యలు చుట్టుముడతారు. తాను బతికున్నప్పుడు వాళ్ళని దోచుకుని, వేశ్యా గృహాల్లోకి నెట్టడానికి బాధ్యుడైనవా**డు** అతనే. విధివిపాకం అంటే అదే.

★★★

90 పేజీల నవలిక అయిన రుడాలీ బెంగాలీలో పబ్లిష్ అయినది 1993లో. అంజుమ్ కట్యాల్, దీన్ని ఇంగ్లీష్లోకి అనువదించారు. ఉషా గంగూలీ పుస్తకాన్ని నాటకంగా రూపొందించారు. నవలిక ఆధారంగా, కల్పనా లాజ్మీ– ఇదే పేరుతో 1997లో హిందీ సినిమా తీశారు. దాన్ని ఇక్కడ చూడగల వీలుంది.

# Heat and Dust /వేడి, దుమ్మూధూళి



రూత్ ప్రావెర్ ఝబ్‌వాలా (మే 7, 1927 –April 3, 2013) జర్మనీలో– పోలిష్ యూదుల కుటుంబంలో పుట్టి, ఇంగ్లండ్లో చదువుకున్నారు. 1948లో బ్రిటిష్ పౌరురాలయ్యారు. 1951లో భారతదేశానికి వచ్చి, భారతీయ పార్సీ ఆర్కిటెక్ట్ అయిన సైరస్ ఎస్ ఎచ్ ఝబ్వాలాని పెళ్ళి చేసుకుని, కొత్త ఢిల్లీలో 24 సంవత్సరాలున్నారు. ఎనిమిది నవళ్ళు, 23 స్క్రీన్ ప్లేలు, మూడు కథా సంకలనాలూ రాశారు. ఆమె రచనల్లో అధికభాగం సమకాలీన భారతదేశం గురించినవే.

ఝబ్‌వాలా ప్రప్రధమ నవల, 'టు హూమ్ షి విల్' 1955లో అచ్చయింది. 1960లో ఆమె రాసిన 'హౌస్ హోల్డర్' ఆధారంగా జేమ్స్ ఐవరీ, ఇస్మాయిల్ మర్చంట్ కలిసి, 1963లో సినిమా తీశారు. ఆమె ఎనిమిదవ నవలైన 'హీట్ అండ్ డస్ట్'కి 1975లో బుకర్ ప్రైజ్ పొందారు. దీని ఆధారంగా మళ్ళీ మర్చంట్ ఐవరీ ప్రొడక్షన్స్, జేమ్స్ ఐవరీ దర్శకత్వం కింద తీసిన సినిమా, 1983లో జనవరి 1న విడుదల అయింది. స్క్రీన్ ప్లే రాసినది రచయిత్రే. ఆ సంవత్సరమే ఆమె న్యూయార్క్ వెళ్ళిపోయి 'ప్లేస్ ఆఫ్ పీస్' రాసి, మరణించేవరకూ అక్కడే నివసించారు. దీన్ని కూడా సినిమాగా తీసినప్పుడు, ఝబ్‌వాలాయే స్క్రీన్ ప్లే రాశారు.

బుకర్ ప్రైజూ, ఆస్కారూ పొందిన మొదటి మహిళ ఈమె. ఝబ్‌వాలా తన మొదటి 'అకాడెమీ అవార్డ్ 'ఎ రూమ్ విథ్ ఎ వ్యూ' స్క్రీన్ ప్లే (1986) కి పొందారు. రెండవది ఆరేళ్ళ తరువాత 'హొవర్డ్స్ ఎండ్'(1986) కి. ఝబ్‌వాలా రాసినవాటిల్లో ఆఖరి కథ 'ద జడ్జెస్ విల్' 'ద న్యూయోర్కర్' లో, మార్చి 25న, 2013లో పబ్లిష్ అయింది. ఆమె స్క్రిప్టులు కొన్ని వివాదం సృష్టించాయి.

★★★




నవలికలో, రెండు సమానాంతరమైన కథలు కొనసాగుతాయి. ఒకటి వర్తమానానికి చెందినది. రెండవది గతంలో జరిగినది. ఒక పేరుండని 'నేను' అని పుస్తకమంతా ఉన్న అందమైన బ్రిటిష్ యువతి, తన తాతగారి మొదటి భార్య ఒలివియా జీవితం గురించి తెలుసుకోడానికి, 1970లో ఇంగ్లండ్ నుండి భారతదేశం వస్తుంది. కథకురాలు ఆమే. ఒలివియా తన అక్క మార్షియాకి రాసిన ఉత్తరాలు ఆమె వద్ద ఉంటాయి.

ఒలివియా– సతీపుర్‌లో అసిస్టెంట్ కలెక్టర్ అయిన డగ్లస్ రివర్స్‌ని 50 ఏళ్ళ కిందట 1923లో బ్రిటన్లో పెళ్ళి చేసుకుని, భర్తతోపాటు ఆ ఊరికి వస్తుంది. జంట సఖ్యతగా ఉండి, ప్రేమతో జీవితం గడుపుతుంటారు. డగ్లస్ ఆఫీసు పనులమీద ఎప్పుడూ బయట తిరుగుతూ ఉంటాడు. ఒలివియాకి చుట్టుపక్కల ఉండే బ్రిటిష్ స్త్రీలతో సమయం గడపటం అంటే చిరాకు. ఒంటరిగా పియానో వాయిస్తూ, ఎంబ్రాయిడరీ చేస్తూ– వేడీ దుమ్మూ ఇంట్లోకి ప్రవేశించకుండా తలుపులూ, కిటికీలూ బిగించుకు కూర్చుంటుంది.

ఒక రాత్రి ఖతమ్ అన్న ఊర్లో ఉండే యువరాజైన 'నవాబ్' ఇంట్లో డిన్నర్ పార్టీకి ఆహ్వానం రావడంతో, అక్కడుండే బ్రిటిషర్లందరితో పాటు భర్తతో కూడా వెళ్తుంది. మతి స్థిమితం లేని నవాబ్ భార్య సాండీ, ఒక స్విట్జర్లాండ్ క్లినిక్లో ఉంటుంది. ఆ పార్టీలో నవాబుకీ ఒలివియాకీ మధ్య ఆకర్షణ తలెత్తుతుంది. ఒలివియా ఆశించినట్టే, కొద్దిరోజుల తరువాత నవాబు తన మందిమార్బలంతో పాటు ఆమె ఇంటికి వచ్చి గడుపుతాడు. ఇద్దరి సంబంధమూ స్నేహంతోనే ప్రారంభం అయినప్పటికీ, ఆ తరువాత ఇద్దరూ ప్రేమికులవుతారు. ఇదంతా, డగ్లస్ లేనప్పుడు జరుగుతుంది.

ఒలివియా గర్భం దాల్చినప్పుడు, పుట్టబోయే బిడ్డకి తండ్రి భర్తో, నవాబో తేల్చుకోలేకపోతుంది. అయితే, వాళ్ళిద్దరూ కూడా తండ్రి తానే అనుకుంటారు. నవాబు తల్లి సహాయంతో ఒలివియా గర్భవిచ్ఛిత్తి చేయించుకుంటుంది. ఈ వార్త సతీపుర్ ఆంగ్లో–ఇండియన్ కమ్యూనిటీలో కార్చిచ్చులా

వ్యాపిస్తుంది. ఒలీవియా భర్త ఆమెకి విడాకులిచ్చి మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడు.

ఆ తరువాత నవాబ్ ఆమె కోసం హిమాలయాల వద్దనున్న చిన్న X అనే ఊర్లో ఇల్లు కొని, అటు తరువాత ఆమె గురించి బయట ఎక్కడా మాట్లాడడు. ఆ కొండలెక్కడానికి/ఎక్కించబడటానికి వీలవనంత లావుగా అయేవరకూ, నవాబ్ ఆమెకోసం అక్కడికి వెళ్తూ ఉండి, ఆర్థిక ఇబ్బందులని ఎదురుకుంటూ, తల్లి చేతుల్లో ప్రాణాలు విడుస్తాడు. అతని మరణం తరువాత ఒలివియా ఆరేళ్ళు భారతదేశంలోనే ఉండి, 1950లో మరణిస్తుంది. హిందూ మతం పుచ్చుకోనప్పటికీ అంత్య క్రియలు హిందూ రీతిలోనే జరగాలన్న ఆమె కోరిక ప్రకారం, అక్కడున్నవారు మృతదేహాన్ని దహనం చేసి, చితాభస్మాన్ని కొండల చుట్టూ చల్లుతారు.

పాతికేళ్ళ తరువాత కథకురాలు భారతదేశంలో ప్రవేశించి– ఒలీవియా, డగ్లస్ ఒకానొకప్పుడు ఉండే ఇంటిని చూడ్డానికి వెళ్తుంది. అది అప్పటికే కొన్ని సర్కారీ ఆఫీసుల కిందకి విభజింపబడుతుంది. వాటిల్లో ఒకదాన్లో ఇందర్‌లాల్ అనే యువకుడు క్లర్కుగా పని చేస్తుంటాడు. అతను తల్లి, భార్యా, తన ముగ్గురి పిల్లలతో పాటు ఉంటాడు. కథకురాలికి తన చిన్న ఇంట్లో ఉండేందుకు చోటిస్తాడు. ఆమె భారతీయ వస్త్రధారణని అలవరచుకుని, హిందీ నేర్చుకోవడం మొదలెడుతుంది. వేసవి ధాటికి తట్టుకోలేక రాత్రివేళలు మిగతావారిలాగే, పెరట్లో మంచం మీద పడుక్కుంటుంది.
ఆమె నవాబ్ రాజమందిరానికి ఇందర్‌లాల్ తో పాటు వెళ్తుంది. ఒలివియా, నవాబ్ మొదట ప్రేమికులయిన బాబా ఫిర్దౌస్ స్మారక స్థలంలోనే ఇందర్ లాల్‌తో శృంగారంలో పాల్గొన్నప్పటికీ, ఆ సంబంధంలో ఆమెవైపు నుంచి ఏ భావానుబంధమూ ఉండదు. ఆ తరువాత, తను గర్భం ధరించిందని గ్రహిస్తుంది కానీ దాని గురించి ఎక్కువ సతమతపడదు.

బిడ్డకి కనడానికి, ఒలివియా ఉంటూ ఉండే X అన్న కొండ ప్రదేశంలో ఉన్న అదే ఇంటికి వెళ్ళి, దాన్ని వర్ణిస్తుంది:

*ఇక్కడ ఒలివియా పరిసర ప్రభావం ఇంకా ఉంది. ఒక పియానో ఉంది. సతీపుర్‌ది కాదేమో కానీ ఖతమ్ నుంచి నవాబు పంపిన గ్రాండ్ పియానో అయి ఉంటుంది... కర్టెన్లూ దిళ్ళూ పసుపు రంగుకి మళ్ళీ, పీలికలై ఉన్నాయి. గ్రామఫోన్ ఉంది... కిటికీ అంచున ఎంబ్రాయిడరీ చేసే ఫ్రేమ్ ఒకటుంది.. ఇది అలంకారానికుందో లేక ఒలివియా అక్కడ కూర్చుని కుట్టుకుంటూ, కొండలని చూస్తూ ఉండేదో తెలియదు నాకు.*
కథకురాలు బజార్లో బట్టల దుకాణం పైన ఉన్న ఒక గదిలో బిడ్డని కంటుంది. తిరిగి మరేనాడూ కొండ దిగదు.

★★★

స్వతంత్రానికి ముందప్పటికీ, పిమ్మటి కాలంలోనూ ప్రజల ఆలోచనాధోరణిలో ఎంత మార్పు వచ్చిందో అని రెండు సమానాంతర కథలూ కనపరుస్తాయి. నవలికలో ఒక అధ్యాయం ఒలివియా గురించైతే, రెండోది కథకురాలి గురించినది. ఇద్దరి జీవితాలకీ మధ్య ఎన్నో పోలికలున్నప్పటికీ, తీసుకున్న నిర్ణయాలు మాత్రం భిన్నమైనవి. మనస్తత్వాలలో తేడాలుంటాయి. ఇద్దరూ ఖతమ్ ప్రాంతంలోనే నివసించినప్పటికీ, కాలాలు వేర్వేరువి కనుక జీవన శైలుల్లో అంతరం ఉంటుంది. పుస్తకంలో అనేకమైన ఇతర చిన్న పాత్రలుంటాయి.

*నవల చివర్న కథకురాలు చెప్తారు: 'ఒలివియా విలక్షణమైన స్త్రీ అని నేను అనుకోను. ఆమెలో ఏ ప్రత్యేక లక్షణాలూ లేవు. ఆమె మొదట ఇక్కడికి వచ్చినప్పుడు ఎలా ఉండేదో, అదే ఆమె అసలు తత్వం అయింటుంది. అందమైన అహంకారి. తన సంతోషమే తనకి ముఖ్యం. తన్ని ముక్కోపి అని కూడా అనవచ్చునేమో... అయినప్పటికీ, అటు పిమ్మటి ఆమె చర్యలనీ, వాటికి జీవితాంతం కట్టుబడి ఉండటమూ చూస్తే, ఇక్కడికి వచ్చినప్పుడు ఆమె ఎలా ఉండేదో అలాగే మిగిలి ఉండడం అయితే సాధ్యం కాదు. కాకపోతే, ఆ తరువాత ఆమె ఎలా మారిందన్న సంగతుల గురించిన ఏ రికార్డూ మా కుటుంబంలో కానీ నాకు తెలిసినంత మట్టుకు ఇంకెక్కడా కానీ లేదు. నాకింకా ఎక్కువ తెలుసుకోవాలని ఉంది కానీ తెలుసుకోడానికి ఉన్న ఒకే దారి ఆమె చేసినట్టే నేనూ చేయడం: ఇక్కడే ఉండిపోవడం.'*

కథకురాలికి మొదట ఇండియా పరాయి దేశం అనిపించినప్పటికీ గ్రామాలూ, అతిథులకిచ్చే గౌరవం నచ్చుతాయి. ఆమె గురించిన కథకన్నా ఒలివియా జీవితం ఎక్కువ ఆసక్తికరంగా అనిపిస్తుంది.

నవలిక యాధాలాపమైన శైలితో, స్పష్టంగా ఉంటుంది. పాఠకులు వినడమే తప్ప ఇంక చూడలేకపోయే గతించిపోయిన కాలానికి రచయిత్రి తీసుకెళ్తారు. 180 పేజీల ఈ నవలిక– వలస యుగంలో ఇండియాని తమ దేశంగానే చేసుకున్న బ్రిటిష్ ఉన్నతవర్గాల జీవితాల గురించి చెప్తుంది. వారి వృథాకాలక్షేపాన్నీ, వారి బడాయినీ రచయిత్రి నిర్మొహమాటంగా వర్ణిస్తారు.

ఆంగ్లేయుల పరిపాలన కాలం గురించి బ్రిటిష్ యువతి దృష్టికోణంతో వచ్చిన మొట్టమొదటి కథ ఇది. పూర్తి పుస్తకంలో మండుతున్న ఎండల వేసవికాలం, దుమ్ముతుపానూ– వాటి వల్ల ఆంగ్లేయులకి కలిగే మానసిక స్తబ్ధతా కనిపిస్తాయి.

సినిమా లింక్ : https://www.youtube.com/watch?v=2lH9-eBAyjs

## Namesake/సమాన నామధేయుడు



నిలంజన్ సుధేష్ణ 'ఝుంపా 'లహిరీ, పశ్చిమ బెంగాల్ నుంచి లండను వలస వెళ్ళిన తపతి, అమర్‌ల దంపతులకు 1967లో పుట్టారు. ఆమెకి రెండేళ్ళుండగా తల్లితండ్రులు అమెరికాకి మారారు. పిల్లలు బెంగాలీ సంస్కృతి మరచిపోకుండా ఆమె తల్లి వారిని తరచూ కలకత్తా తీసుకెళ్ళేవారు.

స్కూల్లో చేర్చినప్పుడు పూర్తి పేరు ఉచ్చరించలేకపోయిన టీచర్, ఆమెని ముద్దుపేరైన 'ఝుంపా' అని పిలవడం మొదలెట్టారు. తన పేరు తనకు సిగ్గు కలుగజేసేదని రచయిత్రి అంటారు. ఆమె బెర్నార్డ్ యూనివర్సిటీలో ఇంగ్లీష్ చదివి, అక్కడే పిఎచ్‌డి చేశారు.

లహిరీ–తన మొదటి కథల సంకలనం అయిన 'ఇంటర్‌ప్రెటర్ ఆఫ్ మెలొడీస్(1999)' కి పులిట్జర్ పొందారు. అయితే, దీనికి ముందు ఆమె రాసిన కథలన్నిటినీ పబ్లిషర్లు నిరాకరించారు. 'ద నేమ్‌సేక్' (2003)పుస్తకం, ఇదే పేరుతో 2006లో సినిమాగా వచ్చింది. కథ– కలకత్తా, బోస్టన్, న్యూయార్క్‌లో జరిగిన సంఘటనలమీద ఆధారపడినది. ఆ తరువాత, రచయిత్రి– నథానియల్ హథోర్న్ రాసిన 'స్కార్లెట్ లెటర్' పరిచయం నుంచి తీసుకున్న పేరుతో రాసిన, 'అన్‌ఎకస్టమ్డ్ ఎర్థ్' నవల 2008లో వచ్చింది. లహిరీ 2013లో రాసిన 'లోలాండ్' మాన్ బుకర్ ప్రైజ్‌కు షార్ట్ లిస్ట్ అయింది. ఆమె పుస్తకాలన్నీ వలసదారుల అనుభవాల వల్ల ప్రేరణ పొందినవే.

2001లో లహిరీ టైమ్ పత్రికకి పని చేసే అల్బెర్టో బుష్‌ని పెళ్ళి చేసుకున్నారు. ఇద్దరు పిల్లలు. ప్రిన్స్టన్ యూనివర్సిటీలో క్రియేటివ్ రైటింగ్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

★★★




కలకత్తాలో పెళ్ళి చేసుకుని 1968లో అమెరికా వలస వచ్చిన ఆషిమా, అశోక్ గంగూలీ దంపతుల్లో– ఆషిమాకి ఇంగ్లీష్ కవిత్వం ఇష్టం అయితే, భర్తకి రష్యన్ రచయితలు. తమ మొదటి బిడ్డ పుట్టుకకోసం మాసుచిసెట్‌స్‌లో ఉన్న కేంబ్రిజ్ హాస్పిటల్లో ఉండి, ఎదురు చూస్తుంటారు. కొడుకు పుడతాడు.

కాగితాలమీద పసికందు పేరు ఉంటే తప్ప హాస్పిటల్ వదలే వీలు లేదని అక్కడి స్టాఫ్ చెప్తారు.

ఏ కుటుంబ పెద్దో పుట్టిన బిడ్డకి పేరెంచే బెంగాలీ సాంప్రదాయం వల్ల, ఆషిమా నాయనమ్మ వాగ్దానం చేసినట్టుగా ఆమె వద్దనుండి ఏదైనా పేరు సూచిస్తూ ఉత్తరం వస్తుందేమోనని గంగూలీ జంట ఎదురు చూసినప్పటికీ, అది రాదు. అశోక్– నవజాత శిశువు ముద్దు పేరు బర్త్ సర్టిఫికెట్ మీద రాయిస్తాడు. అది రష్యన్ రచయిత, నికొలై గోగో పేరుని కుదించిన 'గోగో.' అదే పేరు ఎందుకు! అన్నదాని కారణం: అశోక్ కలకత్తాలో రైలు ప్రయాణం చేస్తూ, రచయిత రాసిన కథా సంకలనం చదువుతూ ఉన్నప్పుడు రైలు ఆక్సిడెంట్ అవుతుంది. అతను పక్కనున్న పొలంలో వెళ్ళి పడతాడు. పుస్తకపు పేజీలని ఊపుతూ రక్షణ టీంలో ఉన్న డాక్టర్లకి తానికా బతికే ఉన్నానని సూచించినప్పుడు, వారతన్ని కాపాడుతారు. ఆ సంపుటివల్లే తనింకా ప్రాణాలతో ఉన్నాననుకున్న ఆశోక్ నమ్మకం కొడుకు పేరుగా మారుతుంది. అతని ఆ జ్ఞాపకం నవలంతటా కనిపిస్తూనే ఉంటుంది.

గోగో పేరుకి స్వాభావిక ప్రాముఖ్యత ఉన్నప్పటికీ, ఇంటి బయట కొడుకుని ఆ పేరుతో ఎవరూ పిలవాలన్న ఉద్దేశ్యం మాత్రం ఉండదు తల్లితండ్రులకి. కాబట్టి గోగోని కిండర్ గార్డెన్‌లో చేర్చినప్పుడు, కొడుకు పేరు 'నిఖిల్' అని రాయమని టీచర్లకి చెప్తారు. టీచర్లు కుర్రాడినే 'నిన్నే పేరు పెట్టి పిలవాలి?' అని అడిగినప్పుడు, పిల్లాడు 'గోగో' అనే చెప్పినందువల్ల, ఆ పేరే స్కూల్ పాస్ అయేవరకూ స్థిరపడుతుంది.

గంగూలీ దంపతులకి కూతురు పుట్టినప్పుడు ' సోనియా' అన్న పేరు పెడతారు. వారు కలిసేదీ, పండుగలు జరుపుకునేదీ సాటి బెంగాలీలతోనే. వండే వంటలూ, వస్త్రధారణా బెంగాలీ సంస్కృతికి సంబంధించినవే.

పెరిగి పెద్దవుతున్నకొద్దీ తన వింత పేరు గోగోకి కంపరంగా అనిపించినప్పుడు, కొడుక్కి ఆ కథల సంపుటి బహుమానంగా ఇచ్చిన అశోక్, తాము ఆ పేరే ఎందుకు ఎందుకు ఎంచుకున్నారో అని వివరించడానికి ప్రయత్నిస్తాడు. అయినప్పటికీ, ఒక రష్యన్ రచయిత ఇంటి పేరుకీ తనకీ సంబంధమేమిటో అని గోగో ఊహించలేకపోయినప్పుడు, కారణం అర్థం చేసుకునే వయస్సుకింకా కొడుకు చేరలేదని గ్రహిస్తాడు.

గోగో 18వ యేట, చట్టబద్ధంగా తన పేరు నిఖిల్‌గా మార్చుకుంటాడు. అయితే, తల్లితండ్రులు కానీ వారి స్నేహితులు/వారి పిల్లలూ కానీ తనని గోగో అని తప్ప ఇంకే పేరుతోనూ పిలవరని అతనికి తెలుసు. తన తల్లితండ్రుల బెంగాలీ సంస్కృతిని తిరస్కరించి అమెరికన్‌లా బతుకుదామనుకున్న అతని అనేక ప్రయత్నాలలో ఈ పేరు మార్పు మొదటిది. తండ్రిలా ఎమ్ఐటిలో కాక, యేల్ యూనివర్సిటీలో చేరడానికి నిర్ణయించుకుంటాడు. అమెరికన్ అమ్మాయిలని మాత్రమే డేట్ చేస్తాడు. ఈ చర్యలవల్ల తల్లితండ్రులని నిర్లక్ష్యపెడతాడు కూడా. అయితే, అతని కాలేజిలో థాంక్స్ గివింగ్ రోజున తండ్రి– గోగో పేరుకున్న మూలాలని కొడుక్కి వివరిస్తూ, *'పుస్తకాలున్నది ఇందుకోసమే అని మా తాతగారు చెప్పేవారు: ఒక్క ఇంచీ కూడా కదలకుండా ప్రయాణాలు చేసేటందుకు.'* అని చెప్పినప్పుడు, తను పేరు మార్చుకున్నందుకు గోగో పశ్చాత్తాపపడ్డం ప్రారంభిస్తాడు.

అతను న్యూయార్క్‌లో ఆర్కిటెక్ట్‌గా పని చేస్తున్నప్పుడు, ధనిక కుటుంబానికి చెందిన మాక్సీన్ అన్న అమ్మాయితో ప్రేమలో పడతాడు. తన తల్లితండ్రులతో పోల్చి చూస్తే పూర్తిగా భిన్నంగా ఉండే ఆమె ఇంటివారితో సౌకర్యవంతంగా అనిపించి, ఆ కుటుంబంతో ఎక్కువ సమయం వెచ్చిస్తూ తన స్వంత అమ్మానాన్నాతో తక్కువ సమయం గడపడం మొదలెడతాడు. కొంతకాలం తరువాత మాక్సీన్ ఇంటికే మారతాడు.

ఒహాయో యూనివర్సిటీలో బోధిస్తూ హటాత్తుగా గుండెపోటు వచ్చి అశోక్ మరణించినప్పుడు, గోగో– తండ్రి అపార్టుమెంటుకి వెళ్ళి కుటుంబంతో పాటు బెంగాలీ కర్మకాండల్లో పాలు పంచుకుంటాడు. మాక్సీన్ కూడా పాటు వెళ్తుంది కానీ బెంగాలీ సాంప్రదాయాలు తెలియకపోవడంతో, అంటీముట్టనట్టు ఉంటుంది. ఆమెకి నెమ్మదిగా దూరం అవుతూ ఆఖరికి ఆ సంబంధానికి దూరం తొలుగుతాడు గోగో.

ఒక సంవత్సరం గడిచాక తల్లి– మౌషుమి అనే అమ్మాయికి కలుసుకొమ్మని కొడుకుతో చెప్తుంది. ఆ అమ్మాయి అమెరికన్ బోయ్ ఫ్రెండు

అయిన గ్రహమ్‌తో అయిన నిశ్చితార్థాన్ని తెంచేసుకున్న గోగో చిన్నప్పటి స్నేహితురాలు. గోగో, మౌషుమి కలిపి తిరగడం ప్రారంభించి, తమ ఇండియన్–అమెరికన్ నేపథ్యం వల్ల తలెత్తిన ఇబ్బందులతో పాటు అనేకమైన విషయాల గురించి ఏకాభిప్రాయానికి వచ్చి, ఆఖరికి పెళ్ళి చేసుకుంటారు. కాకపోతే, మౌషుమి తనకి గతంలో పరిచయం ఉన్న దిమిత్రీతో సంబంధం పెట్టుకుందని గోగోకి తెలియడానికి ఎక్కువ కాలం పట్టదు. ఇద్దరూ విడాకులు పుచ్చుకుంటారు.

చెల్లెలు సోనియా– బెన్ అనే యువకుడిని పెళ్ళి చేసుకుంటున్నప్పుడు, గోగో పెళ్ళి ఏర్పాట్లకోసం తన చిన్నప్పటి ఇంటికి వెళ్తాడు. తనకి పద్నాలుగేళ్ళుండగా తండ్రి తనకి ఇచ్చిన రష్యన్ కథల పుస్తకాన్ని చూస్తాడు. దానిమీద తండ్రి రాసిన *'గోగో గంగూలీకోసం: నీకు తన పేరు ఇచ్చిన ...నీకు నీ పేరిచ్చిన వ్యక్తి నుండి.'* అన్న మాటలు చదివి, సమాన నామధేయుడు మొట్టమొదటిసారిగా తండ్రికి ఇష్టమయిన పుస్తకాన్ని చదవడం ప్రారంభిస్తాడు.

★★★

పుస్తకంలో లహిరి– భారతదేశం, అమెరికాల మధ్య ఉండే తేడాలని చూపిస్తారు. ఆమె పరిశోధనలో కొంతమట్టుకు ఇండియన్ వలసదారులైన తల్లితండ్రులకి పుట్టి, అమెరికాలో పెరిగిన తన అనుభవాలమీదా, తన బెంగాలీ స్నేహితుల అనుభవాలమీదా ఆధారపడినది. అయితే, 'నేమ్‌సేక్' సృజనాత్మక రచన కూడా కనుక ఇక్కడ లహిరీ కాల్పనిక ప్రతిరూపం గోగో గంగూలీ.

మొదటి తరపు వలసదారులకీ, అమెరికాని తమ దేశంగా చేసుకున్న వారి పిల్లల తరానికీ మధ్య ఉన్న తేడామీద, నవల కేంద్రీకరిస్తుంది.

కథాకాలం: 1968–2000 నాటిది.

రెండు విభిన్న సంస్కృతులను సమన్వయ పరుస్తూ– పేరుకీ, ఉనికికీ ఉన్న సంబంధాన్ని గుర్తించడానికి చేసిన ప్రయత్నం ఇది. నవల్లో దృష్టికోణాలు మారుతూ ఉన్నప్పటికీ ప్రధాన భాగం– ఆషిమా, అషోక్, గోగో గొంతులతో వినిపించేదే. రెండు తరాల పరిస్థితినీ సున్నితమైన శైలిలో వివరించిన పుస్తకపు ఆధారంగా, మీరా నాయర్ సినిమా ఇదే పేరుతో  సినిమా తీశారు

# English August : ఒక భారతీయ కథ



ఉపమన్యూ ఛటర్జీ 1959లో పట్నాలో పుట్టారు. ఢిల్లీ యూనివర్సిటీలో ఇంగ్లీష్ లిటరేచర్‌లో గ్రాడ్యుయేషన్ చేసి, 1983లో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్‌లో చేరారు. 1998లో మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్సెస్‌లో డైరెక్టర్ (లాంగ్వేజస్) గా నియమించబడ్డారు. మొదట్లో 'ద అసాసినేషన్ ఆఫ్ ఇందిరా గాంధీ' అన్న కథతో పాటు మరి కొన్ని రాశారు. **ఇంగ్లీష్ ఆగస్ట్: ఎన్ ఇండియన్ స్టోరీ**, 1988లో పబ్లిష్ అయిన తరువాత, 1994లో దేవ్ బెనెగల్ దర్శకత్వంలో– సినిమాగా వచ్చింది. నేషనల్ అవార్డ్ కూడా

పొందింది. కథా నాయకుడు రాహుల్ బోస్. అయితే, అనూప్ జొత్వానీ ఫోటోగ్రాఫర్‌గా చేసిన యీ సినిమా రీలు, ప్రసాద్ స్టూడియోలో పాడయిపోయింది. ఇంగ్లీష్ ఆగస్ట్‌కు ఉత్తరకథగా వచ్చిన, 'మామరీస్ ఆఫ్ వెల్ఫేర్ స్టేట్' 2000లో పబ్లిష్ అయింది.
యీ సంవత్సరమే పెంగ్విన్ రాండమ్ హౌస్, ఇంగ్లీష్ ఆగస్ట్ పుస్తకాన్ని 30వ సారి పునర్ముద్రించింది. రచయిత రెండవ నవల 'లాస్ట్ బర్డెన్' 1993లో వచ్చింది. ఇరవై శతాబ్దపు చివర్న, ఒక భారతదేశపు మధ్య తరగతి కుటుంబ జీవితాన్ని పునఃసృష్టించిన పుస్తకం ఇది. రచయిత నాలుగవ నవల, 'వెయిట్ లాస్' 2006లో అచ్చయింది. అయిదవ పుస్తకం 'వే టు గో' కి 'హిందూ బెస్ట్ ఫిక్షన్' అవార్డు వచ్చింది. ఆయన సరికొత్త నవల, 'ఫెయిరీ టేల్స్ ఆఫ్ ఫిఫ్టీ' 2014లో పబ్లిష్ అయింది. ప్రస్తుతం ఛటర్జీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియాలో జాయింట్ సెక్రెటరీగా, 'పెట్రోలియమ్ అండ్ న్యాచురల్ గాస్ రెగ్యులేటరీ బోర్డ్' కు పని చేస్తున్నారు.

★★★




*'బ్యూరోక్రాట్ అంటే- మృదువుగా, కళ్ళజోడుతో, చక్కగా గడ్డం గీసుకుని ఉండాలి. మీ వయస్సెంత?*
*'ఇరవై ఎనిమిది.' నిజానికి అతని వయస్సు 24 కానీ, అతను అబద్ధం చెప్పే మూడ్‌లో ఉన్నాడు. అదేకాక అతనికి వాళ్ళ మొహాలంటే అయిష్టం పుట్టుకొచ్చింది. '*
*'మీకు పెళ్ళయిందా?*
*"అయింది." 'రెండుసార్లని చెప్పాలా వద్దా!'*
*'మీ శ్రీమతెక్కడ ఉంది?'*
*'ఇంగ్లాండ్లో. తను బ్రిటిషర్. ట్యూమర్ ఆపరేట్ చేయించుకోడానికి వెళ్ళింది.' ఆ ట్యూమర్ ఎంత పెద్దదో, వేళ్ళు చాపి చూపించాలనిపించింది అతనికి.*
తన ట్రైనింగ్ మొదట్లో, ఆగస్త్య, డిస్ట్రిక్ట్ ఇన్స్పెక్టరుకి చెప్పిన సమాధానాలివి. వాటిల్లో ఏ నిజమూ ఉండదు. అతనికి ఇంగ్లీష్ భాషన్నా, ఆంగ్లో ఇండియన్స్ అన్నా ఇష్టం అయినందువల్ల, స్నేహితులు అతన్ని 'ఆగస్ట్' అని పిలుస్తారు. గవర్నర్ అయిన అతని తండ్రి, కొడుకు *'జుత్తుకి నూనె రాసుకోని తరం వాడు.'* అంటాడు. ఐయేఎస్ పాస్ అయిన తరువాత, ఆగస్త్య మొదటి పోస్టింగ్ 'ఇండియాలో అతి వేడిగా ఉండే పట్టణం' అయిన' మద్నా' అన్న కల్పిత చోట అవుతుంది. అక్కడ జనాభా హెచ్చు, సౌకర్యాలు తక్కువా. పట్టణంలో పుట్టి పెరిగిన ఆగస్త్యకి ఆ ఉద్యోగం అయోమయం కలిగించి, విసుగు పుట్టిస్తుంది. ప్రభుత్వ యంత్రాంగం అసమర్థమైనదనిపిస్తుంది. ఆ చిన్న ఊరి నివాసులు విద్దూరంగా అనిపిస్తారు. వారి జీవితాలు నిస్సారమైనవిగా కనిపిస్తాయి. అతని గర్ల్ ఫ్రెండ్ చదువుకోడానికి అమెరికా వెళ్ళి ఉంటుంది. తండ్రి బెంగాల్లో పోస్టింగ్ అయి, తీరిక లేకుండా ఉంటాడు. తల్లి ఎప్పుడో మరణిస్తుంది. స్నేహితుడైన ధృబో, ఉత్తరాల ద్వారా తప్ప దొరకడు. ఒంటరితనం మొదలవుతుంది. ఎక్సర్‌సైస్ చేస్తూ, పాటలు వింటూ, ఫిలాసఫీ పుస్తకాలు చదవడంలో సమయం గడుపుతాడు. ఒక కప్పని పెంచుకుంటాడు.

గోడ మీద పాకే బల్లుల్ని చూస్తుంటాడు. మారిజుయానా సేవనం కూడా మొదలవుతుంది. మీటింగ్స్ ఉండే కొన్నిసార్లు, వొంట్లో బాగాలేదన్న సాకులతో వాటిని తప్పించుకుంటాడు.

అక్కడి ధనికులు, ఉద్యోగులు– నౌకర్లమీద కేకలు పెడుతూ, తమ దాబు, దర్పం ప్రదర్శించుకోవడం తప్ప వారికి జీవితంలో ఏ ప్రేరణా లేనందుకు చిరాకుపడతాడు. తన ప్రపంచానికీ, యీ లోకానికీ మధ్య ఎంతో తేడా ఉందని నిర్ణయించుకుంటాడు. తను నెమ్మదిగా ఉన్మత్తతలోకి జారుకుంటున్నానేమో! అన్న అనుమానం మొదలవుతుంది. మారిజువానా ప్రభావం లేకపోయినప్పుడు అతని మేధావితనం బయటకు వస్తుంది. *'ఏమరుపాటుగా ఉన్నప్పుడు, ఎద్దు తన తోక విదిలించి, మొహంమీద పేడ జల్లే ఊరు.'* అంటాడు మద్నా గురించి. అస్తమానం చిరచిరలాడే డిస్ట్రిక్ట్ జడ్జ్ తనని భోజనానికి ఆహ్వానించనంటూ, తనకే ఫోన్ చేయడం వంటి సంఘటనలతో కథ నడుస్తుంటుంది. అగస్త్యకి పెద్ద కోరికలంటూ ఏమీ ఉండవు. ఆఫీసు అవగానే ఇక దాని గురించి ఆలోచించక ఇంటికి వెళ్ళిపోతాడు. తన ఆఫీసులో, *'ఒక పెటిషన్ ఎన్ని బల్లలు మారుతూ, గెంజ చుట్టూ కండ పట్టినట్టుగా దుమ్ము పట్టించుకుంటూ, ఆఖరికి ఎలా పనికి రాకుండా పోతుందో.'* వివరిస్తాడు. మళ్ళీ సందేహాలు పుట్టుకొస్తాయి–తను సరైన ఉద్యోగమే ఎంచుకున్నాడా! యూనివర్సిటీ చదువు ఆపెయ్యడం సబబేనా? వేరే పట్టణంలో ఇంకో ఉద్యోగానికి అప్లై చేయాలా! అతన్ని వేధించే యీ అనుమానాలకు, నిజ జీవితంలో జరిగినట్టే, ఏ సమాధానమూ తట్టదు. సాఠే, శ్రీవాస్తవ్, బజాజ్, డాక్టర్ ముల్తానీ – నవల్లో ఉండే యీ ఇతర పాత్రలన్నిటికీ, తమవే అయిన స్వంత తల తిక్కలుంటాయి.

తన ఉద్యోగంలో ఆగస్త్య ఎదురుకున్న మొట్టమొదటి సవాలు– నక్సలైట్లుండే ప్రాంతంలో ఉన్న ఊరి నీటి కొరత. అక్కడ ఎండిన బావిలోనుంచి నీళ్ళు పిండుకు వచ్చేటందుకు పిల్లలని తాడు కట్టి దించడం, ఆ ప్రయత్నంలో వారు నుదుటిమీద *'పువ్వుల్లాంటి'* గాయాలు చేసుకోవడం అతన్ని కదిలిస్తాయి. అప్పుడు, ఆ ఊరికి అనధికార నీటి సదుపాయం కలుగజేస్తాడు. ఫారెస్ట్ ఆఫీసర్ అయిన ఆగస్త్య స్నేహితుడు గాంధీ, కొండజాతి అమ్మాయిని మానభంగం చేశాడని, కొండవారు అతని చేతుల్ని నరికి వేయడం చూస్తాడు.

ఇలా సాగుతూ ఉండగా, *'ఇదే నా ఊరు. నేను చెందేది ఇక్కడే.'* అంటూ పంతంగా ఢిల్లీ వెళ్ళిన తరువాత, *'ఇది నా అశాంతిని ఎక్కువ చేసే పలాయనమే తప్ప నిజం కాదు. అవే మొహాలు, కథలు, చోట్లు. ఇక్కడ నేను చేసేదేముంది?'* అనుకుంటాడు. నిజానికి, పరాయి ఊరు అని తను అనుకున్న మెద్నా తనకి తెలియకుండానే తన ఎదుగుదలకి తోడ్పడిందని, తన జీవితంలో కొత్త అధ్యాయం మొదలుపెట్టేందుకు బాధ్యత వహించిదనీ గుర్తిస్తాడు. ఒకానొకప్పుడు తనకి ప్రియమైనవనుకున్న వాటినన్నటినీ దూరం చేసుకున్నప్పుడే తన దృష్టికోణం మారిందని గ్రహిస్తాడు. అలా అని, ఆగస్త్య తనెవరో, జీవితంలో తనేమిటి చేయదలచుకున్నాడో అని తెలుసుకున్నాడని మాత్రం కాదు. తనింక ఏమిటి కాదో అని మాత్రం అతనికి అర్థం అవుతుంది.

★★★

వొక ఐఏస్ ఆఫీసరుగా– ఉపమన్యూ ఛటర్జీ తన అనుభవాలనే ఆగస్త్య పాత్ర ద్వారా చూపించి, రాసిన నవలిది. మాటలనీ, పదబంధాలనీ చమత్కారంగా ఉపయోగిస్తారు రచయిత. ప్రభుత్వ కార్యాలయాల్లో కనిపించే అసమర్థతని, లంచగొండితనాన్ని ఎత్తి చూపుతారు. ఇంగ్లీష్ ఎక్కువ రాని యువత ఏదో సమయాన్న ఎదుర్కొనే సంక్షోభం, స్థితిభ్రాంతి గురించి చెప్తారు.

గ్రామీణ జీవితాలని వర్ణిస్తూ, ప్రభుత్వం పని చేసే తీరును వెక్కిరిస్తారు. *పుస్తకమంతటా ప్రధానంగా కనిపించేది హాస్యం. 'ఇంగ్లీష్ ఆగస్ట్'*

*ప్రభుత్వ యంత్రాంగంమీదా, సమాజంపైనా చేసిన తీక్ష్ణమైన, నిందాత్మకమైన, హాస్యమైన దాడి. కానీ, నిజాయితీతో కూడినది.* అన్నేళ్ళ కిందట ప్రభుత్వ అధికారుల ఉదాసీనత గురించి రాసిన యీ నవల్లో ఉన్న పరిస్థితులు, ఇప్పుడు కూడా మారినది లేదు. వ్యంగ్యం, సామాజిక వ్యాఖ్యానం సమపాళ్ళల్లో కనిపిస్తాయి పుస్తకంలో. కథనంలో ఎక్కడా బిగుతు సడలదు. మందకొడిగా ఉన్న పరిస్థితుల్లో కూడా, రచయిత తన చమత్కారపు మాటలతో, హాస్యాన్ని సునాయాసంగా కనపరుస్తారు. ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ మాటలు కలిపిన వ్యావహారిక పదజాలం– అవసరం అయిన ప్రభావం చూపుతుంది.

# Clear Light of Day



అనితా దేశాయ్ పుట్టినది 1937లో, ముస్సోరీలో. చదువుకున్నది ఢిల్లీ యూనివర్సిటీలో. పై చదువు కొనసాగించినది కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో. ఇప్పుడు కేంబ్రిడ్జ్ 'జాన్ యీ బర్చర్డ్ అకాడెమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ లెటర్స్' లో, ప్రొఫెసర్గా పని చేస్తున్నారు. ఆమె రాసిన పుస్తకాల్లో 'ఫైర్ ఆన్ ద మౌంటెన్' (1977) కి వినిఫ్రెడ్ హోల్బీ మెమోరియల్ ప్రైజ్ వచ్చింది. 'ఇన్ కస్టడీ(1984) మరియు 'ఫాస్టింగ్, ఫీస్టింగ్' (1999), నవలలు బుకర్ ప్రైజుకి షార్టులిస్ట్ అయాయి. 'ఇన్ కస్టడీ' పుస్తకాన్ని మర్చంట్ ఐవరీ ప్రొడక్షన్స్, సినిమాగా తీసింది.

దేశాయ్ నవలలూ, షార్ట్ స్టోరీలూ– సంఘటలనూ, మనోభావాలనూ కళ్ళముందు కదలాడేలా చేస్తాయి. ఆమె పుస్తకాల్లో వీరోచిత పాత్రలు ఉండవు. స్త్రీల అణిచివేత, గుర్తింపు కోసం పాకులాట, కుటుంబ సంబంధాలు, మరుగవుతున్న సాంప్రదాయాలు– ప్రధాన ఇతివృత్తాలయి ఉంటాయి. పద్మభూషణ్ గ్రహీత ఆమె. 'క్లియర్ లైట్ ఆఫ్ దే' పబ్లిష్ అయినది 1980లో.

★★★




కథ సుమారు 1970లలో ప్రారంభం అవుతుంది. తారా దాస్, యుఎస్లో ఇండియన్ అంబాసడర్ అయిన బకుల్ భార్య. వాషింగ్టన్ నుంచి ప్రతీ ఏటా వచ్చినట్టే, వారి కుటుంబం పాత ఢిల్లీకి, తారా అక్కయిన బిమ్లా(బిమ్) వద్దకి వచ్చి, ఆ పాడు పడుతున్న ఇంట్లో ఉంటుంది. బిమ్తో పాటు ఆటిస్టిక్గా పుట్టిన తమ్ముడు బాబా ఉంటాడు. ఏనాడూ ఇల్లు వదలని ఆ అక్కా తమ్ముళ్ళ

ఉనికి తారాను కలవరపెట్టినప్పుడు, *'ఏదీ మారలేదెందుకు? నేను మారానే!'* అని మధన పడుతుంది. తల సగం నెరిసిన బిమ్ వృత్తి హిస్టరీ బోధించడం. రోజంతా గ్రామఫోన్లో, 1930ల సంగీతం వినే బాబాను చూసుకుంటుంటుంది. తినగా మిగిలిపోయిన ఆహారపదార్థాలన్నిటినీ బిమ్ గోకి తీసి, సాసర్లలో మర్నాటికని పెడుతుందని చూసిన తారా అది బకుల్‌కు తెలుస్తుందేమోనని చిరాకు పడుతుంది. ఏదీ మారనందుకు చిరాకు పడుతుంది. *'నా బాల్యపు, యవ్వనపు మందత్వం, గదిలో ఉన్న మట్టి కొట్టుకున్న కార్పెట్ల కిందనా, పచ్చబడి ఉన్న ఫోటోల వెనుకాతలా, కిలుమెక్కిన ఇత్తడి సామాన్ల మధ్యా దాగుంది. నేను చిన్నపిల్లగా ఉన్నప్పుడు అసహ్యించుకున్న ప్రతీదీ ఇక్కడే జాగ్రత్తగా పెట్టి ఉంది.'*

*'పాత ఢిల్లీ మారదు. అది శిధిలం అవుతుందంతే. ఇది గొప్ప శ్మశానవాటిక అని నా స్టూడెంట్స్ చెప్తారు. ప్రతీ ఇల్లూ ఒక సమాధే.'* అంటుంది బిమ్లా.

ఢిల్లీ వేసవి తారాకి చిరాకు కలిగించినప్పుడు, గతపు ఛాయలు ఆమెని చుట్టుముడతాయి. భారతదేశపు విభజన సమయంలోనే బాబా పుట్టిన తరువాత మొదట, తల్లి మరణిస్తుంది. ఆ తరువాత, తండ్రి ఏక్సిడెంట్లో చనిపోతాడు. తల్లితండ్రులు తరచూ నైట్ క్లబ్బులకు వెళ్తూ పిల్లలని పట్టించుకోకపోవడం వల్ల పిల్లలకి కూడా వారి లోటు అంతగా కనిపించదు. విధవరాలైన పిన్ని మీరా చిన్నప్పుడు వారి బాగోగులు చూసుకునేది. తాగుడు అలవాటు వల్ల అనారోగ్యంతో ఆమె కూడా చనిపోతుంది. అందరిలో పెద్దవాడైన రాజా, బిమ్ అన్యోన్యంగా ఉండేవారు. అతనికి టిబి సోకినప్పుడు బిమ్ నిస్వార్థంగా సేవ చేస్తుంది. వారి ఇంటి యజమానీ, పొరుగింటివాడూ అయిన హైదర్ అలీ, రాజాను తన హైదరాబాదు ఇంటికి ఆహ్వానించినప్పుడు మతపరమైన ఉద్రిక్తతను తప్పించుకోడానికి రాజా అక్కడికి వెళ్ళి ఉర్దూ ఇష్టపడ్డం ప్రారంభించి, అలీ కూతురిని ప్రేమించి పెళ్ళి చేసుకుంటాడు. తారా పొరిగింటి మిశ్రాలతో సమయం గడుపుతూ బకుల్‌తో ప్రేమలో పడి, అతన్ని పెళ్ళి చేసుకుని పట్టణం వదిలి వెళ్ళిపోతుంది. బిమ్, బాబా వొంటరిగా మిగులుతారు.

బిమ్ అనేకసార్లు ఒక డాక్టర్ని కలుసుకున్నప్పటికీ అతను ఆసక్తికరమైన వాడు కాదనుకుని ఆ సంబంధాన్ని వదిలి వేస్తుంది. అక్కాచెల్లెళ్ళు, రాజా గురించి మాట్లాడుకుంటారు. తారా వచ్చినది అతని కూతురి పెళ్ళికే.

రాజా– బిమ్‌కి, *'అద్దేమీ ఎక్కువ చేయనులే'* అని ఉత్తరం రాస్తాడు. *'నేను తన మామగారి ఇంట్లో ఉండటం వల్ల అన్న ఇంటి అద్దె పెంచాలేదు. ఇంటిని అమ్మాలేదు. ఎంత త్యాగమో?'* అనుకున్న బిమ్ అది క్షమించలేకపోయి, పెళ్ళికి వెళ్ళనంటూ భీష్మించుకుని కూర్చుంటుంది. బిమ్ ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేదని తెలిసిన తారా, రాజాతో బిమ్‌కున్న సమస్యేమిటో చెప్పమని నిలదీస్తుంది. బాబా బాధ్యత రాజా, తారా కలిసి కేవలం తనమీదే వదలడం బిమ్‌కు కోపం తెప్పించి, బాబా మీద కూడా కేకలు పెడుతుంది. ఆ కోపానికి బాబా స్పందించకపోయినప్పుడు ఆమె కోపం చల్లారి, పశ్చాత్తాపపడుతుంది. చివరికి, కుటుంబంలో జరిగిన పొరపాట్లన్నీ ప్రేమ వల్ల కప్పదుతాయని గ్రహించినప్పుడు, మిశ్రాలతో పాటు సంగీత కచ్చేరీకి వెళ్ళి, ఆ కుటుంబంలో ఉన్న అన్యోత్యనని గమనిస్తుంది. తారా రాజా కూతురి పెళ్ళికి వెళ్తుంది. అన్నను క్షమించడానికి సిద్ధంగా ఉన్న బిమ్, రాజాని ఇంటికి తెమ్మని తారాని అడుగుతుంది.

★★★

పుస్తకంలో పునరావృతమయే ఇతివృత్తం సంగీతం. అది వినే బాబాయేకాక, బిమ్ కొంతకాలం కలిసి తిరిగిన డాక్టర్ కూడా వయొలిన్ మీద పాశ్చాత్య శాస్త్రీయ సంగీతం వాయించేవాడు. మొజార్ట్ అంటే చెవి కోసుకునేవాడు. అతని తల్లి రొబీంద్ర సంగీత్ పాడే స్త్రీ. పొరుగింటి యువకుడికి భారతీయ శాస్త్రీయ సంగీతమంటే ఇష్టం. రాజా ఆసక్తి ఉండేది ఎలియట్, బైరన్, టెనిసన్ మీద. అతను తన అభిరుచులని బిమ్‌తో పంచుకునేవాడు. కనుక, కవిత్వం మరొక ఇతివృత్తం.

పుస్తకం– కుటుంబంలో కనిపించే తోబుట్టువుల మధ్యనుండే పోటీ, అపరాధభావం, నిస్పృహ, అల్పమైన ఈర్ష్యలు, బాల్యంలో చవి చూసిన క్రూరత్వం పెద్దయిన తరువాత కూడా వెంటాడటం, వయస్సు ఎక్కువవుతున్నప్పుడు వచ్చే మార్పుల గురించినది. కుటుంబం వేరు పడ్డం గురించేకాక నవల మనకి దేశ చరిత్ర గురించి కూడా చెప్తుంది. భారతదేశపు విభజన పరిగణించతగ్గ యదార్థం. అది రాజా ఇల్లు విడవడం, తారా పెళ్ళి చేసుకోవడం, దాస్ దంపతుల/మీరా మరణాలతో సమకాలీనమైనది. నవల్లో కనిపించే కుటుంబపరమైన వేర్పాట్లు, విభజనకు దారి తీసిన సామాజిక సంఘటనలకి సమానాంతరంగా నడుస్తాయి. ఇండియానుండి పాకిస్తాన్ వేరయినప్పుడు సంభవించిన సామాజిక తిరుగుబాటు వివరాలుంటాయి.

పూర్తి పుస్తకం ప్రథమ పురుషలో ఉంటుంది. మానని కుటుంబ గాయాల సార్వత్రిక కథ ఇది. తోబుట్టువుల చరిత్ర పాకిస్తాన్‌కు ఇండియాతో ఉన్న సంబంధాన్ని పోలుస్తుంది. పాత్రలు కోల్పోయిన అవకాశాలు, బాధ, త్యాగం కనబడతాయి దీన్లో. *‘ఒకరి అవసరాలని మరొకరు గుర్తించి, కలిసే ఉంటే జీవితమెంత భిన్నంగా ఉండేదో!’* అన్న తలంపుల గురించినది. తప్పులను క్షమించి మరచిపోగలిసే సామర్థ్యం, కుటుంబం అనుభవించిన పరీక్షల/కష్టాల గురించి దేశాయ్ రాస్తారు.

నాలుగవ భాగంలో ఉన్న ఒక పేరాలో గతానికి బానిస అయిన బిమ్లా, పరిణితి చెంది, *‘స్పష్టమైన కాంతిలో’* ప్రపంచాన్ని చూసినప్పుడు, *‘నొప్పి కలిగినప్పుడు, అందరిపైనా ప్రేమా అభిమానం తప్ప ఇంకేదీ కనబడదు.’* అనే స్థితికి చేరుకుంటుంది.

‘క్లియర్ లైట్ ఆఫ్ డే’ మాన్ బుకర్ ప్రైజుకి షార్టులిస్ట్ అయింది. నాలుగు అధ్యాయాలున్న పుస్తకంలో–ప్రధాన పాత్రలన్నీ పెరిగి పెద్దవయి, వెనక్కి తిరిగి తమ బాల్యాల్లోకి తొంగి చూసిన తరువాత, ప్రస్తుత కాలానికి తిరిగి వస్తుంది.

## The Inheritance of Loss

## కిరణ్ దేశాయ్







కిరణ్ దేశాయ్, రచయిత్రి అనితా దేశాయ్ కుమార్తె. సెప్టెంబర్ 1971లో ఢిల్లీలో పుట్టి– పూణే, ముంబయిల్లో 14 ఏళ్ళు వచ్చేవరకూ ఉండి, ఆ తరువాత తల్లితండ్రీతో పాటు ఇంగ్లాండ్ వెళ్ళారు. ఏడాది తరువాత అమెరికా వెళ్ళి అక్కడే స్థిరపడ్డారు.

ఆమె తొలి నవల 'హల్లబలూ ఇన్ ద గ్వావా ఓర్చర్డ్' 1998లో పబ్లిష్ అయి, బెట్టీ ట్రాస్క్ అవార్డ్ పొందింది. నవలను రచయిత సల్మాన్ రష్దీ, ఎంతగానో ప్రశంసించారు. రెండవ పుస్తకం, 'ద ఇన్హెరిటెన్స్ ఆఫ్ లాస్' 2006లో వచ్చింది. ఇది 2007లో మాన్ బుకర్ ప్రైజే కాక 2006 'నేషనల్ బుక్ క్రిటిక్స్ సర్కిల్ ఫిక్షన్' అవార్డు కూడా గెలుచుకుంది. ఈ నవల రాస్తున్నప్పుడు దేశాయ్ న్యూయార్క్, మెక్సికో, ఇండియా తిరుగుతూ– దేశదిమ్మరిలా గడిపారు. ఆ ఏడేళ్ళ శ్రమ ఫలితం యీ పుస్తకం. అప్పుడు బుకర్ ప్రైజ్ గెలుచుకున్న వాళ్ళల్లో అతి చిన్న వయస్సు గల స్త్రీ దేశాయ్.

★★★

1986లో మొదలయిన పుస్తకపు నేపథ్యం, ఈశాన్య హిమాలయాలున్న కాలింపోంగ్. జడ్జ్‌గా రిటైర్ అయిన జెమూభాయ్ పటేల్‌కు భారతీయ సాంప్రదాయాలంటే అయిష్టం. రొట్టెలని కూడా కత్తీ ఫోర్క్‌తో తినే వ్యక్తి. తండ్రితో సహా భారతీయులందరినీ అసహ్యించుకుంటాడు. భార్యని హింసించి తన తండ్రి వద్దే వదిలిపెడతాడు. కూతురు, అల్లుడు యూరప్లో కారు ప్రమాదంలో చనిపోయిన తరువాత, తన భార్యను పెట్టిన కష్టానికి ఆధ్యాత్మిక వెల చెల్లిస్తూ, 17 ఏళ్ళ మనవరాలైన సాయిని తన పాడుపడుతున్న ఇంట్లో ఉండనిస్తాడు. ఆ ఇంట్లో వంటతను, పెంపుడు కుక్కయిన మట్ కూడా ఉంటారు.

సాయి తనకు ట్యూషన్ చెప్పడానికి వచ్చే నేపాలీ యువకుడు గ్యాన్‌తో ప్రేమలో పడుతుంది. అయితే, అతను నూరు శాతం నేపాలీ, ఆమె పాశ్చాత్య విద్యనభ్యసించిన ఎగువ తరగతి యువతి అయినందువల్ల వారి ప్రేమ సఫలమయే ప్రశక్తే ఉండదు. వంటతను వాళ్ళిద్దరినీ ఒక కంట కనిపెడుతూ ఉంటాడు. పని కోసం అమెరికా వెళ్ళిన తన కొడుకు బిజూ గురించి వ్యాకులపడుతుంటాడు.

ఒకరోజు సాయి, గ్యాన్ కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. జడ్జ్ పడక్కుర్చీలో కునుకు తీస్తుంటాడు. గోర్ఖాలాండ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ సభ్యులు కొంతమంది ఇంట్లోకి చొరపడతారు. కుక్క సహాయం ఉండదు: *'మట్ అపరిచితులని కలుసుకున్నప్పుడు చేసేదే, ఇప్పుడూ చేసింది. అపరిచితులకు సిగ్గూ, ఆశా కనపరుస్తూనే, కోపంగా తోకాడించడం మొదలెట్టింది.'* ఆ సభ్యులు ఇంట్లో ఉన్న భోజనం, మద్యం, తుపాకులు, ఒక పాతకాలపు ట్రంకు పెట్టెను దొంగిలిస్తారు. ఎవరికైనా తెలపాలన్నా, ఇంట్లో ఫోనుండదు. వారికోసం టీ పెట్టవలిసి వచ్చినప్పుడు జడ్జి ఆ పరాభవాన్ని భరించలేకపోతాడు. అప్పుడు, *'సాయి, వంటతను, అటువైపు చూడకుండా ఉండే ప్రయత్నం చేస్తూ తమ దృష్టి మళ్ళించుకుంటారు.'* ఆ ప్రాంతం ఎదురుకుంటున్న రాజకీయ పోరాటం, సామాజిక విచ్ఛిన్నత– పాఠకులకు పరిచయం అవుతాయి.

మర్నాడు ఈ సంఘటన గురించి పోలీసులకు రిపోర్ట్ చేయమని జడ్జ్ వంటతన్ని పంపినప్పుడు, అతను నిమ్నజాతివాడు కనుక ఆ నేరంలో వంటతనికీ భాగం ఉందంటారు పోలీసులు. కేసు విచారణకోసం వాళ్ళు వచ్చి, జడ్జ్ ఇంటిని ధ్వంసం చేస్తారు తప్ప చొరబాటుదారులెవరో కనుక్కోలేకపోతారు. స్వాభిమానం కోల్పోయిన వంటతని బాధని సాయి చూడలేకపోతుంది.

సాయికి తెలియకుండా గ్యాన్ విద్రోహుల గుంపులో చేరి, ఆమె వద్దకి రావడం ఆపేస్తాడు. సంగతేమిటో కనుక్కునేటందుకు ఆమె అతని వద్దకు వెళ్ళినప్పుడు, *'సాయి అద్భుతమైన అమ్మాయేమీ కాదు. తన చుట్టూ ఉన్న వైరుధ్యాలన్నిటి ప్రతిబింబం మాత్రమే.'* అనుకుని, ఆమెను వెనక్కి పంపుతాడు. దీనికి సమానాంతరంగా, వంటతని కొడుకు బిజూ కథ నడుస్తుంది. అతని వద్ద చట్టబద్ధమైన పత్రాలేవీ లేకుండానే, న్యూయార్కులో ఉంటూ రెస్టరెంట్లో వంట చేస్తుంటాడు. బిజూ భారతీయుడు అయినందువల్ల అతన్ని అందరూ చిన్నచూపు చూసేవారే. భారతదేశవాసుల కన్నా తక్కువ స్థాయి వారని బిజూ

అనుకున్న పాకిస్తానీలూ అతన్ని ఎగతాళి చేయడంలో తీసిపోరు. తనూ తండ్రిలాగా ఒక నౌకరే అని గుర్తించిన బిజూ, ఉన్న కొద్ది పాటి డబ్బుతో ఇంటిదారి పడతాడు.

ఇండియాలో రాజకీయ పరిస్థితి దిగజారుతుంటుంది. అప్పటివరకూ తాము గడిపిన జీవితాలతో అసంతృప్తి చెందిన పాత్రలన్నీ వాటిని మార్చుకునే ప్రయత్నాలు చేస్తాయి.

★★★

పుస్తకంలో ఉన్న హాస్య సన్నివేశాల్లో కూడా విషాదపు ఛాయలుంటాయి.

బిజూ అనుభవమే ఒకానొకప్పుడు జడ్జికీ ఎదురవుతుంది. అతను 1940లలో ఇంగ్లాండ్లో చదువుకుంటున్నప్పుడు– ఎన్నో ఆదర్శాలు మోసుకుని అక్కడ దొరికే అవకాశాలను అందిపుచ్చుకుందామన్న వ్యక్తి, తను సెకండ్ క్లాస్ సిటిజెన్ని మాత్రమే అని గుర్తించగానే, దేశం వెనక్కి వస్తాడు.

నవల్లో భోజనానికి ఉన్న ప్రాముఖ్యత ఇంతా అంతా కాదు. పాత్రలన్నీ తాము తినే పదార్థాలతో నిస్పృహని జయిస్తూ, ఓదార్పు పొందడానికి ప్రయత్నిస్తాయి. సాంస్కృతిక గుర్తింపును వెతుక్కుంటాయి. జీవితమంతా బ్రిటిష్ వారి 'ఇండియన్ సివిల్ సర్వీసెస్' లో పని చేసిన జడ్జ్, ఎప్పుడూ దీర్ఘంగా ఆలోచిస్తూ, 'టీటోపాటు కేక్, స్కోన్, ఛీస్ స్ట్రాస్ ' కావాలంటాడు. వంటవాడిని పనిలో పెట్టుకున్నప్పుడు, '*చేపలమీద వైట్ సాస్ జల్లు. మటన్ మీద బ్రౌన్ సాస్ వేయాలి.*' అంటూ, తన రుచులు అతనికి నేర్పిస్తాడు. బిజూ తండ్రికి రాసే ఉత్తరాల్లో '*ఫ్రైడ్ చికెన్, హాట్ టొమాటో*' వివరాలుంటాయి.

ఇవన్నీ పక్కన పెడితే, పాత్రలకి మాత్రం ఒకరితో మరొకరు కలిసి, సంభాషించుకునే సామర్థ్యం ఉండదు. ఇండియానుండి న్యూయార్క్ వరకూ ప్రయాణించే నవల– మధ్య తరగతి, కింద తరగతి జీవితాలని స్పష్టంగా వివరిస్తుంది. ఆ జీవితాల తేడాని ఒడిసి పట్టుకుంటుంది. ఉపయోగించినది– వాడుకభాష, సాహిత్య సంబంధమైన భాషల మిశ్రమం. ఇండియాలోనూ బయట దేశాల్లోనూ ఉండే భారతీయుల కఠినమైన వర్గ వ్యవస్థల గురించిన యీ నవల, '*ఇండియా అస్పష్టంగా భూటాన్ మరియు సిక్కిమ్‌లోకి అడుగుపెట్టినప్పుడు, చిందరవందరగా అయిన భూగోళపటం*' నేపథ్యంగా రాయబడినది.

## WATER



బిపాసా సిధ్వా(ఆగస్ట్ 11, 1938) గుజరాతీ పార్సీ సంతతి. పాకిస్తానీ నావెలిస్ట్. అమెరికా నివాసి.
1991లో సిధ్వా రాసిన 'క్రాకింగ్ ఇండియా' ఆధారంగా దీపా మెహ్తా 1998లో 'ఎర్త్' సినిమా తీశారు. పుస్తకాలను ఆధారంగా చేసుకుని సినిమాలు తీయడం సాధారణమే కానీ సిధ్వా రాసిన యీ పుస్తకం మాత్రం, దీపా మెహ్తా 2005లో తీసిన ఇండో–కెనడియన్, 'వాటర్' సినిమా మీద ఆధారపడినది. అచ్చయినది 2006లో. సిధ్వా ప్రస్తుతం హ్యూస్టన్లో ఉంటారు. తన్ని తాను 'పంజాబీ–పార్సీ– పాకిస్తానీ' అని నిర్వచించుకుంటారు.

★★★



1938. స్వాతంత్రానికి ముందు ఉద్రిక్తమైన వాతావరణం నెలకొన్న ఇండియా అది. ఉదాసీనత వదిలించుకుని, బ్రిటిష్ పరిపాలనని ఎదిరిస్తూ– బాల్యవివాహాలు, కుల వ్యవస్థలకి వ్యతిరేకంగా పోరాడమని భారతీయులని గాంధీజీ అడుగుతున్న కాలం. బీహార్– బెంగాల్ సరిహద్దుల్లో ఉన్న పల్లెలో, ఆరేళ్ళ సరళను ఇంట్లో చుయియా(చిట్టెలుక)అని పిలుస్తారు. 44 ఏళ్ళ మనిషికిచ్చి పెళ్ళి చేస్తారు. రెండు సంవత్సరాల తరువాత అతను మరణిస్తాడు. 'నీ భర్త చనిపోయాడు. ఇప్పుడు నీవు విధవరాలివి.' అని తండ్రి చెప్పినప్పుడు, అదేమిటో అర్థం కాని చుయియా, 'ఎన్నాళ్ళ కోసమని నాన్నా?' అని అడుగుతుంది. అల్లుడి అంత్యిమ క్రియలు వారణాసిలో జరగాల్సి వచ్చినపుడు, తండ్రి కూతుర్ని కూడా తీసుకెళ్ళి అక్కడున్న విధవాశ్రమంలో వదిలి పెడతాడు.

ఆశ్రమం నడిపేది మధుమిత అన్న వితంతువు. 'విధవరాళ్ళు తమ తల గొరిగించుకోకపోతే వారి జుత్తుమీద పడే ప్రతి నీటి చుక్కా భర్త ఆత్మను అపవిత్రపరుస్తుంది.' అన్న నమ్మకం వల్ల– అక్కడ పిల్ల తల గొరిగి, తెల్ల చీర చుట్టబెడతారు. రవికెలు వేసుకునే అనుమతి ఉండదు. చుయియాకి శకుంతలతో, బువా అన్న ముసలావిడతో స్నేహం కుదురుతుంది. ఉప్పూకారం లేని వొంటిపూట భోజనమే గతి వారికి. అదీ అన్నం, గరిటెడు పప్పూ. 'చుయియా, ప్రతీ మెతుకూ నములుతూ తిను. తిరిగి తిండి దొరికేది రేపే' అని బువా సలహా ఇస్తుంది. ఆశ్రమానికి బయట ఉన్నవారెవరితోనూ మాట్లాడే అనుమతి ఉండదు ఆ నివాసులకి. విధవలు కానివారెవరినీ ముట్టుకోకూడదు. బాల్యపు కుతూహలంతో, 'వితంతువులు అన్ని బాధలెందుకు పడాలి!' అని చుయియా ప్రశ్నిస్తుంది. ఆ ప్రశ్నలు వింటుండే శకుంతల–'పవిత్ర గ్రంథాలు స్త్రీలకి అంత వ్యతిరేకంగా ఎందుకు రాయబడ్డాయో, వితంతువులు సమాజానికి శత్రువులుగా, పురుషులని తప్పుదారి పట్టించే కామపూరిత ప్రాణులుగా ఎందుకు పరిగణించబడతారో.' అని తనూ ఆలోచించడం ప్రారంభిస్తుంది. 'మోటీ, నేను పిచ్చి వితంతువుని కాను.' అని మధుమతి పట్ల తిరగబడిన చుయియా ధైర్యం, 'దీదీ, మగ వింతువుల ఇల్లు ఎక్కడుంది?' అని శకుంతలను అడిగిన అమాయకత్వం, తల్లి వచ్చి తన్ని ఇంటికి తీసుకువెళ్తుందన్న ఆశాభావం, చాలా నెల్లకి కానీ మందగిల్లవు. చుయియాకూ, అందంగా ఉండే వితంతువైన కల్యాణికీ స్నేహం ఏర్పడుతుంది. కల్యాణి కూడా చిన్నప్పుడే భర్తను కోల్పోయినది. నిరక్షరాస్యురాలు. మధుమతి– కల్యాణిని ధనికులైన వ్యాపారస్థుల వద్దకెళ్ళి, వ్యభిచారం చేయడానికి పడవలో వద్దు దాటిస్తుంటుంది. అందువల్ల ఆమెకు ప్రత్యేకమైన గది ఉండి, కేశసంపదని కోల్పోదు. ఒకరోజు చుయియా, కల్యాణి కలిసి, గాంధీ అనుచరుడైన నారాయణ్‌ని కలుసుకుంటారు. అతనికి యీ పాత ఆచారాలు నచ్చవు. కల్యాణిని పెళ్ళి చేసుకోవాలనుకుంటాడు.

కల్యాణిని తరచూ అనుభవించే సేఠ్లలో నారాయణ్ తండ్రి కూడా ఒకడు. ముందు నారాయణ్ ప్రతిపాదనని సంతోషంగా వొప్పుకున్న కల్యాణి– అతని తండ్రి గురించి తెలిశాక, నదిలో మునిగి ఆత్మహత్య చేసుకుంటుంది.

మధుమతి ముక్కుపచ్చలారని చుయియాని సేఠ్ వద్దకి పంపుతుంది. ఆ అన్యాయాన్ని భరించలేనప్పటికీ ప్రశ్నించలేకపోతుంది శకుంతల. అప్పుడే, మహాత్మా గాంధీ జైలు నుండి విడుదలై, వారణాసి రైల్వే స్టేషన్లో ఆగుతారు. కల్యాణి మరణం తరువాత– తండ్రిమీదా యీ కట్టుబాట్ల మీదా నమ్మకం కోల్పోయిన నారాయణ్, అదే రైల్లో కలకత్తా ప్రయాణిస్తుంటాడు. శకుంతల చుయియాని అతని చేతికి వప్పగించి గాంధీ ఆశ్రమానికి చేర్చమని అడుగుతుంది.

★★★

'తాము చేసిన చెడు క్రియల వల్లా, గతజన్మలో చేసిన పాపాలకి ఫలితంగానే తమకి వైధవ్యం సంక్రమించిందని నమ్ముతూ, వితంతువులు పశ్చాత్తాపపడాలి.' అన్న మూఢాచారాలు ఉన్న కథలో అధికభాగం, చుయియా దృష్టికోణంతో ఉండేదే. కనుక, కొన్ని సంఘటలని– పిల్లలకుండే కుతూహలంతో నిష్పక్షపాతంగా చూపించడమే కాక, కథకున్న గంభీరతను పలచబరిచి, హాస్యం పాళ్ళు కనబరుస్తారు రచయిత్రి. అనేక పాత్రల/సంఘటనల ద్వారా ఇటువంటి అనారోగ్యకరమైన ఆచారాలనూ నిరర్థక జీవితాలను ప్రశ్నిస్తారు.

వైధవ్యంతో కూడిన వెట్టి చాకిరీ వంటి ఇతర అనాచారాలను చుయియా తప్పించుకోగలగడం– ఆ నిస్సహాయ స్థితిలో చిక్కుకునే యువతులకు ఆశాకిరణాన్ని చూపిస్తుంది. యీ 'విముక్తి' అన్న భావమే పుస్తకమంతటా కనిపించడం వల్ల– విచారం, నిరుత్సాహం అంతగా అనిపించవు. అప్పటికే, వితంతు పునర్వివాహాలు చట్టబద్ధం చేయబడినప్పటికీ, ఆచరణలో అవి ఆ కాలంలో నిషేధమే. నవల– సినిమా స్క్రీన్ ప్లేకి అనుసరణే అయినప్పటికీ కథ

సారాన్ని వొడిసి పట్టుకోగలిగింది.

సినిమా ఇక్కడ చూడగలిగే వీలుంది: https://vmovee.ws/drama/water

## Blue Umbrella



రస్కిన్ బాండ్ (మే19, 1934) బ్రిటిష్ సంతతి, ఇండియన్ రచయిత. హిమాచల్ ప్రదేశ్‌లో ఉన్న కసౌలీలో పుట్టారు. సిమ్లాలో ఉన్న బిషప్ కాటన్ స్కూల్లో ఆయన చదువు సాగింది. ప్రస్తుతం, ముస్సోరీలో తన దత్తు కుటుంబంతో పాటు ఉంటారు. ఆయనకి 17 ఏళ్ళుండగా, 1957లో– అనాథ అయిన ఆంగ్లో ఇండియన్ టీనేజర్ గురించి రాసిన ఆయన మొట్టమొదటి నవలైన 'ద రూమ్ ఆన్ ద రూఫ్' నవలకి, 'జాన్ హవెలిన్ రీస్ మెమోరియల్ అవార్డ్' పొందారు. 'అవర్ ట్రీస్ స్టిల్ గ్రో ఇన్ డెహ్రా' అన్న కథా సంకలనానికి 1992లో సాహిత్య అకాడెమీ అవార్డ్ వచ్చింది.




బాండ్, 1999లో పద్మశ్రీ పొందారు. 2014లో పద్మభూషణ్ వచ్చింది. 'నా బాల్యం వంటరితనంతో గడిచింది కనుక పిల్లల్ని అర్థం చేసుకోవడంలో అది నాకు సహాయపడుతుంది.' అంటారు.

ఇప్పటివరకూ ఆయన– అనేకమైన నవలికలు, 500 పైగా ఉన్న కథలేకాక– కొన్ని వ్యాసాలూ, పద్యాలూ కూడా రాశారు. 'జాతి కానీ మతం కానీ నన్ను భారతీయుడిని చేయలేదు. చరిత్ర నన్ను భారతీయునిగా మార్చింది. కాలక్రమాన్న ముఖ్యమయ్యేది చరిత్రే.' అంటారు బాండ్. ఈయన రచనల ఆధారంగా కొన్ని టివి షోలు, సినిమాలూ వచ్చాయి. వాటిల్లో రెండవది 'బ్లూ అంబ్రెల్లా.' ఈయన రచనల్లో అధికశాతం తను గడిపిన హిమాలయాల కొండల నేపథ్యంతోనే ఉన్నవి.

★★★

11 ఏళ్ళ బిన్యా– అన్న బిజ్జూతో, తల్లితో కలిసి హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో ఉండే చిన్నపల్లెలో ఉంటుంది. చిన్నప్పుడే తండ్రి మరణిస్తాడు. ఉన్న కొంత పొలంలో కాయగూరలు పండించుకుంటుంది కుటుంబం. రెండు ఆవులుంటాయి. వాటి పాలని తమకి తగినంత ఉంచుకుని మిగతాది అమ్ముకుంటారు. తమ కాళ్ళమీద తాము నిలబడ్డం తప్పితే డబ్బు సంపాదన ఉద్దేశ్యమే ఉండదు వారికి.

బిన్యాకి కొండల్లో, లోయల్లో తిరగడం ఇష్టం. చెట్లెక్కుతుంది. చీకటన్నా, అడవులన్నా భయపడదు. ఒక రోజు ఆవుల్ని ఇంటికి తోలుకొస్తుండగా, జాపనీస్ టూరిస్టుల గుంపొకటి ఎదురవుతుంది. వాళ్ళందరూ చక్కగా మంచి బట్టలు వేసుకుని ఉంటారు. వారిలో ఒకరి వద్దనున్న నీలం రంగు కుచ్చుకుచ్చుల గొడుగు, పిల్ల దృష్టిని ఆకట్టుకొంటుంది. అది పువ్వులా, పొడి గోధుమ రంగు కొండ పక్కన విచ్చుకున్న నీలం రంగు పువ్వులా ఉంది. వాళ్ళకేమో బిన్యా మెడలో ఉన్న పులిగోరు పతకం నచ్చుతుంది. కొండ నివాసులు దాన్ని రక్షరేకు అని నమ్ముతారు. గొడుగూ, పతకం చేతులు మారుతాయి. గొడుగు ఎంతో తేలిగ్గా, అందంగా– మెరుస్తూ ఉంటుంది. అదేకాక, అది బిన్యా చేతుల్లో సరిగ్గా ఇముడుతుంది.

ఆ తరువాత పల్లెవాసులందరి సంభాషణలో బిన్యా గొడుగు గురించిన ప్రస్తావన వస్తూనే ఉంటుంది. కనీసం ఒకసారైనా దాన్ని చేతుల్లోకి తీసుకోవాలన్న ఆత్రం అందరికీ మొదలవుతుంది. బిన్నీ చిరునవ్వుతో గొడుగుని అందరి చేతికీ అందిస్తుంటుంది. గొడుగును ముయ్యడానికి ఇష్టపడదు. 'పెద్దల్లా కాక పిల్లలకు నటించే అవసరం పడదు. వాళ్ళు బాహాటంగానే గొడుగును మెచ్చుకుంటుంటారు. అలా చేస్తే, బిన్యా దాన్ని తమ చేతుల్లో పెడుతుందని వాళ్ళకి తెలుసు.

రామ్ భరోసా ఊళ్ళో ఉన్న టెహ్రీ రోడ్డుమీద చిన్న టీ దుకాణం నడుపుతుంటాడు. ఉప్పు పప్పులు, చిరుతిళ్ళు, సాఫ్ట్ డ్రింక్స్, టాఫీలు అమ్ముతాడు. ఆ పేద పల్లెలో అతను డబ్బున్నవాడిగానే లెక్క. అయితే లోభి, అత్యాశ గలవాడు. పిల్లలకి సామాను అప్పిచ్చి వాళ్ళు డబ్బు చెల్లించేటప్పుడు అదనపు ఖర్చు కూడతాడు. వాళ్ళు దాన్ని చెల్లించలేకపోతే, వాళ్ళ దగ్గరున్న విలువైన సామానేదో లాక్కొని తనైనా ఉపయోగించుకుంటాడు లేకపోతే దుకాణంలోనైనా అమ్ముకుంటాడు.

అతను బిన్యా గొడుగును చూసినప్పుడు, ఎట్టి పరిస్థితిలోనైనా దాన్ని స్వంతం చేసుకోవాలనే దురాశ అతనిలో తలెత్తుతుంది. 'ఈ తళుకు బెళుకుల గొడుగు చిన్నపిల్లలు వాడకూడదమ్మా. నాకు ఇచ్చేయి.' అని బిన్నీకి నచ్చచెప్పడానికి ప్రయత్నించినప్పుడు, 'ఇది అమ్మకానికి కాదు.' అంటూ బిన్యా తోసిపుచ్చేస్తుంది.

చుట్టుపక్కలున్న గ్రామంనుండి రాజారామ్ అనే ఒక పిల్లాడిని పనిలో పెట్టుకుంటాడు రామ్ భరోసా. బిన్యా ముళ్ళపందుల యీకలు సేకరించడానికి అడివికి వెళ్ళినప్పుడు– పిల్లాడు దాన్ని దొంగిలించి, దాన్ని రామ్ భరోసాకిస్తాడు. అయితే, బిజ్జూ రాజారామ్‌ని నిలదీసినప్పుడు నిజం చెప్పేస్తాడు. పల్లెవాసులు–తమలో ఒకరైన వ్యక్తి, పేద పిల్ల వద్దున్న నీలపు గొడుగుని దొంగిలించాడన్న సంగతిని జీర్ణించుకోలేకపోతారు. రామ్ భరోసాను వెలి వేస్తారు. అతని దుకాణం నుండి కొనుగోళ్ళు ఆపేసినప్పుడు, రామ భరోసా జీవనాధారానికి పెద్ద దెబ్బ తగులుతుంది. 'నమ్మకస్థుడైన దొంగ' అని అతన్ని పిల్లలు ఏడిపించడం మొదలుపెడతారు.

అతని పరిస్థితి చూడలేకపోయిన బిన్యా, తన గొడుగును అందరిముందూ విర్రవీగుతూ ప్రదర్శించుకున్నందుకు, తన్ని తాను నిందించుకుంటుంది. అతనిలో లాలూచీ ప్రవేశపెట్టినది తనే అనుకుంటుంది. గొడుగుని రామ్ భరోసాకు బహుమతిగా ఇస్తుంది. రామ్ భరోసా తన పొరపాటు గుర్తించి, తన వద్ద ఉన్న ఎలుగుబంటి పంజా ఉన్న పతకాన్ని బిన్యాకి ఇస్తాడు. అది పులిపంజాకన్నా ఎక్కువ అదృష్టకరమైనదని పల్లెవాసుల నమ్మిక. ' చీకటి పడుతున్న కొండల సందుల్లోనుంచి నక్షత్రాల గురించి పాడుకుంటూ బిన్యా ఇంటిదారి పడుతుంది. చెట్లు, నిశ్శబ్దంగా ఆమె పాట వింటుంటాయి. కొండలు సంతోషపడతాయి. పల్లెవారు, తిరిగి రామ్ భరోసా దుకాణానికి రావడం ప్రారంభిస్తారు.

★★★

అందమైన గడ్వాల్ కొండల నేపథ్యం ఉన్న కథ– పల్లె జీవితాలను, పల్లెవాసుల నమ్మకాలను, నిజాయితీని చక్కగా వర్ణిస్తుంది. ఇవ్వడంలోనే ఎక్కువ సంతోషం ఉందని చెప్తూ, శౌర్యం, విముక్తి, నిష్కృతి గురించి మాట్లాడే చిన్న కథ– పిల్లలకోసమే రాసినప్పటికీ పెద్దలకీ నచ్చుతుంది. సరళమైన శైలిలో ఉన్న పుస్తకం, మానవత్వానికి ముఖ్య భాగం అయిన 'దయ' అన్న అంశాన్ని ఒత్తి చెప్తుంది. ఏదీ బోధించే ప్రయత్నం చేయదు.

రూపా పబ్లికేషన్స్ 1980లో పబ్లిష్ చేసిన యీ నవలికని అమర్ చిత్ర కథా పబ్లికేషన్స్, 2012లో కామిక్‌గా మలిచింది. దీని ఆధారంగా, ఇదే పేరుతో విశాల్ భరద్వాజ్ 2005లో సినిమా తీశారు. సినిమాకి, 'నేషనల్ అవార్డ్ ఫర్ బెస్ట్ చిల్డ్రెన్స్ ఫిల్మ్' పురస్కారం అందింది. సినిమా ఇక్కడ చూసే వీలుంది: https://www.netflix.com/title/70075775.




# చోఖేర్ బాలీ

రబీంద్రనాథ్ టాగోర్ (7 మే 1861– 7 ఆగస్ట్ 1941) దేబేంద్రనాథ్ టాగోర్, శారదా దేవిలకు జన్మించారు. టాగోర్- కవి, సంగీతకారులు, చిత్రకారులు, రచయిత. 'గురుదేవ్' అనే పేరుతో ప్రసిద్ధికెక్కినవారు. డల్హౌసీలో చరిత్ర, సంస్కృతం చదువుకున్నారు. గోల్డెన్ టెంపుల్లో వినిపించే- గురుబాణీ, నానక్ బాణీ ఆయన్ని ప్రభావితం చేసినప్పుడు, సిక్కిజం గురించి ఆరు కవితలు రాశారు.

నోబెల్ బహుమతిని అందుకున్న మొట్టమొదటి ఆసియావాసి టాగోర్. ఆయన సంరచనలలోని 'జనగణ మణ', భారతదేశపు జాతీయగీతం అయితే, 'బంగ్లాదేశ్ అమర్ షోనా' ను బంగ్లాదేశ్ ఎన్నుకుంది.

టాగోర్ రచనల్లో, నవల్లకి అతి తక్కువ గుర్తింపు దొరికినప్పటికీ, సత్యజిత్ రే వంటి మహా కళాకారుల వల్ల అవి సినిమాలుగా మలచబడ్డంతో, వాటి మీద పాఠకులకు ఆసక్తి ఏర్పడింది. వాటిల్లో శ్రేష్ఠమైనవి 'చోఖేర్ బాలీ, ఘరె బైరే' అంటారు. ఛోకేర్ బాలీ, బంగ్లాదర్షన్ అనే పత్రికలో 1902 నుంచి 1903 వరకూ సీరియల్‌గా వచ్చిన తరువాత, 1903లో పుస్తకంగా పబ్లిష్ అయింది.

★★★

పందొమ్మిదవ శతాబ్దం: కలకత్తా నివాసి అయిన రాజలక్ష్మి ధనికురాలు. వితంతువు. కొడుకు మహేంద్ర (మోహిన్) అంటే ప్రాణం పెట్టేంత ప్రేమ. వారిద్దరితో పాటు మరో వితంతువైన, రాజలక్ష్మి ఆడపడుచు అన్నపూర్ణ కూడా ఉంటుంది. బిహారీ, మోహిన్‌కు ఆప్తమిత్రుడూ, ఇంచుమించు కుటుంబ సభ్యుడూ. స్నేహితులిద్దరూ మెడిసిన్ చదువుతుంటారు.

అన్నపూర్ణ మోహిన్ కోసం స్నేహితురాలి కూతురైన బినోదిని సంబంధం తెస్తుంది. మోహిన్- పెళ్ళి కూతుర్ని కానీ ఆమె ఫోటో కానీ చూడకుండానే సంబంధం నిరాకరిస్తాడు, రాజలక్ష్మి సమాజంలో పరువు నిలుపుకోవడం కోసం బిహారీని పెళ్ళి చూపులకు వెళ్ళి రమ్మంటుంది. అతనూ ఒప్పుకోడు. బినోదిని ఆ కాలపు ఆడపిల్లల్లా కాక చదువుకున్నది. అందమైనది. కవిత్వం రాస్తుంది, ఇంగ్లీష్ మాట్లాడగలదు. ఆఖరికి, ఆమె వివాహం రాజలక్ష్మి బంధువైన బిపిన్‌తో అయినప్పటికీ- తనకి మోహిన్, బిహారీలనుండి ఎదురయిన తిరస్కారాన్ని మరచిపోదు. పెళ్ళయిన కొన్నాళ్ళకే భర్త మరణిస్తాడు.

టీనేజర్ అయిన ఆశాలతతో బిహారీ పెళ్ళిచూపులు ఏర్పాటు చేసినప్పుడు, అతను ఆమెతో ప్రేమలో పడతాడు. మోహిన్‌కు కూడా ఆశాయే నచ్చి, ఆఖరికి అతనితోనే ఆమె పెళ్ళి అవుతుంది. యువజంట కలిసి ఎక్కువ కాలం గదిలోనే గడపడం, ఆశాకి ఇంటి పనులు రాకపోవడంతో, తాను నిర్లక్ష్యపెట్టబడ్డానని అనుకున్న రాజ్యలక్ష్మికి కోపం వచ్చి, స్వగ్రామానికి వెళ్తుంది.



అక్కడ ఉన్న బినోదినిని రాజ్యలక్ష్మి తనతో పాటు వెనక్కి తెస్తుంది. బినోదిని రాక ఇంటిని తల్లకిందులు చేస్తుంది. ఆమె నాగరికత, ఇంటిని నడిపే సామర్థ్యం, రాజలక్ష్మికి ఆమె చేసే సేవలూ, బినోదినిని ఇంటికి ఒక అత్యవసరమైన భాగంగా చేస్తాయి. తను గడపవలిసిన సంతోషకరమైన జీవితాన్ని ఆశా గడుపుతుండగా చూసి, బినోదిని ఆమె పట్ల ఈర్ష్య పెంచుకుంటుంది. పిరికిదీ, అభద్రతాభావం ఎక్కువా ఉన్న ఆశాతో స్నేహం ఏర్పరచుకుంటుంది. ఆశా ఆమెకు 'ఛోఖేర్ బాలీ' (కంట్లో ఇసుక-అస్తమానం కంటిని నలిపెట్టేది) అన్న పేరు పెడుతుంది. బినోదిని ఆమె ద్వారా మోహిన్‌కు చేరువయి, అతన్ని ప్రలోభపెడుతుంది. అప్పటికే, 'భార్య తన అభిరుచులని పంచుకోలేకపోయిన చదువు రాని పిల్ల.' అన్న నిర్ణయానికి చేరిన మోహిన్, బినోదినితో సంబంధం కల్పించుకుంటాడు. భార్యని పట్టించుకోకుండా, బినోదినితో కలిసి తిరుగుతాడు. అది సహించలేని ఆశా, పుట్టింటికి వెళ్ళిపోతుంది. అయితే, తను అనుకున్నది సాధించిన బినోదిని- తనకి మోహిన్ అవసరం లేదనీ అతన్ని కావాలనుకోవడం కేవలం తన ప్రతీకారం మాత్రమే అని గుర్తిస్తుంది. ఆ ప్రక్రియలో తను-మహేంద్ర, ఆశా జీవితాలనేకాక ఇతరుల జీవితాలను కూడా ఎంతగా అతలాకుతలం చేసిందో గుర్తిస్తుంది. అయినప్పటికీ, ఆ తరువాత కలిగిన పరిణామాలని

ఆపలేకపోతుంది. నిజాయితీ, ఆదర్శాలూ ఉన్న బిహారీతో ప్రేమలో పడి, మోహిన్‌కు కు చెప్తుంది: 'ఒకానొకప్పుడు ఆశాని ప్రేమించావని అనుకున్నావు. అది తప్పు. ఇప్పుడు నన్ను ప్రేమిస్తున్నానని భ్రమ పడుతున్నావు. అదీ తప్పే. నిజానికి నిన్ను నీవే ప్రేమించుకుంటావు.'

ఆశా జీవితంలో సమస్యలు లేవనెత్తినది బినోదినీయే అని గతంలో అనుకున్న బిహారీ, తనకి తెలియకుండానే బినోదినీ పట్ల ఆకర్షితుడవుతాడు. కానీ, అప్పటికే ఆలశ్యం అయిపోతుంది. తను ఎంచుకున్న తప్పుదారులవల్ల బిహారీని పెళ్ళి చేసుకోవడం అసంభవం అని బినోదిని గుర్తిస్తుంది. బిహారీ ఊరు వదులుతాడు. కోల్పోయిన తన ఆత్మగౌరవాన్ని తిరిగి పొందే ప్రయత్నంలో, మహేంద్రతో పాటు బిహారీని వెతకడానికి బినోదిని కూడా ఊళ్ళు తిరుగుతుంది. రాజలక్ష్మి జబ్బుతో మంచం మీద పడి ఉన్నప్పుడు వారి కుటుంబం తిరిగి కలుసుకుంటుంది. బినోదిని వారికి దూరం తొలుగుతుంది.

★★★

సూక్ష్మమైన వివరాలున్న నవల, నిజజీవితంలో కనిపించే పాత్రలను తలపిస్తూ సహజంగా అనిపిస్తుంది. ముద్రణ తరువాత, తను బిహారీనీ బినోదినినీ కలపకపోయినందువల్ల తను, 'రచనని అలా అంతం చేయకుండా ఉంటే బాగుండేదేమో' అన్న నిరుత్సాహాన్ని టాగూర్ వెల్లడించారు.

బ్రిటిష్ రాజ్ బెంగాల్ గురించిన యీ నవల్లో – స్త్రీల చదువు, బాల్య వివాహాల గురించిన ప్రసక్తి ఉంటుంది. పుస్తకం–ఆనాటి కట్టుబాట్లని ధిక్కరించడం వల్ల, ఆధునిక రచనగానే గుర్తించబడింది. బినోదిని పాత్ర ద్వారా సామాజిక నిబంధనలను ప్రశ్నిస్తూ, వితంతువులను తమ హక్కుల నుండి దూరం చేసే సామాజిక నిషేదాలనూ, నియమాలనూ నిలదీస్తారు టాగోర్. నవల– ప్రేమ, స్నేహం, అహం, మోసం గురించినది. ప్రధాన పాత్రయిన బినోదిని మానసిక స్థితిని లోతుగా విశ్లేషించిన టాగోర్, ఏ పాత్రనీ పరిపూర్ణమైనదిగా చూపరు. అలాగని, ఒకే పాత్రకి అన్ని లోపాలూ కూడా ఆపాదించరు.

క్రిష్ణ క్రిప్లానీ దీన్ని ఇంగ్లీషులోకి 'బినోదిని' అన్న పేరుతో 1959లో, అనువదించారు. యీ అనువాదం సాహిత్య అకాడెమీ పురస్కారం గెలుచుకుంది. ఆ తరువాత పుస్తకం అనేకమైన భారతీయ భాషల్లోకీ, కొన్ని విదేశీ భాషల్లోకి కూడా అనువదించబడింది. నవల మీద ఆధారపడిన బెంగాలీ సినిమా, 'నేషనల్ ఫిల్మ్ అవార్డ్ ఫర్ ద బెస్ట్ ఫీచర్ ఫిల్మ్' గెలుచుకుంది.

## A Fine Balance



రోహింటన్ మిస్త్రీ 1952లో బోంబేలో పుట్టారు. అక్కడే యూనివర్సిటీ చదువు పూర్తి చేసి, 1975లో కెనడాకి మారారు. మిస్త్రీ మొదటి నవలైన 'సచ్ ఎ లాంగ్ జర్నీ' ఎన్నో అవార్డులు గెలుచుకుంది. 'ఎ ఫైన్ బాలన్స్' ఆయన రెండవ నవల. 2001లో వింటేజ్ ముద్రించింది. (మొదటి ముద్రణ 1995లో) లాస్ ఏంజెలెస్ టైమ్స్ బుక్ ప్రైజ్ ఇన్ ఫిక్షన్, ద ఇంటర్నేషనల్ IMPAC డుబ్లిన్ అవార్డ్, ఐరిష్ టైమ్స్ ఇంటర్నేషనల్ ఫిక్షన్ ప్రైజ్, గిలర్ ప్రైజ్, కామన్ వెల్త్ రైటర్స్ ప్రైజులనీ గెలుచుకుని– బుకర్ ప్రైజ్ ఫైనలిస్ట్ అయింది. రచయిత మూడవ నవల 'ఫేమిలీ మాటర్స్' 2002 మాన్ బుకర్ ప్రైజుకి లాంగ్ లిస్ట్ అయినది. మిస్త్రీ కథల సంకలనం, 'టేల్స్ ఫ్రమ్ ఫిరోజ్షా బాగ్' 1987లో పబ్లిష్ అయింది.

★★★




అది 1975. 'ఎ ఫైన్ బాలన్స్' పేరులేని, సముద్రం ఉండే భారతదేశపు పట్టణపు నేపధ్యంతో ఉన్న నవల. 17 ఏళ్ళ ఈశ్వర్ దర్జీ, బాబాయి ఓం ప్రకాశ్– 'చమార్' అన్న అంటరాని కులానికి చెందినవారు. ఇద్దరికీ కుట్టుపని వచ్చు. పట్టణానికి వెళ్ళి తమ అదృష్టాన్ని పరీక్షించుకుందామనుకుంటారు. 42 ఏళ్ళ దీనా ష్రోఫ్, ధనిక పార్సీ కుటుంబానికి చెందిన స్త్రీ. తండ్రి డాక్టర్. ఆయన మరణం తరువాత కాలేజీకెళ్ళాలనుకున్న దీనా కల అంతమై, అన్న నుస్వాన్‌తో ఉంటుంది. అన్నా, వదినా ఆమెను నౌకర్లా చూడ్డం వల్ల ఆత్మ గౌరవం మెండుగా ఉన్న దీనా వారిని తప్పించుకునే

క్రమంలో, రుస్తమ్‌ను పెళ్ళి చేసుకుంటుంది. మూడేళ్ళ తరువాత అతను ఆక్సిడెంట్లో చనిపోతాడు. దీనా అద్భుతమైన ఎంబ్రాయిడరీ చేస్తుంది. కాకపోతే, ఏళ్ళకొద్దీ చేసిన ఆ కుట్టుపని వల్ల కంటి చూపు మందగిల్లుతుంది. కాలేజీ విద్యార్థి అయిన మానెక్, దీనా ఇంట్లో పేయింగ్ గెస్టుగా ఉంటాడు.

ఈశ్వర్, ఓం –దీనా ఇంటికి వెళ్తారు. రెడీమేడ్ బట్టలమ్మే మిసస్ గుప్తా, దీనాకు కాంట్రాక్ట్ కుట్టుపని ఇప్పించినప్పుడు ఆమె దాన్ని ఈశ్వర్, ఓంలకు అప్పగిస్తుంది. బతుకుతెరువు దొరికిన వారిద్దరూ చిన్న గుడిశె అద్దెకి తీసుకుంటారు.

సంవత్సరం పాటు యీ ఏర్పాట్లు సజావుగానే సాగుతాయి., 'సానిటైజేషన్' పేరుతో టెయిలర్లు ఉండే ప్రాంతాన్ని కూలదోస్తుంది ప్రభుత్వం. అప్పుడు వాళ్ళిద్దరూ పనికి రానప్పుడు ఏమిటి చేయాలో తోచని దీనాకి కుట్టడంలో మానెక్ సహాయం చేస్తాడు. టెయిలర్లు తిరిగి వచ్చిన తరువాత వారు మళ్ళీ రారేమోనన్న భయం పట్టుకున్న దీనా, వాళ్ళని తన వరాండాలోనే ఉండమంటుంది. మొదట ఒకరిమీద మరొకరికి నమ్మకం లేకపోయిన ఆ నలుగురూ, ఒకరిమీద మరొకరు ఆధారపడే స్థాయికి వస్తారు. వారు స్థానిక గూండాలనుంచి ఎదురుకునే సమస్యలని బెగ్గర్ మాస్టర్ అనే వ్యక్తి పరిష్కరిస్తూ ఉంటాడు.

ఓం, ఈశ్వర్ తమ ఊరికి వెళ్తారు. ఓం కోసం సంబంధం చూడ్డం ప్రారంభిస్తాడు ఈశ్వర్. ఊళ్ళో వారి కుటుంబంతో శత్రుత్వం ఉన్న ఠాకుర్ ధరామ్సీ ఇతరుల మద్దతుతో ఇద్దరినీ బలవంతంగా ఫేమిలీ ప్లానింగ్ సెంటరుకి తీసుకెళ్ళి, ఆపరేషన్ చేయించేస్తాడు. దాని ఫలితంగా ఈశ్వర్‌కి ఇన్ఫెక్షన్ వచ్చి, కాళ్ళు పోగొట్టుకుంటాడు. మానెక్ దుబైలో మంచి ఉద్యోగం సంపాదించుకుని వెళ్ళిపోతాడు. దీనా వంటరిదైపోతుంది. ఇంటి యజమాని అద్దె పెంచడంతో మళ్ళీ అన్న ఇంటికి వెళ్తుంది.

ఎనిమిదేళ్ళ తరువాత, 1984లో– నవల్లో అసలు పేరు ఉండని ప్రధానమంత్రి ఎమెర్జెన్సీ ప్రకటించినప్పుడు– మానెక్ తండ్రి అంతిమ క్రియలకోసం దుబైనుండి తిరిగి వస్తాడు. దొమ్మీలూ, సిక్కుల ఊచకోతనీ చూస్తాడు. కట్నాలు ఇవ్వలేకపోవడం వల్ల అతనికి తెలిసిన వ్యక్తి కూతుళ్ళిద్దరూ ఉరి వేసుకుంటారు. ఇది మానెక్‌ను మరింత కుంగదీస్తుంది.

అతను దీనాని కలుసుకోడానికి వెళ్ళినప్పుడు– ఓం, ఈశ్వర్ ముష్టెత్తుకుంటున్నారని ఆమె చెప్తుంది. మానెక్ తిరిగి వెళ్తున్నప్పుడు వాళ్ళిద్దరూ వీధిలోనే కనిపిస్తారు. వారు. 'సలామ్' అని అంటున్నప్పటికీ, వాళ్ళ మురికి రూపాలని చూసి అతనికి మాట రాకపోవడం వల్ల, వాళ్ళని పలకరించడు. అతను తమని గుర్తించలేదని ఇద్దరూ అనుకుంటారు.

లోకంలో ఇంకే ఆశా మిగల్లేదనుకొన్న మానెక్, పక్కనే ఉన్న రైల్వే స్టేషన్‌కు వెళ్ళి, కదులుతున్న రైలు కింద తల పెట్టేస్తాడు. ఓం, ఈశ్వర్ ఇంకా దీనా స్నేహితులేననీ, తను వాళ్ళను చూసినప్పుడు ఇద్దరూ ఆమె ఇంటికే రాబోతూ ఉన్నారనీ, అప్పుడప్పుడూ దీనా వాళ్ళకి భోజనాలు పెడుతుందనీ అతనికి తెలియదు. అతను చనిపోయాడని వాళ్ళకీ తెలియక, 'మానెక్ ఎంత మారిపోయాడో కదా!' అంటూ చర్చించుకుంటారు. మళ్ళీ వస్తామని వారు సెలవు తీసుకోగానే– అన్నా వదినా వచ్చేలోగా ఆమె వాళ్ళు తిన్న కంచాలని తీసేస్తుంది.

నవలంతటా కనిపించేవి అసంభావ్యమైన స్నేహాలు. రచయిత ప్రతీ పాత్రనీ కులం, పరిస్థితులతో నిర్వచిస్తారు. మానెక్ విచారం అతని ప్రాణం తీసినప్పటికీ– దీనా, టెయిలర్లూ– ఆశ, నిరాశల మధ్య ఒక 'నాణ్యమైన సమతుల్యత'ను నిలబెట్టుకోవడం నేర్చుకుని, ముందుకి సాగుతారు. స్నేహం నిలుపుకుంటారు. మానెక్‌కే కనుక వీధిలో స్నేహితులిద్దరితో మాట్లాడే ధైర్యం ఉండి ఉంటే? లేక ఇంకొద్దిసేపు దీనా ఇంట్లోనే ఉండి ఉంటే! బహుశా నిస్పృహకి లొంగి ఆత్మహత్య చేసుకునేవాడు కాదేమో! ఇటువంటి ఆశావాహమైన సందేహాలు కలుగుతాయి. పట్టణం బోంబే, ప్రధానమంత్రి ఇందిరా గాంధీ అని గ్రహించవల్సిన బాధ్యత పాఠకులదే. అమె పాలనలో వచ్చిన అనేకమైన మార్పుల గురించినది పుస్తకం. రాజకీయ నవల మాత్రం కాదు. నిస్సహాయులైన సగటు మనుష్యుల జీవితాలను, వారి ఆశలను, ఆశాభంగాన్నీ చూపేది.

## *Heartburn*



నోరా ఇఫ్రోన్ (మే 19, 1941 – జూన్ 26, 2012) అమెరికన్ జర్నలిస్ట్, రచయిత్రి, సినీ నిర్మాత. న్యూయార్క్ పట్టణంలో యూదుల కుటుంబంలో జన్మించారు. రొమాంటిక్ కామెడీ సినిమాలు ఆమెకు పేరు తెచ్చి పెట్టాయి. 'సిల్క్‌వుడ్' (1983) 'వెన్ హారీ మెట్ సేలీ' (1989) 'స్లీప్‌లెస్ ఇన్ సియాటిల్' (1993) సినిమాలకని 'ఎకేడెమీ అవార్డ్ ఫర్ బెస్ట్ రైటింగ్' కోసం నామినేట్ చేయబడ్డారు. రెండవ సినిమాకి 'బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే '(BAFTA) అవార్డ్ గెలుచుకున్నారు. 1998లో– ఇఫ్రోన్, 'యు హేవ్ గాట్ మెయిల్' ని విడుదల చేశారు. యీ సినిమాకి దర్శకురాలూ స్క్రిప్ట్ రైటరూ కూడా ఆమే. ఇఫ్రోన్ ఆఖరి సినిమా జూలియా & జూలియా (2009) . 2013లో 'లక్కీ గై' నాటకానికని 'పోస్థ్యుమస్ టోనీ అవార్డ్ నామినేషన్ ఫర్ ద బెస్ట్ ప్లే" పొందారు. స్నేహితుడైన వూడీ అలెన్ సినిమాలు 'ఇన్ క్రైమ్స్ అండ్ మిస్డీమెనర్స్(1989) మరియు 'హస్బండ్స్ అండ్ వైవ్స్' (1992) లో చిన్న పాత్రలు పోషించారు.

తన రొమాంటిక్ కామెడీలు అంత సీరియస్గా తీసుకోనవసరం లేని కల్పిత కథలు మాత్రమే అన్న రచయిత్రి స్వీయకథే 'హార్ట్‌బర్న్.' 1979లో వాషింగ్టన్ పోస్ట్ ఇన్వెస్టిగేటివ్ రిపోర్టర్ అయిన కార్ల్ బర్న్‌స్టైన్‌తో జరిగిన ఇఫ్రోన్ రెండవ వివాహంలో జేకబ్ పుట్టాడు. రెండో కొడుకైన కుమారుడైన మాక్స్‌ను గర్భంలో మోస్తున్నప్పుడు, ఆ భార్యాభర్తలకిద్దరికీ స్నేహితురాలూ, బ్రిటిష్ జర్నలిస్టూ అయిన వివాహిత స్త్రీ 'మార్గరెట్ జే' తో సంబంధం పెట్టుకుంటాడు బర్న్‌స్టైన్. ఇఫ్రోన్ జీవితకాలపు ఆ దశ ఆధారంగా వచ్చిన యీ నవలను నోఫ్ 1983 లో పబ్లిష్ చేసింది. దీని పైన, ఇదే పేరుతో 1986లో వచ్చిన సినిమాలో– జాక్ నికల్సన్, మెరిల్ స్ట్రీప్ నటించారు.

ఇఫ్రోన్ 2012లో జూన్ 26న, న్యుమోనియా వల్ల మరణించారు.

★★




హార్ట్ బర్న్ నవలిక 38 ఏళ్ళ రేచెల్ సామ్‌స్టేగ్ జీవితపు ఆరువారాలమీద ఆధారపడినది. ఆమె వంట పుస్తకాల రచయిత్రి. రేచెల్ థెరపిస్ట్ చెప్పినట్టు 'ఆమెకి ఎంత బాధనిపించినా జోక్స్ వేస్తుంది.' మొదటి పెళ్ళి విడాకులకు దారి తీస్తుంది. మార్క్ ఫీల్డ్‌మాన్ వాషింటన్లో న్యూస్‌పేపర్ కాలమిస్ట్. 'మార్క్‌కు విరుద్ధంగా సాక్ష్యాలున్నప్పటికీ అతన్ని పెళ్ళి చేసుకున్నాను. పెళ్ళి కొనసాగదనీ, ప్రేమ చనిపోతుందనీ నమ్మి కూడా. ఇలా చేయడంలో మోహం మటుమాయం అవుతుందని తెలుసు. కేవలం ఒక నిరాశావాది మాత్రమే అవగల కాల్పనిక వ్యక్తినయాను.' అన్న రేచెల్‌కి మార్క్ ద్వారా కలిగిన రెండేళ్ళ కొడుకుంటాడు.

'వెనీషియన్ బ్లైండ్స్‌తో కూడా శృంగారం జరపగల' తన భర్త, వేరే స్త్రీ ప్రేమలో పడ్డాడని రెండోసారి గర్భవతి అయిన రేచెల్‌కు తెలుస్తుంది. 'మార్కుకూ, పొడుగైన థెల్మా రైస్‌కీ సంబంధం ఉంది. ఆమె మెడ చెయ్యంత పొడుగైతే, ఆమె ముక్కు బొటనవేలంత. ఆమె కాళ్ళను చూడాలి. ఇక ఆ వికారమైన పాదాల గురించి చెప్పనవసరమే లేదు.' అన్న ఆలోచనలు వచ్చిన రేచెల్, దాని గురించి భర్తను నిలదీస్తుంది. 'నీవు సాధించే గయ్యాళివి. థెల్మా నీ కన్నా ఎన్నో రెట్లు మెరుగు' అంటూ రెబెకా మనస్సు గాయపరుస్తాడతను. కొడుక్కోసమూ, పుట్టబోయే బిడ్డకోసమూ రేచెల్‌ను విడిచిపెట్టక వారితోనే కలిసి ఉంటానంటాడు.

'వేరే ఏదైనా చోటుకి వెళ్ళి ఆలోచించుకుంటే స్పష్టత వస్తుంది.' అనుకున్న రేచెల్, కొడుకును తీసుకుని తండ్రి ఉండే న్యూయార్క్ వెళ్తుంది. అక్కడ తన పాత థెరపీ గ్రూపుని కలుసుకోడానికి వెళ్ళినప్పుడు, ఒక ముసుగు మనిషి కత్తితో బెదిరించి అందరి వద్దనున్న నగలూ, డబ్బూ తీసుకు పారిపోతాడు. కొడుకు పుట్టినప్పుడు మార్క్ తనకి బహూకరించిన ఉంగరం కూడా వాటిల్లో ఉన్నప్పుడు, 'ఇది దేనికైనా సంకేతమేమో!' అన్న సందేహం కలుగుతుందామెకు. ఆ

గ్రూపులో ఇద్దరికి ఆ దొంగ ఆకర్షణీయంగా అనిపిస్తాడు.

కొన్నేళ్ళ కిందటే రేచెల్ తల్లి, అంత వయస్సులో 'మెల్ ' అనే వ్యక్తితో మెక్సికో పారిపోయి అతన్ని పెళ్ళి చేసుకునుంటుంది. "మెల్ నిజాయితీగానే తను దేవుడిననుకుంటాడు. అయితే, 'నా మొదటి భర్త ఛార్లీ వొకసారి అన్నట్టుగా" దేవుని గురించి మనకి తెలిసినదేమైనా ఉందంటే, దేవుని పేరు 'మెల్" అన్నది మాత్రం అయి ఉండదు అన్నది." అంటుంది రేచెల్.

ఆమెను ఇంటికి పిలుచుకు రావడానికి మార్క్ న్యూయార్క్ వచ్చి, తనింక థెల్మాను కలుసుకోనని మాటిచ్చిన తరువాత కొడుకుతో పాటు తిరిగి వాషింగ్టన్ వస్తుంది. 'నాకు కావల్సినదేమిటి!' అని తన్ని తానే ప్రశ్నించుకోవడం మానదు. తను చూసిన ప్రతీ మగవాడితో తనకి పెళ్ళయిందని ఊహించుకుంటుండటం వల్ల, ఆమెకి ఆత్మగౌరవం తక్కువన్న సంగతి పాఠకులకు తెలుస్తుంది. తన వివాహబంధాన్ని నిలబెట్టుకోవడం కోసం తన స్నేహితులతో తన పరిస్థితి గురించి మాట్లాడుతూ, వారితో తన వైవాహిక జీవితాన్ని పోల్చి చూసుకుంటూ, వారి సలహాలు అడుగుతుంది.

రెండో కొడుకు పుట్టిన తరువాత– తను హాస్పిటల్లో ఉన్నప్పుడు– మార్క్ థెల్మాకు నెక్లేస్ కొనిచ్చాడని తెలుసుకుంటుంది. భర్త తనకు దూరం అవడానికి కారణం, తను వంటలు చేస్తూ సమయం గడపడమే అన్న నిర్ణయానికి వస్తుంది: 'నాకు వంటంటే ప్రేమ. నేను తనను ప్రేమిస్తున్నాను అని మార్క్‌కి తెలియపరచడానికి అదే దారి అయింది.' అనుకుంటుంది.

పుస్తకమంతటా– తను ఎటువంటి స్త్రీని కానని భర్త అన్నాడో అలాంటి మనిషే అవడానికి ప్రయత్నిస్తుంది. అయితే ఆఖరికి– తనెప్పుడూ అలాగే ఉన్నాననీ, మారినది మార్కే అని అర్థం చేసుకుంటుంది. ఒక డిన్నర్ పార్టీలో తమమధ్య ఉన్న సంబంధం మరెప్పుడూ సరి అవదని సూచిస్తూ, మార్క్ మొహంమీద కేకు కొట్టి, పులుముతుంది. ఇతరులు తననుంచి ఆశించే వ్యక్తిత్వం కాకుండా, తను తనలాగే ఉండాలనుకుని అతన్ని వదిలిపెడుతుంది.

★★★

స్త్రీ పురుష సంబంధాలు, మోసం, అపరాధభావం తనపై తానే జాలి పడ్డం గురించిన పుస్తకమంతటా, రేచెల్ వంటకాల వివరాలూ, నోరు తిరగని దినుసులూ, ఆమె చేసిన టివి కుకరీ షోలూ ఉంటాయి. దుఃఖకరమైన నొప్పిని చూపే సంఘటనలను కూడా హాస్యంగా వర్ణించడం వల్ల చదవాలనిపించే నవల. 180 పేజీలు కూడా ఉండని యీ నవలిక తన రెండవ భర్త కార్ల్ బర్‌న్‌స్టీన్‌తో తను విడిపోయిన వృత్తాంతమే అని ఇఫ్రోన్ అంగీకరించారు. దీని ఆధారంగా వచ్చిన సినిమా ఇక్కడ చూసే వీలుంది:

http://m4ufree.live/watch-yyad-heartburn-1986-movie-online-free-m4ufree.html

## *Not to Disturb*



డేమ్ మ్యూరియల్ సారా స్పార్క్ (ఫెబ్రవరీ 1918 – ఏప్రిల్ 2006) స్కాటిష్ రచయిత్రి. ఎడిన్ బర్గ్‌లో జన్మించారు. స్కాట్లాండ్లో చదువుకున్నారు. 1947లో 'పోయెట్రీ రెవ్యూ' పత్రికకు ఎడిటర్‌గా పని చేయడం ప్రారంభించినప్పుడు, ఆ కాలపు మొట్టమొదటి స్త్రీ ఎడిటర్ ఆమె.

స్పార్క్స్ తన జీవితకాలంలో ఎనిమిది గౌరవార్థక డాక్టరేట్లు పొందారు. ఆమె– నవలలూ, కవిత్వం, పిల్లల పుస్తకాలు, రేడియో నాటకాలు, బయోగ్రఫీలూ రాశారు. స్పార్క్స్ మొట్టమొదటి నవల 'ది కంఫర్టర్స్' 1957లో అచ్చయింది. 2008లో '1945 నుంచీ వచ్చిన అతి గొప్ప బ్రిటిష్ రైటర్స్'లో

ఎనిమిదవవారిగా లెక్కించబడ్డారు. స్పార్క్స్ రాసిన 'లాస్ట్ మాన్' నవలకు ఆమె మరణానంతరం షార్ట్‌లిస్టుకి ఎంపిక కాబడ్డారు. స్పార్క్స్ 98 పేజీల 'నాట్ టు బి డిస్టర్బ్డ్' నవలిక 1971లో అచ్చయింది. ప్రచురణ కర్త పెంగ్యున్ బుక్స్ లిమిటెడ్. న్యూ డైరెక్షన్స్ 2010 లో పున:ముద్రించింది.

★★★




జినీవాలో క్లోప్‌స్టాక్ బ్యారన్, బ్యారొనెస్ తమ కోట లైబ్రరీలో– యువకుడైన తమ సెక్రెటరీ పసీయా (మిస్టర్ ఫెయిర్ లాక్స్) తో పాటున్నప్పుడు, ముగ్గురి మధ్యా వాదన సాగుతుంటుంది. బ్యారొనెస్ పసీయాతో ప్రేమలో పడి ఉంటుంది. పసీయా బ్యారన్‌తో.

మార్మికుడూ, కుటిలుడూ అయిన బట్లర్ లిస్టర్‌తో తమనెవరూ డిస్టర్బ్ చేయవద్దని బ్యారన్ చెప్పి 'నాట్ టు డిస్టర్బ్' అనే బోర్డ్ తలుపు బయట వేళ్ళాడదీసి, గదికి గొళ్ళెం పెడతాడు. బ్యారన్ మిగతా ఇద్దరినీ తుపాకీతో కాల్చిన తరువాత తన్ని తాను కాల్చుకుంటాడనీ, ఆ ముగ్గురిలో ఎవరూ బతికి బయటపడరనీ లిస్టర్‌కు అర్థం అయి– మేడ కింద, వెనుకవైపుండే మిగతా నౌకర్లకు సంగతి చెప్తాడు. వారందరూ ఇంటి పనుల్లో నిపుణులే. అనివార్యం అయిన ఆ మూడు మరణాలకోసం ఎదురు చూస్తుంటారు. 'యీ శాస్వతమైన త్రిభుజ వృత్తం, చుట్టూ తిరిగి వచ్చింది.' అని ఒక సేవకుడు అంటాడు. బ్యారన్ సహోదరుడు మతిలేనివాడు. అతను అటకమిద్దె మీద ఉంటాడు.

తమ సాయంత్రాన్నీ, తమ భవిష్యత్తునీ యోచించి పెట్టుకుంటారు సేవకులు. బ్యారొనెస్ నగ్నంగా ఉన్నప్పుడు, ముగ్గురూ 'లైంగిక క్రీడల్లో లీనమై ఉన్న అసంఖ్యాకమైన సయ్యాటల' గురించి మాట్లాడుకునే మేడ కింద నివాసులూ ఆ చర్యలకు అతీతం కారు. కాకపోతే, వారు తమ కార్యకలాపాల పట్ల తగుమాత్రం జాగ్రత్తలు మట్టుకు తీసుకుంటారు. వారు  యజమానుల అశ్లీల వివరాల గురించిన తమ, తమ మాటలను– వేర్వేరుగా ప్రెస్ రిలీసులకూ, రేడియో/టివి ఇంటర్వ్యూలకూ ఇచ్చేటందుకు సిద్ధపడి, ఆ ఇంటర్వ్యూలకి ప్రతిఫలంగా స్విస్ బ్యాంకుల్లో జమా అయే డబ్బు కోసం కాంట్రాక్టులు మీద సంతకాలు చేస్తారు. దుర్ఘటన జరిగేది తెల్లారుఝామున మూడునుండి ఆరు వరకని అంచనా వేస్తారు కనుక పోలీసులూ, కెమెరాలూ రావడానికి మర్నాటి వరకూ సమయం ఉంటుందని తెలుసు.

'పొద్దున్న ఎనిమిదింటికి మనం పోలీసులని పిలిచి, జర్నలిస్టులకి ఇంటర్వ్యూ ఇద్దాం. మనం యజమానుల లైంగిక సంబంధాల గురించి మనం మాట్లాడకూడదు. అది వారి చేష్టలను అవమానపరచడమే. వారి వృత్తాలలో అది హెచ్చు మోతాదులోనే ఉంటుంది. వారు దాని కోసమే చనిపోతారు. బహుసా ఇప్పటికే చనిపోయుండి ఉంటారు.' అని లిస్టర్ వారిని హెచ్చరిస్తాడు.' హత్యానేరం పూర్తయిందని నిర్ధారించుకోడానికి సేవకులు వేచి చూస్తున్నప్పుడు, వారి నిజ స్వరూపాలు బయటపడ్డం మొదలువుతుంది.

'నిద్ర వస్తోంది. ఒక కునుకు తీసి లేస్తాను.' అన్న పనమ్మాయితో, 'వద్దు. పోలీసులు వచ్చేటప్పటికల్లా మనం దుఃఖం, ఆశ్చర్యంలో మునిగి ఉన్నట్టుగా కనిపించాలి. నిద్రలేమి మొహాలపై అటువంటి ప్రభావాన్నే కనపరుస్తుందని లిస్టర్ చెప్పాడు.' అంటూ, పాబ్లో అనే మరో నౌకరు మందలిస్తాడు. గర్భిణీగా ఉన్న వంటమ్మాయి ఇలీయాస్‌కు ఇంచుమించు నౌకర్లందరితో లైంగిక సంబంధం ఉండటంతో, పుట్టబోయే బిడ్డకి తండ్రెవరో కూడా ఆమెకే తెలియదు. బ్యారన్ సహోదరునితో ఆమె పెళ్ళి జరిపించేస్తే అతనికి సంక్రమించే ఆస్థిమీద తామే రాజ్యం ఏలవచ్చని అభిప్రాయపడిన మిగతావారు, యీ లోపల కోటకు వచ్చిన పాస్టర్‌ను పట్టుకుని ఆమెకు ఆ పిచ్చివాడితో పెళ్ళి జరిపిస్తారు. మతిస్థిమితం లేని అతను అప్పటికప్పుడే తమ వివాహం అసంపూర్ణం గావించమని పట్టుపడతాడు. పుస్తకపు అధిక భాగంలో బ్యారన్, బ్యారనెస్, సెక్రెటరీ బతికే ఉన్నప్పటికీ, పనివారు వారి గురించి ముందే భూతకాలంలో మాట్లాడ్డం మొదలెడతారు. ఆ ముగ్గురూ మరణించే తీరుతారన్న నమ్మకం వారిలో అంత లోతుగా పాతుకుపోతుంది. భీకరమైన ఉరుములూ, మెరుపులూ, గాలివాన మధ్య– కిటికీ రెక్కలూ, తలుపులూ కొట్టుకోవడంవల్ల తాము తుపాకీ గుళ్ళ శబ్దం వినలేకపోయామని మర్నాడు పోలీసులు వచ్చినప్పుడు

చెప్తామన్న సమిష్టి నిర్ణయానికి చేరతారందరూ.
మరుసటి రోజు ప్రెస్ వచ్చినప్పుడు 'కేమెరాలు ఫ్లాష్ అవుతాయి. ఆకలి గొన్న యాత్రికులకు హాట్ డాగ్ ఇచ్చినట్టుగా వారి నోళ్ళముందు మైక్రోఫోన్లు ప్రత్యక్ష్యమౌతాయి.' నౌకర్లందరూ నేరం జరిగిందో, లేదో తెలుసుకోకుండానే ఫోటోలకోసం నిలుచుంటారు. పోలీసులు వచ్చి లైబ్రరీ తలుపు పగలగొట్టిన తరువాత– బ్యారన్ భార్యని కాల్చివేశాడనీ, సెక్రెటరీ ఆత్మహత్య చేసుకున్నాడనీ తెలుస్తుంది. నౌకర్ల స్టేట్‌మెంట్లు తీసుకుని కొత్త బ్యారొనెస్ ఇలీయాస్ అనీ రాసుకుని వారు నిష్క్రమిస్తారు. నవలికలో పోలీసుల పాత్ర మూడు పేజీలు కూడా ఉండదు.

★★★

సంభవించబోయే మరణాల గురించి నౌకర్లకు తెలిసున్నప్పటికీ ఒక్కరూ అడ్డుకోడానికి ప్రయత్నించరన్న సంగతిని రచయిత్రి ఎగతాళి, నిందాస్తుతి ఉపయోగించి చెప్తారు. తమ ఆజ్ఞలకింకా విలువుందని అనుకునే యజమానుల వ్యక్తిగత దురవస్థను పరిచారకులు బాహాటంగా బహిర్గతపరచడం వంటి కపటమైన సంబంధాలని చూపిస్తారు రచయిత్రి. వచనం చమత్కారమైన సంభాషణలతో సరదాగా సాగుతుంది. కథ చోద్యమైనదీ, భయానకమైనదీ అయినప్పటికీ సంచలనాత్మక వినోదం కలిగిస్తుంది. ఏ ఉపోద్ఘాతమూ లేని కథనంలో ఎవరు ఎవరితో ఏమిటి చెప్తున్నారో ఒక పట్టాన అర్థం కాదు.

## *That Long Silence*



*శశి దేశ్‌పాండే– పేరు పొందిన కన్నడ నాటక రచయిత, సంస్కృత పండితులయిన శ్రీరంగ వారి కుమార్తె. 1936లో ధార్వాడ్‌లో జన్మించారు. పదిహేనేళ్ళ వయస్సులో బోంబే వెళ్ళి ఇకొనిమిక్స్ చదివారు. ఆ తరువాత బెంగలూర్‌లో, లా పట్టా పొందారు. 1970లో శశి మొదట కథలు రాయడంతో ప్రారంభించారు. పిల్లలకోసం నాలుగు కథాసంకలనాలు రాశారు. ఏడు నవళ్ళు రాశారు. వాటిల్లో ఒకటైన 'దట్ లాంగ్ సైలెన్స్' పుస్తకానికి 1990లో సాహిత్య అకాడెమీ పురస్కారం ప్రదానం అయింది. 2009లో శశి పద్మశ్రీ పొందారు. ఆమె– సంస్కృతం, మరాఠీ, కన్నడం ధారాళంగా మాట్లాడగలరు. ఆమె పుస్తకాలు– కుటుంబాల్లోనూ, సమాజంలోనూ తమ చోటు కోసం పోరాడే చదువుకున్న మధ్య/ఎగువ మధ్య తరగతి స్త్రీలని ఆధారంగా చేసుకుని రాసినవి.*




*196 పేజీల 'దట్ లాంగ్ సైలెన్స్'ను పెంగ్విన్ బుక్స్ జనవరి ఒకటిన, 1989లో ప్రచురించింది.*

★★★

జయ చురుకైన, హుషారైన పిల్ల. తెలివైనది. ఉమ్మడి కుటుంబంలో పుట్టినది. 'సభ్యతగా ఉండి ఇంటిపన్లు, అందరినీ ఆదరించే అలవాటూ నేర్చుకుంటే, అత్తగారింట్లో సర్దుకుపోవడం సులభం...సీత రాముడికి వనవాసంతో తోడున్నట్టుగా... భర్తను మరణంనుండి విడిపించిన సావిత్రిలా... భర్త కష్టాలను ద్రౌపతి నిగ్రహంగా పంచుకున్నట్టు.' ఉండమని నాయనమ్మ సలహా ఇస్తుంటుంది.

జయ బాగా చదువుకుంటుంది. కాలములూ, కథలూ రాస్తుంటుంది. కుటుంబ స్నేహితుల కొడుకైన మోహన్‌తో పెళ్ళవుతుంది. అతనికి మంచి ఉద్యోగం, సామాజిక హోదా ఉంటాయి. తమిద్దరికీ ఒకరిని మరొకరిని అర్థం చేసుకోవడం రాదని మొదట్లోనే గ్రహిస్తుంది జయ. అన్యోన్యత లేని తమ వైవాహిక జీవితం అస్థిరంగా, దుర్భరంగా గడుస్తుందని తెలుసుకోడానికి ఎంతోకాలం పట్టదు.

మోహన్‌కి బొంబాయి బదిలీ అవుతుంది. అప్పటికే ఆమె భారతదేశపు మధ్యతరగతి స్త్రీల కష్టాలమీద రాసిన సాహిత్యానికి–పేరు రావడం ప్రారంభిస్తుంది. కొత్త పట్టణానికి దంపతులు త్వరలోనే అలవాటు పడతారు. రాహుల్, రతి పుడతారు. జయ జీవితం– భర్తా పిల్లల చుట్టూనే తిరుగుతూ ఉండి, దాన్లోనే ఓదార్పు పొందుతుంది. అయితే, అదెంత కాలమూ సాగదు. ఆఫీస్లో దొంగ సంతకాల కేసులో తన స్నేహితుడైన అగర్వాల్‌తో పాటు మోహన్ ఇరుక్కుంటాడు. భార్యా పిల్లలకోసమే లంచం తీసుకున్నానని మోహన్ అన్నప్పుడు జయాకి మొట్టమొదటిసారి కోపం వస్తుంది.

'అసలు తను ఏ పాత్రా పోషించకపోయినప్పటికీ తనూ ఆ నేరంలో భాగస్థురాలేనన్న భావనే ఆమెకు జుగుప్సాకరంగా అనిపిస్తుంది.' మోహన్ జయా కలిసి చర్చ్ గేట్లో ఉన్న తమ ఆధునిక ఇంటిని వదిలి, స్నేహితుల సలహాతో దాదర్‌లో ఉన్న ఒక ఇరుకైన ఫ్లాటుకి మారతారు.

జయా తనకి సుపరిచితమైన వాతావరణాన్నుండి దూరం అవుతుంది. భర్త పేరు ప్రతిష్టలు కోల్పోతుంటాడు. వారి కుటుంబ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. అప్పటికే, మెల్లమెల్లగా తన రాతలను వదిలేస్తున్న జయను గతం వెంటాడడం మొదలెడుతుంది. 17 ఏళ్ళ వైవాహిక జీవితంలో– భర్తకీ తనకి ఉన్న తేడాలు, మనస్పర్థలు, తన టీనేజీ పిల్లల వల్ల కలిగిన నిస్పృహ– అన్నీ బయటపడ్డం ప్రారంభిస్తాయి. ఒకసారి తన పొరిగింటి కామత్‌కు చెప్తుంది: 'ఏ స్త్రీకీ కూడా కోపం రాకూడదు. కోపంగా ఉండే యువతి గురించి ఎప్పుడైనా విన్నావా? ఊహూ, లేదే! ఆమె మానసిక రోగి అయుండొచ్చు, వెర్రిదవొచ్చు. ఆశాభంగం కలిగినదయి ఉండవచ్చు. కోపం మాత్రం తెచ్చుకోలేదు.'

తను రాయలేకపోవడం, తన ప్రమేయం లేకుండానే పెళ్ళి తరువాత తన పేరు సుహాసినిగా అత్తగారి కుటుంబం మార్చడంవంటి సంఘటనలన్నిటినీ భూతద్దంతో చూస్తూ, తన జీవితాన్ని తన చేతులనుండి ఎప్పుడు చేజార్చుకుందో కూడా అర్థం చేసుకోలేకపోతుంది. యీ లోపల ఆర్థిక పరిస్థితి కూడా దిగజారుతుంటుంది. అన్నేళ్ళ సహచర్యంలో కూడా మోహన్‌కు జయ అభిప్రాయం తెలుసుకునే అలవాటుండదు. అయితే, తన మీద ఆఫీసులో ఎంక్వైరీ పెట్టినప్పుడు, అతనికి భార్య ఓదార్పు, సహానుభూతి కావాలనిపిస్తాయి. తన రాతలు కొనసాగిస్తూ ఇంటిని పోషించమంటాడు జయను. ఏమిటి చెప్పాలో అర్థం కాని భార్య మౌనం వహించి, భర్త బాధను పంచుకోలేకపోతుంది. వారి సంబంధం మరింత క్షీణించి ఇద్దరి మధ్యలో దూరం ఎక్కువవుతుంది. మోహన్ తన ఆత్మవిశ్వాసాన్నీ. ఉద్యోగాన్ని కూడా పోగొట్టుకుని, ఇల్లు వదిలిపెడతాడు.

వంటరిగా కాలం గడుపుతూ భర్తకు అత్యంతవసర సమయాన్న తన సహకారం, ప్రోత్సాహం అందించకపోవడం తన తప్పే అని గుర్తిస్తుంది జయా. మోహన్‌తో అన్యోన్యత ఉన్నా లేకపోయినా కూడా అతను లేకుండా, తనక్కొర్తే ఉండలేకపోతుందనీ తెలుసుకుంటుంది.
ఇంతలో ఒకసారి రాహుల్ కనపడకుండా పోవడం పరిస్థితిని మరింత గంభీరం చేస్తుంది. స్నేహితులూ, ఇరుగుపొరుగూ ఆమెని ఊరడించి సహాయం చేస్తారు. మోహన్‌కూ తనకూ మధ్య చోటు చేసుకుని, తమ సంబంధాన్నీ, పరస్పర నమ్మకాన్నీ చెడగొట్టిన 'దీర్ఘ మౌనాన్ని' గుర్తిస్తుంది జయా. చిన్నపిల్లగా ఉన్నప్పటినుండీ తన్ని నిర్లక్ష్యపెట్టబడ్డం వల్లే తన లోపల నిస్శబ్దం పేర్కొందని అనుకుంటుంది. తను వెంటనే ఇంటికి తిరిగి వస్తున్నాననీ, ఎంక్వైరీ బోర్డ్ తన శిక్ష రద్దు చేసిందనీ మోహన్ నుంచి టెలిగ్రామ్ వస్తుంది.

ఆ మధ్యకాలంలో తను పడిన సంఘర్షణ, సందేహం, వంటరితనం జయను ఒక కొత్త స్త్రీగా మారుస్తాయి. ఇకనుంచీ, అటువంటి దీర్ఘ నిస్శబ్దాన్ని తమ మధ్య కానీ తనయందు కానీ ప్రవేశించనీయకూడదని నిర్ణయించుకుంటుంది. జీవితకాలం ఆ నిస్శబ్దంలోనే గడిపేననుకున్నాకానీ, అది తన ఎంపికే తప్ప ఎవరూ తన మీద బలవంతంగా రుద్దినది కాదని ఆఖరికి గ్రహిస్తుంది.

తనకు హటాత్తుగా కలిగే అనుభూతుల ఆధారంపైన వెనువెంటనే ప్రతిస్పందించే స్వభావం మార్చుకుని, జయ పరిణితి చెందిన స్త్రీగా మారుతుంది. భార్యాభర్తల మధ్య పడిన బీట మాయమవుతుంది.

★★★

రచయిత్రి– కథనాన్ని గతానికీ, వర్తమానానికీ, భవిష్యత్తుకీ త్వరత్వరగా మారుస్తారు. కాల్పనిక కథే అయినప్పటికీ ఇది అనేకమైన స్త్రీలు తమకు అన్వయించుకోగలిగేదే. యీ కాలంలో ప్రతీ స్త్రీ తన హక్కుల గురించి ఎరిగినదై ఉండి, తన నిర్ణయం తాను తీసుకోగలిగేదే అయినప్పటికీ, ఆ మౌనం వారిలో కూడా కొనసాగుతుంది.

ఏవి జరిగాయో, జరగలేదో, జరగాల్సి ఉండాల్సిందో, జరగబోతున్నాయో, జరుగుతాయో– యీ ఏకభాషణలన్నీ జయ మనస్సులో ఊహించుకునేవే. నిర్దిష్టమైన కథాంశం అంటూ లేని నవలికలో ఉన్న పాత్రలు అనేకం. జయ గొంతుతో వినిపించే యీ ఉత్తమ పురుష కథనం– కుటుంబ సభ్యులందరితో, చుట్టుపక్కలవారితోనూ తనకున్న సంబంధాన్నీ, ప్రవర్తననీ విశ్లేషిస్తుంది. కథకురాలి ఏకపక్షమైన, పరిమితమైన పరిధిలో ఉండే కథలో, ఏ సంఘటనలో ఎంత నిజముంటుందో సులభంగా అర్థం కాదు.